

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 195

బుధవారం 5-10-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జ్యోతి ఖాతాలో మరో స్వర్ణం

జాతీయ క్రీడల్లో మహిళల 100 మీటర్ల విభాగంలో మెరిసిన ఏపీ అథ్లెట్ - స్పోర్ట్స్‌లో



మార్కెట్లకు జోష్

సెన్సెక్స్ 1,277 పాయింట్లు జూమ్
నిఫ్టీ 387 పాయింట్లు అప్ - బిజినెస్‌లో

సాక్షి
ఫ్యామిలీ
శ్రీకాకుళం
బుధవారం ॥ 5-10-2022





ముక్తి కోసం సాధన చేసేందుకు ఉపకరించే దక్షిణాయనంలో వచ్చే పండుగలలో దసరా ఒకటి. ఆధ్యాత్మిక శక్తిని పెంపొందింపచేసే సాధనతో, దైవ ఉపాసనతో కూడిన పండుగ దసరా. ఆసేతు హిమాచలం అత్యంత భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగలలో ఒకటైన ఈ దసరా గురించి...

పాలయమాం దేవీ!

దసరా అంటే పది జన్మల పాపాలను, పది రకాలైన పాపాలను పోగొట్టేది అనే అర్థం కూడా వ్యాప్తిలో ఉంది. ఈ పది రోజుల పండుగని 'నవ రాత్ర వ్రతం' అనీ, 'దేవీ నవరాత్రులు', 'శరన్నవ రాత్రులు' అని వ్యవహరిస్తాం. తొమ్మిది రోజులు నియమ నిష్ఠలతో జగన్మాతను పూజించే వ్రతం ఈ శరత్కాలంలో చేసే శరన్నవరాత్ర వ్రతం.

తొమ్మిది సంఖ్య పూర్ణత్వానికి సంకేతం. నవరాత్రులు ఆరాధించటమంటే పరమాత్మను పరిపూర్ణంగా ఆరాధించటం. నవరాత్రి అంటే నూతనమైన రాత్రి లేదా కొత్త రాత్రి అని అర్థం. తొమ్మిది రోజుల దీక్ష వలన పదవరోజు విజయం లభిస్తుంది. అంటే తొమ్మిది రోజుల దీక్షకు ఫలం లభిస్తుంది. కనుక పదవ రోజును 'విజయదశమి' పేరిట పండుగ జరుపుకుంటాము.

జగన్మాత ఆదిపరాశక్తి గొప్పదనాన్ని, మహిమను గురించి, దేవీ భాగవతం, మార్కండేయ పురాణం మొదలైన అనేక పురాణాలు, ఉపనిషత్తులు వివరిస్తాయి, త్రిపురా రహస్యంలో విపులమైన వివరణ కనిపిస్తుంది. అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మగా కొలవబడుతున్న జగన్మాత దుర్గమ్మ అనంతమైన నామాలతో పూజలందుకుంటోంది. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి, దుర్గ, పార్వతి, హైమవతి, అపరాజిత, భవాని, లలిత, జయంతి, మంగళ, భద్రకాళి, కాపాలిని, క్షమా, శివదూతి, స్వాహా, స్వధా, చాముండి, విష్ణుపత్ని, ఈశ్వరి ఇటువంటి అనేకమైన నామాలతో ఆరాధనలందుకుంటోంది.

మనలోని శక్తిని, శారీరకమైన, మానసికమైన, ఆధ్యాత్మికమైన శక్తిని జాగృత పరిచే, దైవ అనుగ్రహంతో, మంత్ర శక్తితో, నియమబద్ధమైన జీవితంతో జాగృత పరిచే ఒక వ్రతం ఈ నవరాత్ర వ్రతం. అందుకే దసరా నవరాత్రులలో ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి దశమి వరకు పది రోజులు ఈ జగన్మాతను బాలా త్రిపురసుందరిగా, గాయత్రీ మాతగా, అన్నపూర్ణాదేవిగా, శ్రీ మహాలక్ష్మి దేవిగా, శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా, శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా, సప్తమి రోజున శ్రీ మహా సరస్వతీ దేవిగా, అష్టమి నాడు దుర్గామాతగా, నవమి నాడు మహిషాసుర మర్దినిగా, దశమినాడు జయా విజయా సహిత అపరాజితా దేవిగా – రాజరాజేశ్వరీ దేవిగా ఆరాధిస్తాం. తొమ్మిది రోజులు కఠినమైన శారీరక, మానసిక, ఆధ్యాత్మికమైన నియమాలను పాటిస్తూ, నామ మంత్ర జపం, నామ పారాయణ చేస్తూ, కీర్తనలతో, భజనలతో కొలుస్తూ, ఉపవాస నియమాలను, నక్త వ్రతముల వంటి వాటిని పాటిస్తూ దశమినాడు చక్కగా జగన్మాతను షోడశోపచారాలతో పూజించి, అనేక విధాలైన పిండివంటలు తయారు చేసి, నైవేద్యం పెట్టి అమ్మను ఆరాధిస్తాం. ఆ పిండి వంటలను ప్రసాదంగా బంధుమిత్రులందరికీ పెట్టి, ఆరగిస్తాం.

ఆదిపరాశక్తిని లక్ష్మీ, గాయత్రీ, సరస్వతీ, రాధ, దుర్గా అనే ఐదు పరిపూర్ణ మూర్తులుగా ఆరాధిస్తారు.

యా దేవీ సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా !
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః!!

పరమేశ్వరుని సంకల్ప శక్తి జగన్మాత. ఆ సంకల్పం వల్లే సృష్టి స్థితి లయలన్నీ జరుగుతున్నాయి. ఆదిపరాశక్తి ప్రకృతి అయితే, పరమాత్మ పురుషుడు. ప్రకృతి పురుషుల కలయిక వల్లే సృష్టి యేర్పడుతుంది. అంటే శివపార్వతుల చిద్విలాసం యావద్విశ్వం. ఈశ్వరుడని కొలిచినా, విష్ణువు అని కొలిచినా, జగన్మాత అంబిక అని కొలిచినా ఉన్న శక్తి ఒక్కటే అని మనకి ఉపనిషత్తులు బోధిస్తున్నాయి. ఒక్కటిగా ఉన్న ఆ శక్తిని, చిచ్ఛక్తినే మనం అమ్మవారిగా, జగన్మాతగా ఆరాధిస్తున్నాము. చండీ సప్తశతిలో జగన్మాత మహాకాళిగా, మహాలక్ష్మిగా, మహా సరస్వతిగా దుష్ట రాక్షసులను దునుమాడిన వైనాన్ని కీర్తించారు.



శ్రీశైల భ్రమరాంబికాదేవి

అమ్మవారు దేవతలకు – ఎప్పుడు దుష్ట రాక్షసుల నుంచి బాధలు కలిగినా, తాను అవతరించి, దుష్ట శిక్షణ చేస్తానని అభయమిచ్చారు. జగన్మాత, యోగ నిద్రలో ఉన్న శ్రీమహావిష్ణువును జాగృత పరిచి, మధు కైటభులనే రాక్షసులను సంహరింపజేసింది. మహిషాసురుడు అనే రాక్షసుడు దేవతలను జయించి స్వర్గాన్ని ఆక్రమించగా, దేవతలు బ్రహ్మదేవునితో కలిసి శ్రీ మహావిష్ణువు, రుద్రుల దగ్గరికి వెళ్ళి మహిషాసురుని ఆగడాలను గురించి చెప్పారు. ఆ మాటలు వినగానే శివకేశవులకు ధర్మాగ్రహం కలిగింది. ఆ క్రోధం ఒక ఆకృతి దాల్చి, వెలుగు రూపంలో బయటకొచ్చింది. దేవతలందరి ముఖాల నుంచి తేజస్సు బయటికి వచ్చి, ఆ సమష్టి తేజస్సు ఒక మహాద్భుత రూపం దాల్చి, అష్టభుజాలతో మహాలక్ష్మీదేవిగా, ఆదిపరాశక్తిగా భాసించింది. ఈ తల్లిని దేవతలు 'అమ్మా! నీవే సర్వకారణభూతురాలివి, కార్య కారణ రూపిణివి, క్రియా రూపిణివి, నీవు లేనిదే ఏదీ లేదు, అంతా నీలోనే ఉంది తల్లి అంటూ కీర్తించారు. శక్తి లేకపోతే శివుడు కూడా ఏమీ చేయలేడు. కనీసం స్పందించను కూడా లేడట. శక్తి లేకపోతే, చలనం, స్పందన ఉండదు అని జగద్గురువు శ్రీ ఆదిశంకర భగవత్పాదులు సౌందర్యలహరిలో అమ్మవారి గురించి ప్రస్తుతించారు.

ఆమె మహిషాసురుడనే రాక్షసుడిని సంహరించి మహిషాసురమర్దినిగా కీర్తించబడింది.

జగన్మాతే ధూమ్రాక్షుడిని, రక్తబీజుడిని, చండ, ముండులను, శుంభ, నిశుంభులనే రాక్షసులను సంహరించింది. ఈ రాక్షసులందరూ బ్రహ్మదేవుని గురించి, పరమేశ్వరుని గురించి తపస్సులు చేసి వరాలు పొందినటువంటి వారు. దేవతల నుంచి ఎటువంటి భయాలు లేకుండా వరాలు పొందారు. కానీ స్త్రీ అంటే చులకన. ఆడవారు మననేం చేస్తారులే! అనే చులకన భావన స్త్రీల మీద! కనుకనే అమ్మవారు ఈ రాక్షసులందరినీ తనలో నుంచి బ్రాహ్మీ , వైష్ణవి, మహేశ్వరి, కౌమారి, ఐంద్రీ, వారాహి, నారసింహీ, చాముండా, శ్యామలా, కాళీ మొదలైన దేవతాగణాలను ఉద్భవింపజేసి, వారితో కలిసి రాక్షసులతో యుద్ధం చేసి, దానవులందరినీ సంహరించింది. ఈ దుష్ట రాక్షసులందరినీ జగన్మాత ఈ నవరాత్రులలో సంహరించినందున నవరాత్రులలో జగన్మాత వివిధ రూపాలను, అవతారాలను మనం కీర్తిస్తాం, ఆరాధిస్తాం. విజయదశమి నాడు, జగన్మాత దుష్ట రాక్షసులను సంహరించి విజయం సాధించిన రోజు కాబట్టి మనమంతా విజయదశమి పండుగను వేడుకగా జరుపుకుంటాం.

> **విజయదశమి దుష్టత్వం పైన దైవత్వం పొందిన విజయంగా జరుపుకుంటున్న పండగ. ఇప్పుడు రాక్షసులు లేకపోవచ్చు కానీ, మానవులలోనే దైవీ గుణాలుంటాయి, ఆసురీ గుణాలు ఉంటాయి. మనలోని ఆసురీ గుణాలను పోగొట్టుకుని, దైవీ గుణాలను వృద్ధి పరచుకోవాలి.**

విజయదశమి జరుపుకోవటంలో ఒక ప్రాంతానికి మరొక ప్రాంతానికి భేదం ఉండవచ్చు కానీ హైందవులందరూ ఈ పండుగ జరుపుకుంటారు. విజయదశమి పండుగ దుష్టత్వం పైన దైవత్వం పొందిన విజయంగా జరుపబడుతున్నది. మానవులలోనే దైవీ గుణాలుంటాయి, ఆసురీ గుణాలు ఉంటాయి. మనలోని ఆసురీ గుణాలను పోగొట్టుకుని, దైవీ గుణాలను వృద్ధి పరచుకోవాలి.

ఈ విజయదశమి పండుగ జరుపుకోవడానికి మనకు అనేక కారణాలు కనిపిస్తాయి. కాలంలో వచ్చే మార్పులను బట్టి దైవ శక్తిని ఆరాధించటం ఒక భావన అయితే, మనలోని దైవ శక్తిని వృద్ధిపరచుకోవటం, సమాజం లో అందరితో అన్యోన్యంగా సహకరిస్తూ ఉండటం అన్నది మరొక అంశం.

ఈ విజయదశమినాడే అర్జునుడు ఉత్తర గోగ్రహణంలో కౌరవుల మీద విజయం సాధించి విజయుడు అయ్యాడు. శమీ వృక్షం మీద పెట్టిన తమ ఆయుధాలలో నుంచి తన గాండీవాన్ని తీసుకుని యుద్ధం చేసి విజయం సాధించాడు కనుక మనం ఈనాడు విజయదశమి పండుగ జరుపుకుంటున్నాం. ఈనాడు శమీ వృక్షాన్ని పూజిస్తాం.

'శమీ శమయతే పాపం
శమీ శత్రు వినాశినీ!
అర్జునస్య ధనుర్ధారీ
రామస్య ప్రియ దర్శిని'

అని చెప్తూ శమీ వృక్షానికి ప్రదక్షిణలు చేసి నమస్కరిస్తాం. ఈ విజయదశమి పండగనాడు అందరూ కూడా ఈ శమీ పత్రాలను – శమీ వృక్షపు ఆకులను పెద్దలకు ఇచ్చి నమస్కరిస్తారు. పెద్దలు వాటిని తీసుకుని పిల్లలను ఆశీర్వదిస్తారు.

ఈ విజయదశమి రోజునే శ్రీరామచంద్రుడు రావణాసురుని సంహరించినందున, విజయదశమి రోజున 'రామలీల'ను ప్రదర్శిస్తారు. రావణ దహనం చేస్తారు. జగన్మాత ఆరాధన వలన, దుర్జనుల వలన సంఘానికి చేటు కలగకుండా, అధివ్యాధుల సమస్యలు లేకుండా దేశానికి భద్రత కలుగుతుంది.

అందుకే సాక్షాత్తూ ఆ జగజ్జనని మనని పాలిస్తూ ఉన్నట్లుగా.. ఆమె పాలనలో మనందరం క్షేమంగా.. సుఖంగా ఉన్నట్లు భావించుకుందాం. పూజించుకుందాం.

''అఖిలాండేశ్వరీ...
చాముండేశ్వరీ.. పాలయమాం
గౌరీ... పరిపాలయమాం
గౌరీ...'' అని ప్రార్థిస్తూ...
మనల్ని పాలించమని
అమ్మను
వేడుకుందాం.

- డా. తంగిరాల విశాలాక్షి,
విశ్రాంత ఆచార్యులు

మహిషం అంటే దున్నపోతు, జంతువు. మహిషాసురుడు అంటే జంతు తత్వం కలిగినటువంటి వాడు. రాజస తామస గుణాలకు ప్రతీకలు రాక్షసులు. మహిషాసురుడిని, చండ ముండులను, శుంభ, నిశుంభులను జగన్మాతసంహరించింది అంటే, మనలోనే ఉన్న కామ క్రోధాది అరిషడ్వర్గాలను, లోభ మోహాలను, అహంకారాన్ని నశింప చేసుకోవాలి అని గ్రహించాలి. చండ ముండాది రాక్షసులు దుర్మార్గమైన, ధర్మ విరుద్ధమైన బలదర్పాలకు ప్రతీకలు. కనుక అటువంటి బలహీనతలను జయించాలి. మనలోని రజోగుణాలను, తమో గుణాలను అరికట్టి, సత్వగుణాన్ని వృద్ధి పరచుకుని, శుద్ధ సత్వ గుణాన్ని పొందడానికి సాధన చేయాలి. అది ఈ జగన్మాతను నవరాత్రులలో ఆరాధించడం వలన సాధ్యపడుతుంది. శుద్ధ సత్వ గుణాన్ని వృద్ధి చేసుకుంటే దైవత్వాన్ని దర్శించగలుగుతాము, పొందగలుగుతాము.



మధు, కైటభులు అనే రాక్షసులు అహంకార మమకారాలకు ప్రతీకలు. నేను, నాది అనే భావాలకు ప్రతీకలు. మధువు అంటే తేనె. అన్నింటి కంటే మనకు ఇష్టమైనది, తీయనైనది ఎవరికి వారే! ఒక్క నేను అనేది ఉంటే, అనేకమైన నావి, నా వారు, నా బంధువులు, నా అధికారం, నా పదవులు వంటి అనేకమైనవి బయలుదేరతాయి. ఒక్క తేనె చుక్క ఉంటే, అనేకమైన కీటకాలు చుట్టూ చేరినట్లుగా, ఒక్క నేనుకి, అనేకమైన - నావి అనేవి బయలుదేరతాయి. ఈ నేను, నాది అనే అహంకార, మమకార భావాలను సంహరించటమే మధుకైటభములను సంహరించటం. ధూమ్రాక్షుడు లేక ధూమ్రలోచనుడు అంటే పొగ బారిన, మసకబారిన కన్నులు కలవాడు, అంటే అజ్ఞానంలో ఉన్నటువంటి వాడు అని అర్థం. కళ్ళు మసకబారినప్పుడు యదార్థం కనిపించదు. అలాగే అజ్ఞానం వలన జ్ఞానం బహిర్గతం కాదు. వివేక జ్ఞానం ఉదయించదు. కనుక మనలోని ఆ అజ్ఞానాన్ని సంహరించాలి. రక్తం అంటే రాగం, మోహం. రక్తబీజుడు అంటే ఎంత వద్దనుకున్నా మోహం అనే బీజం మొలకెత్తుతూనే ఉంటుంది. అందుకే కాళికాదేవి తన పెద్ద నాలుకను చాపి, ఆ రక్తబీజుని శరీరం నుంచి కారే రక్తబిందువులను మింగేసి, ఇంక మళ్ళీ రక్తబీజులు పుట్టే అవకాశం లేకుండా చేసింది. అప్పుడు జగన్మాత వాడిని సంహరించింది. అలాగే మనలోని రాగద్వేషాలను పూర్తిగా ఎప్పుడైతే మనం జయిస్తామో, అప్పుడు జగన్మాత దర్శనం మనకు ప్రాప్తిస్తుంది.

---

* పండగ

కళ 'పది'ంతలు

పండగ వేళ ఇల్లు కళగా వెలిగిపోవాలంటే ఏం చేయాలా అని ఎక్కువ ఆదుర్దా పడనక్కర్లేదు. సింపుల్‌గా అనిపిస్తూనే, ఎక్కువ శ్రమ లేకుండా కొన్ని వస్తువులతో అలంకరణ ద్వారా పండగ కళను రెట్టింపు చేసుకోవచ్చు. దశమి నాడు పది విధాల మేలైన కళ ఇది.



1. ఇత్తడి, రాగి పాత్రలు

ఇవి ఉంటే చిటికెలో పని అయిపోయినట్టే. అందులోనూ దేవతా రూపాలతో ఉన్న వస్తువులైతే అలంకరణ మరింత సులువు అయిపోతుంది. మర చెంబులు, వెడల్పాటి ప్లేట్లు ఉన్నా.. వీటిలో నీళ్లు పోసి పువ్వులు వేస్తే చాలు పండగ కళ వచ్చేసినట్టే.



2. డిజైనర్ రంగోలీ

ముంగిట్లో ముచ్చటైన రంగవల్లికలు అందం. అలాగని పెద్ద పెద్ద ముగ్గులు వేసే టైమ్ లేదు అనుకునేవారికి సింపుల్ చిట్కా.. మార్కెట్‌లో డిజైనర్ రంగవల్లికలు రెడీమేడ్‌గా దొరుకుతున్నాయి. సాయంకాలపు వెలుగుకు ఈ ముగ్గులు మరింత అందాన్ని తెచ్చిపెడతాయి.



3. పువ్వులు-ఆకులు

ముగ్గుల స్థానంలో పువ్వులు, ఆకులతో ఇలా ముచ్చటైన డిజైన్లుగా రూపుకట్టవచ్చు. ఈ అలంకరణ ఎప్పుడు చేసినా పండగ నట్టింట్లో కొలువుదీరినట్టే.



4. డిజైనర్ తోరణం

మామిడి, బంతిపూలతోనే కాదు ఇవి కూడా డిజైనర్ తోరణాలే. ఎంబ్రాయిడరీ జిలుగులు, అద్దకం, కుందన్స్ మెరుపులతో తీర్చిదిద్దిన అందమైన తోరణాలు ఎన్నో. వాటిని ఒకసారి తెచ్చుకుంటే ప్రతి పండగకూ మెరిపించవచ్చు. ఇలా అందమైన కళను తీసుకురావచ్చు.






5. వాల్ హ్యాంగింగ్స్

టెర్రకోట గంటలు, ఫెదర్ తో కూడిన పక్షుల బొమ్మలు .. ఇలా రకరకాల హ్యాంగింగ్స్ తెచ్చి గుమ్మం ముందు వేలాడదీస్తే ఎంత కళను తెచ్చిపెడతాయో కళ్లారా చూడాల్సిందే.



6. పువ్వుల హ్యాంగింగ్

ఎన్ని పూల దండలను వేలాడదీస్తే అంత అందంగా కనిపిస్తుంది ఇల్లు. అయితే, ఎక్కడ ఎలా అలంకరించాలో మాత్రం ఎవరి అభిరుచి వారిదే.



7. డెకార్ కుషన్స్

చిన్న చిన్న పిల్లోస్ లేదా కుషన్స్ సోఫా- దివాన్‌ల మీద వేస్తూ ఉంటారు. వాటికి రంగు రంగుల కాంబినేషన్‌లో ఉన్న కవర్స్ వేస్తే పండగ కళ అదిరిపోయిందనే కితాబు రాకుండా ఉండదు.



8. బొమ్మలు

దసరా పండగ అంటే చాలామంది బొమ్మల కొలువులతో అలరిస్తుంటారు. అన్ని బొమ్మలు లేకపోయినా ఈ పండగ నాడు కొన్న కొన్ని బొమ్మలతో షోకేస్‌ని అలంకరిస్తే చాలు. వాటిలో మన దేశీయ హస్త కళాకృతులను చేరిస్తే మరింత అందం వస్తుంది. దసరా పండగను పురస్కరించుకుని వచ్చిన వాల్ స్టిక్కర్స్‌ను కూడా ఉపయోగించవచ్చు.





9. పూజా ప్లేట్

పూజలలో వాడే ప్లేట్‌ని కూడా అందంగా అలంకరించుకోవచ్చు. డిజైనర్ థాలీ పేరుతో ఇవి మార్కెట్లో లభిస్తున్నాయి. పువ్వులు, ఆకులు, నెమలి ఈకలు.. మొదలైనవాటిని ఉపయోగించే పూజా ప్లేట్స్ లేదా అలంకరణ ప్లేట్లను తయారు చేసుకోవచ్చు.

10. నీటిపైన పువ్వులు

అలంకరణకు ఏ వస్తువులూ లేవని చింతించనక్కర్లేదు. కొన్ని రకాల పువ్వులను ఒక పెద్ద పాత్రలో ఉంచి గుమ్మానికి ఒక వైపున లేదా ఇంటి లోపల గుమ్మానికి ఎదురుగా అలంకరించినా చాలు... పండగ కళ రెట్టింపుగా మిమ్మల్ని పలకరిస్తుంది.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 195

బుధవారం 5-10-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

HOME IS WHERE THE STORY BEGINS...


MVV GV THE GRAND

Sai Priya Layout, Madhurawada, VIZAG



Madhurawada is an amazing neighbourhood spruced with development and design. Marked as the buzzing IT hub full of opportunities for software professionals, it is located on the stretch of NH 16. What makes this place special is its strong connectivity to the city centre, best proximity to schools, hospitals, malls and leisure zones all around. With the appreciation value growing exponentially each year, investing in MVV GV -The Grand is not just about living in the most happening community but also a great value for money.

GRAND LIFESTYLE AWAITS YOU!













PROJECT HIGHLIGHTS

- GVMC-Approved Gated community
- Super Deluxe Construction
- 100% Vaastu compliant
- Clubhouse (5 Floors)- 65,725 sft
- Fully Furnished 3-Star rated Luxury Guest suites
- Balaji Temple
- Indoor & Outdoor games
- Children's Play Area
- Terrace Swimming Pool at Clubhouse
- Ultra-modern Gym (Separate for Ladies & Gents)
- Supermarket
- 322 Seat Mini - Theatre / Auditorium
- Multi-cuisine Food courts & Restaurant
- Walking Track & Jogging Track
- Clinics
- Spa / Saloon / Beauty Parlour
- Designer Landscaped lawns with Sit-outs
- CCTV & Security Intelligence
- Sewage Treatment Plant (STP)
- Open air recreation lawn for small gatherings
- ATM
- Facility Management Initiative-Life membership
- Estate maintenance crew for each block
- 100% Power Back-up
- 24x7 Water & Security
- MyGate
- Wi-Fi Enabled Community
- On-Site Management
- Sewage Treatment Plant
- Valet Trash
- Round-the-clock Maintenance
- Outdoor Mosquito Trap
- Premium Lift Lobbies
- Emergency Assembly Point
- Individual Digital Water Meters
- Service / Cargo Lifts
- Fire Protection System

M.V.V BUILDERS
VISAKHAPATNAM

25 SUCCESSFUL YEARS

Corporate Office
1st Floor, D.No.4-62-1, Plot No. 21
MVV Builders, Near Post office
Lawsons Bay Colony
Visakhapatnam - 530017
www.mvvbuilders.com

Site Office
Plot No. 27, L.P No-2/91,
Madhurawada (Post)
Visakhapatnam - 530048
mvvgvthegrand.sales@gmail.com
www.mvvgvthegrand.com

For sales:
98489 16600, 99129 36600
90713 32233, 90713 30033


'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సాక్షి

సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 195

బుధవారం 5-10-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి విజయదశమి శుభాకాంక్షలు





ఆ వర్గాలకు ఎస్టీ హోదా

జమ్మూకశ్మీర్‌లోని గుజ్జర్, బకర్వాల్, పహాడీలకు ఎస్టీ హోదా కల్పిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు.

వివరాలు 6లో



జపాన్ మీదుగా కొరియా క్షిపణి

జపాన్ మీదుగా ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. దీన్ని ప్రమాదకరమైన చర్యగా అమెరికా అభివర్ణించింది.

వివరాలు 6లో



విరిగిపడిన మంచు చరియలు

ఉత్తరాఖండ్‌లో మంచు చరియలు విరిగి పడిన ఘటనలో 10 మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో



కశ్మీర్ డీజీ దారుణ హత్య

జమ్మూకశ్మీర్ జైళ్ల శాఖ డీజీ హేమంత్ లోహియా హత్యకు గురయ్యారు. పని మనిషి యాసిర్ హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

కొనసాగుతున్న అల్పపీడనం



పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఇది బుధవారం ఆంధ్రప్రదేశ్ తీరంపైకి ప్రవేశించనుంది. దీని ప్రభావంతో బుధ, గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమలో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం తెలిపింది.

వివరాలు 7లో ▸

రాహుల్ ప్రధాని అయితే ఏపీకి ప్రత్యేక హోదా



రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తారని కాంగ్రెస్ నేతలు, కేంద్ర మాజీ మంత్రులు జైరాం రమేష్, దిగ్విజయ్‌సింగ్ చెప్పారు. ఆ ఫైల్‌పైనే మొదటి సంతకం చేస్తారని ప్రకటించారు. రాహుల్‌గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్రను ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వివరాలు 11లో ▸

విషమంగానే ములాయం ఆరోగ్యం




సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్‌కు చికిత్స కొనసాగుతోంది. ఆయన పరిస్థితి విషమంగానే ఉందని సమాజ్‌వాదీ పార్టీ తెలిపింది.

వివరాలు 6లో ▸

మన మహిళలు నవదుర్గలు

సాధికారత దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విప్లవాత్మక నిర్ణయాలు

నవరత్నాలతో స్వయం శక్తి స్వరూపిణిగా అక్క చెల్లెమ్మలు ఆదర్శంగా నిలుస్తూ అన్ని రంగాల్లో రాణింపు నవ కాంతులు ప్రసాదించిన నవరత్న పథకాలు



రాష్ట్ర రాజకీయాల్లో అన్నింటా అర్ధ భాగం కంటే అధికంగానే దక్కించుకున్న అతివలు 'శైలపుత్రి'గా శక్తి సామర్థ్యాలు చాటుకుంటున్నారు.

జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనతో 'లలితాదేవి'గా బాలికలు ప్రకాశిస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇంగ్లిష్ మీడియం చదువులతో విజ్ఞానాన్ని సముపార్జిస్తూ 'గాయత్రి'గా విరాజిల్లుతున్నారు.

అమ్మ ఒడితో 'చదువుల తల్లి'గా రాణిస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ, గోరుముద్దతో 'అన్నపూర్ణదేవి'ని తలపిస్తున్నారు.

వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూతతో ప్రతి మహిళ 'మహాలక్ష్మి'గా అవతరిస్తోంది.

వైఎస్సార్ పెన్షన్ కానుక, ఇళ్ల పట్టాలతో అక్క చెల్లెమ్మలు 'దుర్గాదేవి'గా పురోగమిస్తున్నారు.

దిశ, సచివాలయ పోలీస్ లాంటి అస్త్రాలతో ప్రతి మహిళా 'మహిషాసురమర్దిని'గా ధైర్యంగా జీవిస్తోంది.

సాక్షి, అమరావతి: నవ దుర్గ అవతారాలకు ప్రతి రూపాలుగా ప్రతి అతివ నవరత్నాలతో పురోగమిస్తోంది. సామాజిక, రాజకీయ రంగాల్లో శక్తి స్వరూపిణిగా గుర్తింపు పొందుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్ర మహిళలు కీర్తి ప్రతిష్టలు సముపార్జిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రంగాల్లో దశ తిరిగిన మహిళా లోకానికి ఇది నిజమైన విజయ దశమిగా అభివర్ణిస్తున్నారు. నవకాంతులు ప్రసాదించడంలో నవరత్నాల పథకాలు కీలకపాత్ర పోషించాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

మహిళా సాధికారతలో సాటిలేదు..

మహిళా సాధికారతలో ఏపీ సాధించిన అద్భుతాలను గమనిస్తే దేశంలో మరే రాష్ట్రం మనకు సాటి లేదని చెప్పొచ్చు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం సీట్లు కేటాయించాలంటూ 1993 నుంచి పార్లమెంట్‌లో బిల్లులు పెడుతూనే ఉన్నా ఇప్పటి వరకు ఇచ్చిన దాఖలాలు లేవు. మన రాష్ట్రంలో

మిగతా 2వ పేజీలో ▶

విశాఖలోని దుర్గాలమ్మ ఆలయం వద్ద కొబ్బరి కాయలు కొడుతున్న ఎమ్మెల్యే గణేష్, ప్రజలు



3 రాజధానులకు మద్దతుగా ప్రత్యేక పూజలు

పలుచోట్ల ఆలయాల్లో కొబ్బరికాయలు కొట్టిన ప్రజాప్రతినిధులు, ప్రజలు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ)/ఇచ్ఛాపురం రూరల్/చినగంజాం: మూడు రాజధానుల ఏర్పాటుకు మద్దతు తెలుపుతూ, వాటికి ఎదురవుతున్న అడ్డంకులు తొలగిపోవాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఆలయాల్లో కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. విశాఖపట్నం పెదవాల్తేర్‌లోని శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయంలో అమ్మవారికి వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరి కాయలు కొట్టారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని పూర్ణామార్కెట్ వెలంపేటలోని దుర్గాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు నేతృత్వంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పూజలు చేసి వెయ్యి కొబ్బరి కాయలు కొట్టారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో జింక్ ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు కొట్టారు. శ్రీకాకుళం జిల్లా లొద్దపుట్టి ధనరాజులమ్మ ఆలయంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ నర్తు రామారావుయాదవ్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న జిల్లా టీడీపీ నాయకులు ఉత్తరాంధ్ర ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. బాపట్ల జిల్లా వంకాయలపాడులోని సంతానవేణు గోపాలస్వామి ఆలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు భవనం శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భవనం శ్రీనివాసరెడ్డి పూజలు చేశారు.

ఎన్నికల్లో పోటీ ప్రాథమిక హక్కు కాదు

అది చట్టబద్ధ హక్కు మాత్రమే

- నామినేషన్ తిరస్కరణ ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కాదు
- ఫలితాల తరువాత జిల్లా కోర్టులో పిటిషన్ వేయాలి
- ఎన్నికల అధికారి నియామకాన్ని కూడా అక్కడే సవాలు చేయాలి
- ఏపీ సెక్రటేరియట్ సెక్షన్ ఆఫీసర్ల సంఘం ఎన్నికల కేసులో హైకోర్టు తీర్పు

7లో



పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా విజయసాయిరెడ్డి

రవాణా, పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా నియామకం



సాక్షి, అమరావతి: కేంద్ర రహదారులు, నౌకాయానం, పౌరవిమానయానం, పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాజ్యసభ సచివాలయం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. తన నియామకం పట్ల విజయసాయి రెడ్డి స్పందిస్తూ.. రవాణా, పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ దన్‌ఖడ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తాను ఈ స్థాయికి చేరడానికి కారకులైన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటానని అన్నారు. తనపై అపార విశ్వాసం ఉంచిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషికి కృతజ్ఞతలు తెలిపారు. చిత్తశుద్ధి, అంకిత భావంతో బాధ్యతలను నిర్వర్తించి, దేశ పురోగతిలో భాగస్వామిని అవుతానని చెప్పారు.



భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

■ భౌతిక శాస్త్రంలో ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి ముగ్గురు సైంటిస్టులను వరించింది. ఫోటాన్‌లలో చిక్కుముడులు, క్వాంటమ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో చేసిన విశేష పరిశోధనలకు గాను అలెన్ ఆస్పెక్ట్(ఫ్రాన్స్), జాన్ ఎఫ్ క్లాసర్ (అమెరికా), ఆంటోన్ జీలింగర్ (ఆస్ట్రియా)కు నోబెల్ దక్కింది.

6లో

సెలవు

విజయదశమి సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున గురువారం సంచిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.

ఎన్నికల హామీలకు నిధులెలా తెస్తారు?



రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ

■ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత పథకాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఉచితాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సవరించాలని ఎన్నికల సంఘం నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల హామీల అమలుకు నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తారో ఓటర్లకు చెప్పాలని, ఈ ప్రతిపాదనపై ఈ నెల 19లోగా అభిప్రాయాలు తెలియజేయాలని అన్ని రాజకీయ పార్టీలకు మంగళవారం లేఖ రాసింది. మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలకు సంబంధించిన కచ్చిత సమాచారాన్ని ఓటర్లకు అందజేయాలని స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸

ఉద్యోగులకు 'ఈ-స్కూటర్లు'

- వాయిదా పద్ధతిలో ప్రభుత్వ, ప్రైవేట్ సిబ్బందికి సర్కారు అవకాశం.. 60 వాయిదాల్లో ధరను చెల్లించేలా ప్లాన్
- ఒక్కో వాహనంపై కిలోవాట్‌కు రూ.10 వేల వరకూ రాయితీ
- రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వేల చార్జింగ్ స్టేషన్లు

7లో

జాతీయ రిజిస్ట్రేషన్ల విధానంలోకి ఏపీ!

- దేశమంతా ఒకే రిజిస్ట్రేషన్ల విధానం కోసం కేంద్రం ప్రయత్నాలు
- ఇందుకోసం ఎన్‌జీడీఆర్ఎస్‌ను ప్రవేశపెట్టిన కేంద్రం
- ఇప్పటికే 12 రాష్ట్రాల్లో ఎన్‌జీడీఆర్ఎస్ సాఫ్ట్‌వేర్‌తోనే రిజిస్ట్రేషన్లు
- ఏపీలోని రేణిగుంట, కంకిపాడులోనూ ప్రయోగాత్మకంగా అమలు

8లో



6,603.63 టీఎంసీలు కడలిలోకి

- పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- కృష్ణా, గోదావరి, వంశధార నదుల్లో స్థిరంగా వరద
- గతేడాది కంటే ఈ ఏడాది ఇప్పటికే 3,546.46 టీఎంసీలు అధికంగా సముద్రంలోకి

9లో

ఇదండీ జగత్



ఒక్క కర్ణాటకలోనే అంటే మిగతా అంతా లేదని ఒప్పుకున్నట్లేగా..!



మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన బెజవాడ కనకదుర్గమ్మ

మహిషాసురమర్దినిగా

కరుణించిన కనకదుర్గ

- టీటీడీ తరపున కనక దుర్గమ్మకు సారె
- నేటితో ముగియనున్న దసరా ఉత్సవాలు
- నేడు జలవిహారం
- పెరుగుతున్న భవానీ భక్తులు

వివరాలు 7లో


తిరుమలలో రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం



తేరుపై తిరుమలవాసుడు!

అశ్వవాహనంపై విహరించిన ఆపదమొక్కులవాడు

7లో



సూర్యలంక తీరంలో ఆరుగురు గల్లంతు

- సముద్ర స్నానానికొచ్చిన 8 మంది విజయవాడ సింగ్‌నగర్ విద్యార్థులు
- ఒడ్డుకు కొట్టుకొచ్చిన మూడు మృతదేహాలు.. మరో ముగ్గురి కోసం గాలింపు.. ఇద్దరు క్షేమం

7లో

క్లుప్తంగా

వికేంద్రీకరణకు అమ్మవారి ఆశీస్సులు కోరండి

- విజయదశమి రోజు ఆలయాల్లో పూజలు చేయండి
- పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ పిలుపు

సాక్షి, అమరావతి : వికేంద్రీకరణకు అమ్మవారి ఆశీస్సులు కావాలని ఈ నెల 5వ తేదీన విజయదశమి రోజున రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించిందని ఆ పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. తాడేపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొబ్బరి కాయలు కొట్టి వికేంద్రీకరణకు అమ్మవారి ఆశీస్సులు కావాలని కోరుకోవాలన్నారు. 'సీఎం జగన్ రాష్ట్రంపై, ప్రజలపై మమకారంతో తెచ్చిన వికేంద్రీకరణ అజెండాకు అమ్మవారి మద్దతు కోరాలి. రాష్ట్రం అంతటికీ ప్రయోజనం చేకూరే ఆలోచనలకు అమ్మవారి ఆశీస్సులు పొందాలి. దుర్మార్గమైన ఆలోచనలు చేసే చంద్రబాబు, టీడీపీ నేతల మనసు మారాలని ప్రార్థించాలి' అని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ బాధ్యులు పాల్గొనాలని తెలిపారు.


కానూరులో బాలయ్య సందడి



పెనమలూరు: కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులో మంగళవారం రాత్రి సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సందడి చేశారు. పెద్ద ఎత్తున నిర్వహించిన ఆహా ఓటీటీ అన్‌స్టాపబుల్ సీజన్–2 ఈవెంట్ లాంచింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కానూరు 100 అడుగుల రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో ఆయన అభిమానులతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఇంటింటి రామయ్య సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ఆహా ఓటీటీ ప్లాట్‌ఫారంలో అన్‌స్టాపబుల్ ఈవెంట్ సీజన్ వన్‌ను విజయవంతంగా నిర్వహించామని, ఇప్పుడు సీజన్–2 అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించే విధంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సైబర్ అనలిటికల్ సెంటర్!

- రాష్ట్ర స్థాయిలో ఏర్పాటుకు పోలీస్‌శాఖ కసరత్తు
- సమగ్రమైన బ్లూప్రింట్‌తో ప్రభుత్వానికి నివేదిక
- సైబర్ నేరాలకు ఇక చెక్




సాక్షి, అమరావతి: సైబర్ నేరాల కట్టడి దిశగా రాష్ట్ర పోలీస్ శాఖ వ్యవస్థాగతంగా బలోపేతమవుతోంది. సాంకేతికంగా పటిష్టమైన వ్యవస్థను నెలకొల్పాలని నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాస్థాయిలో సైబర్ సెల్స్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్రస్థాయిలో ఓ కేంద్రీకృత వ్యవస్థగా సైబర్ నేరాల అనలిటికల్ సెంటర్‌కు ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే కేంద్ర హోంశాఖస్థాయిలో సైబర్ నేరాల అనలిటికల్ సెంటర్ ఉంది. రాష్ట్రస్థాయిలో కూడా సెంటర్ నెలకొల్పేందుకు సమగ్రమైన బ్లూప్రింట్‌తో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.

ఆరు విభాగాలతో కేంద్రీకృత వ్యవస్థ

సైబర్ కేసుల దర్యాప్తు సాధారణ కేసుల దర్యాప్తునకు భిన్నంగా ఉంటుంది. నేరాన్ని నిరూపించడం, న్యాయస్థానాల ద్వారా శిక్షలు విధించడం సవాల్‌తో కూడుకున్నది. అందుకే కేంద్రీకృత వ్యవస్థగా సైబర్ అనలిటికల్ సెంటర్ అవసరం. ఈ సెంటర్ ఆధ్వర్యంలో ఆరు విభాగాలు ఉంటాయి. నేరాల తీరును పరిశీలించేందుకు 'సైబర్ క్రైమ్ త్రెట్ అనలిటిక్స్ యూనిట్', ప్రజలకు అవగాహన కల్పించి సరైన ముందస్తు రక్షణ వ్యవస్థకు 'సైబర్ ఎకో సిస్టమ్ మేనేజ్మెంట్ యూనిట్', ఫిర్యాదులు చేసేందుకు 'రిపోర్టింగ్ పోర్టల్ యూనిట్', దీని పరిధిలో టోల్‌ఫ్రీ నంబర్, వాట్సాప్ గ్రూప్, వెబ్ పోర్టల్ ఉంటాయి. నేరాల దర్యాప్తునకు 'ఇన్‌వెస్టిగేషన్ యూనిట్', ఇందులో ఎనిమిది వరకు ఉండే విచారణ బృందాలు కేసుల దర్యాప్తు, ఇతర ప్రాంతాల్లో ఉన్న నేరస్తులను రప్పించడం, నేరాన్ని నిరూపించడం, న్యాయస్థానాల ద్వారా శిక్షలు విధించడం చూస్తాయి. కేంద్రహోంశాఖ, ఇతర రాష్ట్రాల పోలీస్ విభాగాలు, విదేశాల్లోని దర్యాప్తు విభాగాలతో సమన్వయం కోసం 'కో ఆర్డినేషన్ యూనిట్', ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సైబర్‌నేరాల పరిశోధనలో ఆధునిక విధానాలపై ఎప్పటికప్పుడు పరిశోధన, శిక్షణకు 'రిసెర్చ్– ట్రైనింగ్ యూనిట్' ఉంటాయి. సైబర్ అనలిటికల్ సెంటర్‌లోని వివిధ యూనిట్లలో సైబర్ నిపుణులను పోలీస్ శాఖ నియమించనుంది. రాష్ట్రంలోని 950 పోలీస్ స్టేషన్లు, జిల్లా పోలీస్ కార్యాలయాలను ఈ సెంటర్‌తో అనుసంధానిస్తారు. పోలీస్ శాఖ సమర్పించిన బ్లూప్రింట్‌కు ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదించింది.

మన మహిళలు నవదుర్గలు



సున్నా వడ్డీ పథకానికి మళ్లీ జీవం..

గ్రామీణ ప్రాంతాల్లో మైక్రో ఫైనాన్స్ సంస్థల అధిక వడ్డీ ఆగడాల నుంచి మహిళలను ఆదుకునేందుకు ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004లో పావలా వడ్డీ పథకాన్ని తొలిసారి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత అది సున్నా వడ్డీ పథకంగా మారింది. బ్యాంకు నుంచి తీసుకునే రుణాలను సకాలంలో చెల్లించే పొదుపు సంఘాల మహిళలకు ఈ పథకం ద్వారా వడ్డీని ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తోంది. 2014 తర్వాత విభజన అనంతరం అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో పథకం అమలు ఆగిపోయింది. పొదుపు సంఘాల మహిళలపై వడ్డీ భారం పడింది. దీనివల్ల సుమారు 18.36 శాతం పొదుపు సంఘాలు బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా మిగిలిపోయాయి. అప్పటిదాకా బాగా నడుస్తూ 'ఏ' కేటగిరిలో ఉన్న సంఘాలు 'సి', 'డి' గ్రేడ్లలోకి పడిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ సున్నా వడ్డీ పథకానికి తిరిగి జీవం పోశారు. గత మూడేళ్లలో ఈ పథకం ద్వారా మహిళా సంఘాల రుణాలకు సంబంధించి బ్యాంకులకు రూ.3,615.29 కోట్ల వడ్డీని ప్రభుత్వం చెల్లించింది. ప్రస్తుతం 99.6 శాతానికి పైగా పొదుపు సంఘాలు ఏ గ్రేడ్‌కు తిరిగి చేరాయి.

▶ మొదటి పేజీ తరువాయి

ఏ డిమాండ్లు, ఉద్యమాలు లేకపోయినా వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత నామినేటెడ్ పోస్టులు, నామినేషన్ కాంట్రాక్టుల్లో 50 శాతం మహిళలకే కేటాయిస్తూ చట్టం చేసి దేశానికి ఆదర్శంగా నిలిచింది. నామినేటెడ్ పదవుల్లో 51 శాతం మహిళలకు ఇచ్చిన తొలి ప్రభుత్వం ఇదే. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా శాసనమండలి వైస్ చైర్మన్‌గా జకియా ఖానంను నియమించారు. రాష్ట్ర తొలి చీఫ్ సెక్రటరీగా, ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గాను నీలం సాహ్ని నియమితులయ్యారు. గతంలో మహిళకు తొలిసారిగా హోంమంత్రి పదవి ఇచ్చి వైఎస్సార్ రికార్డు సృష్టిస్తే సీఎం వైఎస్ జగన్ హోంమంత్రిగా దళిత వర్గానికి చెందిన మేకతోటి సుచరితకు అవకాశమిచ్చి చిత్తశుద్ధి చాటుకున్నారు. తొలి మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా గిరిజన మహిళ పాముల పుష్పశ్రీవాణి, మలి విడతలో హోంమంత్రిగా దళిత వర్గానికి చెందిన తానేటి వనితతోపాటు మరో ముగ్గురు మహిళలకు కీలక మంత్రి పదవులు అప్పగించారు. రాష్ట్రంలో 13 జెడ్పీ చైర్మన్ల పదవుల్లో ఏడుగురు మహిళలే ఉన్నారు. 26 జెడ్పీ వైస్ చైర్మన్ పదవుల్లో 15 మహిళలకే దక్కాయి. 12 మేయర్ పోస్టులు, 24 డిప్యూటీ మేయర్ పదవులకుగానూ 18 మంది మహిళలే ఉన్నారు. స్థానిక సంస్థల నుంచి నామినేటెడ్ పదవుల్లోనూ మహిళలకే అగ్రపీఠం దక్కింది. దాదాపు 2.60 లక్షల వలంటీర్ ఉద్యోగాల్లో 53 శాతం, దాదాపు 1.30 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిలో 51 శాతం మహిళలకే ఇవ్వడం విశేషం.

ఆసరాతో ఆదుకున్నారు...

చంద్రబాబు సర్కారు మోసాలతో అప్పుల పాలైన పొదుపు సంఘాల మహిళలను సీఎం జగన్ వైఎస్సార్ ఆసరాతో ఆదుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి పొదుపు సంఘాల పేరిట ఉన్న బ్యాంకు రుణాలు మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో ఆయా సంఘాల ఖాతాల్లో జమ చేస్తున్నారు. రాష్ట్ర బ్యాంకర్ల సంఘం (ఎస్‌ఎల్‌బీసీ) లెక్కల ప్రకారం ఎన్నికలు జరిగిన తేదీ నాటికి 78.76 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్న 7.97 లక్షల పొదుపు సంఘాల పేరిట రూ.25,517 కోట్లు రుణాలు ఉండగా ఇప్పటికే రెండు విడతల్లో రూ.12,758.28 కోట్లను ప్రభుత్వం ఆయా మహిళల ఖాతాల్లో జమ చేసింది. 2020 సెప్టెంబరులో తొలి విడతలో రూ.6,318.76 కోట్లు, రెండో విడతగా 2021 అక్టోబరులో మరో రూ.6,439.52 కోట్లను మహిళలకు అందజేసింది.

అమ్మ ఒడి.. చదువులమ్మ గుడి

ప్రతి తల్లి తన బిడ్డలు మంచి చదువులు చదువుకోవాలని, ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తుంది. వాటిని నెరవేర్చేలా విద్యారంగ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ఏటా రూ.వేల కోట్లను ఖర్చు చేస్తున్నారు. చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా ప్రభుత్వమే భరించేలా వివిధ పథకాలు అమలు చేస్తున్నారు. మూడేళ్ల వయసులో అంగన్‌వాడీల కేంద్రాలకు వచ్చే దశ నుంచి పాఠశాల విద్య, ఇంటర్ విద్య, ఉన్నత విద్య పూర్తి చేసేవరకు పేద పిల్లల చదువుల వ్యయాన్ని ప్రభుత్వమే భరించేలా వలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. సంతృప్తస్థాయిలో వాటిని అమలు చేయడమే కాకుండా తల్లిదండ్రులపై నయాపైసా భారం లేకుండా ప్రభుత్వమే భరిస్తోంది. జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, మనబడి నాడు–నేడు లాంటి పథకాలను రూ.వేల కోట్లతో అమలు చేస్తున్నారు. డిజిటల్ విద్య అందించేందుకు వీలుగా 8వ తరగతిలోకి వచ్చే విద్యార్థులకు ఏటా ఉచితంగా ట్యాబ్‌లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉన్నత విద్యా రంగంలో జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలను అమలు చేస్తున్నారు. గతంలో ఉన్నత విద్యార్థులకు ఇచ్చే ట్యూషన్ ఫీజులు నామమాత్రంగా ఉండగా ఇప్పుడు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వమే భరిస్తోంది. అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో పాఠశాల, ఉన్నత విద్యపై రూ.55,064.13 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది. ఇందులో పాఠశాల విద్యార్థుల కోసం రూ.43,236.67 కోట్లు వ్యయం చేయగా ఉన్నత విద్యార్థుల కోసం రూ.11,827.46 కోట్లు వెచ్చించింది. ప్రభుత్వ పాఠశాలల్లో 47,32,065 మంది విద్యార్థులు చదువుతుండగా ఒక్కో విద్యార్థిపై రూ.91,369.56 చొప్పున ఖర్చు చేసింది. ఉన్నత విద్యారంగంలో 11,02,000 మంది విద్యార్థులుండగా ఒక్కొక్కరిపై రూ.1,07,327 చొప్పున వ్యయం చేసింది. అమ్మ ఒడి కింద ప్రతి తల్లికి ఏటా రూ.15 వేలు చొప్పున అందిస్తుండగా విద్యా దీవెన, వసతి దీవెన నిధులను కూడా తల్లుల ఖాతాల్లోనే జమ చేస్తున్నారు.

మహిళా భద్రతకు 'దిశ' దిక్సూచి

మహిళా భద్రతలో ఆంధ్రప్రదేశ్ దేశానికే దిక్సూచిగా నిలుస్తోంది. రాష్ట్ర మహిళల చేతిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన బ్రహ్మాస్త్రం దిశ యాప్ ఉంది. ఆపదలో ఉన్న అక్క చెల్లెమ్మలకు నిముషాల్లోనే రక్షణ కల్పించే అన్నలా దిశ యాప్ భరోసానిస్తోంది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే నిశ్చింతగా ఉండవచ్చన్న విశ్వాసాన్నిస్తోంది. దిశ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించడమే కాకుండా అందుకు అవసరమైన మౌలిక వ్యవస్థను కూడా రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. దిశ పోలీస్ స్టేషన్లు, దిశ పెట్రోలింగ్ వాహనాలు, కమాండ్ కంట్రోల్ రూమ్‌తోపాటు ప్రత్యేక ప్రాసిక్యూటర్లను నియమించింది. దిశ యాప్‌పై సీఎం జగన్ స్వయంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా పోలీసు శాఖ ఇతర శాఖలతో కలసి మహిళలను చైతన్యం చేస్తోంది. ఇప్పటివరకు 1.35 కోట్ల మంది దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం విశేషం. దిశ యాప్‌ను ఆశ్రయించడం ద్వారా దాదాపు 12 వేల మంది మహిళలు రక్షణ పొందారు. మన రాష్ట్ర మహిళలు ఇతర రాష్ట్రాల్లో ఆపదలో చిక్కుకున్నా సరే దిశ యాప్ వారిని ఆదుకోవడం విశేషం. వైఎస్సార్ జిల్లాకు చెందిన ఓ మహిళ ఢిల్లీలో ప్రమాదంలో చిక్కుకుని దిశ యాప్ ద్వారా పోలీసులను ఆశ్రయించగా, మన రాష్ట్ర పోలీసులు తక్షణమే స్పందించి ఢిల్లీ పోలీసుల ద్వారా భద్రత కల్పించి సురక్షితంగా స్వరాష్ట్రానికి తెచ్చారు. మహిళలపై వేధింపులు, దాడుల కేసుల సత్వర దర్యాప్తు, న్యాయస్థానాల్లో విచారణకు కూడా దిశ వ్యవస్థ దోహదపడుతోంది. గుంటూరు జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని రమ్య హత్య కేసులో నిందితుడిని గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేసి ఏడు రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయగా... 8 నెలల్లో న్యాయస్థానం విచారణ పూర్తిచేసి దోషికి ఉరిశిక్ష విధించేలా చేశారు. దిశ యాప్ ప్రభావంతో రాష్ట్రంలో మహిళలపై దాడులు, వేధింపులు తగ్గాయని జాతీయ నేర గణాంకాల నివేదిక (ఎన్‌సీఆర్‌బీ) 2021 వెల్లడించింది. మహిళలకు భద్రత కల్పించడంతో సమర్థంగా పని చేస్తున్న దిశ యాప్ జాతీయ స్థాయిలో 19 అవార్డులు సాధించింది.

'చేయూత'తో శాశ్వత జీవనోపాధికి శ్రీకారం

గతంలో ఏ ప్రభుత్వమూ పట్టించుకోని 45–60 ఏళ్ల వయసున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు సైతం ఆర్థిక దన్ను కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిద్వారా అర్హులైన లబ్ధిదారులకు వివిధ కార్పొరేషన్ల ద్వారా నాలుగు విడతల్లో రూ.75 వేలు అందిస్తారు. 26.39 లక్షల మంది మహిళలకు మూడు విడతల్లో రూ.14,110.61 కోట్లను ఈ పథకం ద్వారా ప్రభుత్వం అందించింది. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల ద్వారా ప్రభుత్వం చేకూర్చే లబ్ధితో మహిళలకు శాశ్వత జీవనోపాధులు కలిగేలా అమూల్, హిందూస్థాన్ యూనీలీవర్, ఐటీసీ, ప్రోక్టర్ అండ్ గాంబుల్, రిలయెన్స్ రిటైల్, అజియో లాంటి ప్రముఖ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. మల్టీ నేషనల్ సంస్థల సహకారం, ప్రభుత్వం అందించిన తోడ్పాటుతో 5,28,662 కుటుంబాలు వివిధ వ్యాపారాలు, ఆదాయ మార్గాల ద్వారా శాశ్వత జీవనోపాధి పొందుతున్నాయి.

సంపూర్ణ పోషణ.. గోరుముద్ద

రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారు. ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారాన్ని సమకూర్చడంతోపాటు అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చి బలవర్ధక ఆహారం అందిస్తున్నారు. వారికి ఇంగ్లిష్ మీడియం ప్రారంభిస్తున్నారు. ఏడు షెడ్యూల్ ప్రాంతాల్లో మంచి పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఈ పథకం ద్వారా 30.16 లక్షల మందికి మేలు జరుగుతోంది. ఈ పథకానికి గత ప్రభుత్వం ఏటా కేవలం రూ.600 కోట్లు ఖర్చు చేయగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా రూ.2 వేల కోట్లను వెచ్చిస్తోంది. బడికెళ్లే పిల్లలకు జగనన్న గోరుముద్ద ద్వారా రోజుకో రకమైన మెనూతో బలమైన ఆహారాన్ని అందిస్తున్నారు.

లక్షాధికారి అవుతున్న పేదింటి మహిళ

సొంతిల్లు సామాన్యుల ఆత్మగౌరవానికి ప్రతీక. ప్రతి అక్కచెల్లెమ్మ తమకంటూ సొంత ఇల్లు ఉండాలని కోరుకుంటారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేసిన సీఎం జగన్ రాష్ట్రంలో లక్షల మంది మహిళల సొంతింటి కలను నెరవేర్చే మహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో 31 లక్షలకుపైగా ఇళ్లను నిర్మిస్తున్నారు. మహిళల పేరిట ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు, పట్టణ, నగర ప్రాంతాల్లో రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల విలువైన స్థలాలను మహిళల పేరిట ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చింది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేయడంతో పాటు పావలా వడ్డీతో రూ.35 వేల చొప్పున రుణ సాయం అందేలా చర్యలు తీసుకుంది. ఉచితంగా ఇసుక, సబ్సిడీపై ఇనుము, సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రిని సరఫరా చేస్తున్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పేదలపై భారం వేయకుండా కనీస సదుపాయాలను ప్రభుత్వమే ఉచితంగా కల్పిస్తోంది. ఒక్కో మహిళకు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన ఆస్తులను సమకూర్చడం పేదింటి మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దుతోంది. మొత్తంగా రాష్ట్రంలోని 31 లక్షల మంది మహిళలకు రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల సంపద సమకూరుస్తోంది.

అగ్రవర్ణ పేద మహిళలను ఆదుకున్న ప్రభుత్వం

వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా దేశంలోనే తొలిసారిగా అగ్రవర్ణ పేద మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందచేస్తోంది. 45 – 60 ఏళ్ల వయసున్న దాదాపు 3.93 లక్షల మంది ఓసీ అక్క చెల్లెమ్మలకు ఆర్థిక సాయం అందుతోంది. ఒక్కో కుటుంబానికి ఏటా రూ.15 వేల చొప్పున వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. ఇది కాకుండా కాపు నేస్తం, లా నేస్తం లాంటి పథకాల ద్వారా కూడా అగ్రవర్ణ మహిళలకు ప్రభుత్వం మేలు చేస్తోంది.

యానాదులు.. అడ్రస్‌లేని అనాథలు కాదు

- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కరేడు గ్రామం పార్లుకట్ట సంగంలో తొమ్మిది నెలల చిన్నారి కత్తి కృపా సాహిత్య గుండెకు రంధ్రం ఉందని తెలుసుకున్న నిరుపేద తల్లిదండ్రులు వాణి, శేషయ్యలు విలవిల్లాడిపోయారు. ఈ విషయం నెల్లూరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) అధికారుల దృష్టికి తీసుకెళ్లంతో సాహిత్యకు ఈ ఏడాది మార్చి 17న ఆధార్ నమోదు చేయించి ఆరోగ్యశ్రీ కార్డులో చిన్నారి పేరు చేర్పించి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా గుండె శస్త్రచికిత్స చేయించారు. సాహిత్య ఆరోగ్యం మెరుగుపడటంతో ఆ కుటుంబంలో ఆనందానికి అవధుల్లేవు.



- కోటిరెడ్డిగుంట యానాది కాలనీలో నాలుగేళ్ల గిరిజన బాలుడు మానికల బాల కోటయ్యకు పుట్టుకతో చూపు లేదు. నానమ్మ తాతయ్యల సంరక్షణలో వున్న అతని గురించి తెలుసుకున్న నెల్లూరు ఐటీడీఏ అధికారులు ఆ గూడేనికి మొబైల్ ఆధార్ కిట్ పంపించి ఆధార్ నమోదు చేయించారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఐటీడీఏ అధికారుల చొరవతో ఆపరేషన్ చేయించి కోటయ్యకు చూపును ప్రసాదించారు.



- ఫలిస్తున్న నెల్లూరు ఐటీడీఏ చొరవ
- ప్రత్యేక ఏర్పాట్లతో 11 నెలల్లో 17,131 మందికి కొత్త ఆధార్ కార్డులు
- వీరిలో 12వేల మంది పిల్లల్ని బడిలో చేర్పడంతో 'అమ్మఒడి' మంజూరు
- పసి పిల్లలకు అత్యవసర వైద్యంతో పాటు బడిలో చేర్పేందుకు యుద్ధ ప్రతిపాదికన ఆధార్ కార్డుల జారీ

పైలట్ ప్రాజెక్టుతో గొప్ప ఫలితాలు



వేలాది మంది యానాదులకు ఎన్నో ఏళ్లుగా ఆధార్ కార్డుల్లేవు. ఇటుక పరిశ్రమలు, భవన నిర్మాణం, వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగులో పనులకు వీరు ఇక్కడనుంచి పెద్ద సంఖ్యలో వలస వెళ్తుంటారు. దీంతో వీరికి ఆధార్ కార్డుల జారీ క్లిష్టంగా మారింది. కొందరు ఆధార్ నమోదుపై శ్రద్ధ చూపకపోవడం.. మరికొందరు పోగొట్టుకోవడం జరుగుతోంది. అలాగే, వీరిలో అక్షరాస్యత తక్కువగా ఉందని ఇటీవల తేలడంతో వీరి పిల్లల్ని బడిలో చేర్పించేందుకు ప్రయత్నించినప్పుడు ఆధార్‌లేదని తేలింది. వీటి జారీకి నెల్లూరు ఐటీడీఏలో ప్రత్యేక ఏర్పాట్లుచేశాం. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా వారికి సంక్షేమ పథకాలందిస్తూ గొప్ప ఫలితాలు సాధిస్తున్నాం.

– డాక్టర్ రాణి మంద, ప్రాజెక్టు అధికారి, నెల్లూరు ఐటీడీఏ (యానాదులు)

సాక్షి, అమరావతి :

..ఇలా నెల్లూరు ఐటీడీఏ ఆధ్వర్యంలో 'ఆధార్' పొందుతున్న యానాదులు ఎందరో. 2002 ఫిబ్రవరి 5న ప్రారంభించిన ఈ ఐటీడీఏ.. ప్రాజెక్టు పరిధిలోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం, వైఎస్సార్ కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని గిరిజనులకు ఎనలేని సేవలందిస్తోంది. ప్రధానంగా నెల్లూరు జిల్లాలో ఉన్న 2.51 లక్షల మంది గిరిజనుల్లో దాదాపు లక్ష మందికిపైగా ఏళ్ల తరబడి కనీసం ఆధార్ లేదని ఐటీడీఏ అధికారులు గుర్తించారు. వారికి విద్య, వైద్యంతోపాటు సంక్షేమ పథకాలు అందించేందుకు ఆధార్ తప్పనిసరి అయ్యింది. ఈ పరిస్థితిలో గతేడాది ఆగస్టు 9న నెల్లూరు పట్టణంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో గిరిజనులకు ఆధార్ కార్డుల అంశం ప్రస్తావనకు వచ్చింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించిన జిల్లా అధికారులు గతేడాది అక్టోబర్ 11న నెల్లూరు ఐటీడీఏ కార్యాలయంలో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. చాలామంది ఇక్కడికొచ్చి ఆధార్ నమోదు చేయించుకోలేకపోతున్నారనే విషయాన్ని గుర్తించి మరో ఐదు మొబైల్ ఆధార్ కిట్లతో యానాదుల గూడెంలకే వెళ్లి ఆధార్ నమోదు ప్రక్రియను చేపట్టారు. 11 నెలలుగా ప్రత్యేక కార్యాచరణతో బోగోలు, బుచ్చిరెడ్డిపాళెం, చిల్లకూరు, దగదర్తి, కలువాయి, కావలి, ముత్తుకూరు, నెల్లూరు రూరల్, నెల్లూరు అర్బన్, పొదలకూరు, రాపూరు, సింగరాయకొండ, శ్రీకాళహస్తి, సైదాపురం, టీపీ గూడూరు, ఉలవపాడు, వెంకటాచలం తదితర గ్రామాలకు చెందిన 17,131 మంది గిరిజనులకు కొత్త ఆధార్ కార్డులు జారీచేశారు. వారిలో 12 వేల మందికిపైగా విద్యార్థులను బడిలో చేర్పించి జగనన్న అమ్మఒడి అందేలా చేశారు. రైతుభరోసా, చేయూత, వాహనమిత్ర, మత్స్యకార భరోసా, హౌసింగ్, రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు, పింఛన్లు అందుకునేలా తోడ్పాటును అందించడంతో తాము ఇప్పుడిక అనాథలం కాదంటూ యానాదులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛతలో మనమే మేటి

- ఈ ఏడాది జాతీయ స్థాయి అవార్డుల్లో టాప్‌లో ఏపీ
- టాప్ టెన్‌లో విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాలు..
- మొత్తం 11 జాతీయ స్థాయి అవార్డులు
- అన్ని విభాగాల్లో కలిపి 27 అవార్డులు
- టాప్–100 బెస్ట్ సిటీస్‌లో 7వ స్థానం
- ఏటా పెరుగుతున్న స్వచ్ఛ నగరాలు
- రాష్ట్రానికి 2020లో నాలుగు, 2021లో ఆరు అవార్డులు

సాక్షి, అమరావతి: పరిశుభ్రతలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. పరిశుభ్రతను పెంపొందించేందుకు, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏడేళ్ల క్రితం ప్రవేశపెట్టిన 'స్వచ్ఛత' కార్యక్రమం అవార్డుల్లో రాష్ట్రం నంబర్ వన్‌గా నిలుస్తోంది. ఏ పోటీల్లో పాల్గొనే పట్టణాలు, నగరాల సంఖ్య ఏటేటా పెరుగుతున్నా, రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాలు మేటిగా నిలుస్తున్నాయి. అధికశాతం అవార్డులు పొందుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం 2016లో 73 నగరాలు, పట్టణాలతో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం ప్రారంభించింది. 2022 సంవత్సరానికి ఈ పోటీలో పాల్గొనే పట్టణాలు/నగరాల సంఖ్య 4,354కు చేరింది. ముఖ్యంగా కాలుష్యంతో నిండిపోయిన గంగా నదిని సాధ్యమైనంత మేర వ్యర్థాలు నదిలో కలవకుండా ఉండేందుకు ఈ నదీ పరివాహక ప్రాంతంలోని 91 పట్టణాలు, నగరాలను సైతం ఇందులో భాగం చేశారు. అయినా అవార్డుల్లో రాష్ట్రం ముందుంటోంది. గతంలో ఒకట్రెండు అవార్డులకే పరిమితమైన రాష్ట్రం.. గత మూడేళ్లుగా వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, విధానాలతో రాష్ట్రం పరిశుభ్రతలో మేటిగా నిలుస్తోంది. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ నగరాల్లో చురుగ్గా పనిచేయడంతో పారిశుద్ధ్యం మెరుగుపడింది. 2022 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఆంధ్రప్రదేశ్ మూడు జాతీయ స్థాయి బెస్ట్ అవార్డులను సొంతం చేసుకుని దేశంలో ఎక్కువ పురస్కారాలను అందుకున్న రాష్ట్రంగా నిలిచింది. వివిధ కేటగిరీల్లో మొత్తం 27 అవార్డులనూ రాష్ట్రం పొందింది. అంతేగాక టాప్–100 బెస్ట్ సిటీస్‌లో 7వ స్థానం సొంతం చేసుకుంది. 2020లో ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో నాలుగు, 2021లో ఆరు, 2022లో 11 బెస్ట్ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ ఏడాది విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి టాప్–10 నగరాల్లో నిలిచాయి. ఆయా నగరాల్లో ఉత్తమ పారిశుద్ధ్య విధానాలను అనుసరిస్తున్నామని, అందుకే అవార్డులు వస్తున్నాయని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా విజయవాడ, విశాఖ సమీపంలో అందుబాటులోకి వచ్చిన వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు, చెత్తను ఎప్పటికప్పుడు వాటికి తరలించడం, వీధుల్లో చెత్త బుట్టలను తొలగించడంతో పాటు ప్రతిరోజు ఇంటింటి చెత్త సేకరణ వంటివి బాగా ఉపయోగపడ్డాయి. తిరుపతిలో కూడా బయో మెథనైజేషన్ విధానాలు, ప్లాస్టిక్ నిషేధం వంటివి ఉత్తమ నగరంగా నిలిపాయి. వీటికితోడు ఎస్టీపీలు, ఎఫ్ఎస్టీపీలు కూడా రాష్ట్ర ర్యాంకు మెరుగుపడేందుకు ఉపయోగపడ్డాయి.

పకడ్బందీగా సర్వే

కేంద్ర స్వచ్ఛ భారత్ మిషన్ సభ్యులు సర్వేక్షణ్ సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తారు. కేంద్ర బృందాలు ఏడాది పొడవునా ఆయా నగరాలు, పట్టణాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్నాయి. దీంతోపాటు స్థానిక ప్రజల నుంచి 'సిటిజన్ వాయిస్' తీసుకోవడం, సర్టిఫికేషన్, ఫీల్డ్ వెరిఫికేషన్ వంటి విధానాలను అనుసరిస్తున్నాయి. ఒక్కో పట్టణంలోని 6 వేల మందికి పైగా ప్రజలకు ఫోన్లు చేసి, పట్టణంలో చేపడుతున్న అన్ని రకాల పారిశుద్ధ్య పనులపై ఆరా తీస్తారు. ఇలా ప్రజలు ఇచ్చే ఫీడ్ బ్యాక్‌నే ప్రధానంగా పరిగణనలోకి తీసుకుని అవార్డులకు ఎంపిక చేస్తారు. ఈ ఏడాది భారతదేశ 75వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని 'ఆజాదీ స్వచ్ఛ సర్వేక్షణ్' పేరుతో ప్రత్యేకంగా నిర్వహించారు. ఇందులో వృద్ధులు, యువత అభిప్రాయాలకు పెద్దపీట వేశారు.

వచ్చే ఏడాది మరిన్ని టాప్ ర్యాంకులు

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ప్రజాభిప్రాయానికే ప్రాధాన్యం ఇస్తారు. మన పట్టణాలు, నగరాల్లో పారిశుద్ధ్య విధానాలపై ఫీడ్ బ్యాక్ తీసుకుని మార్కులు ఇస్తారు. గత మూడేళ్లుగా ప్రభుత్వం పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణతో పాటు, వీధులను పరిశుభ్రంగా ఉంచుతున్నాం. పారిశుద్ధ్య పనులను కమాండ్ కంట్రోల్ విభాగం నిరంతరం పరిశీలిస్తోంది. ప్రస్తుతం 14 పట్టణాల్లో ఎస్టీపీల నిర్మాణం పూర్తయింది, మరో 18 నిర్మాణంలో ఉన్నాయి. వచ్చే ఏడాదికి మొత్తం 123 పట్టణాల్లో ఎస్టీపీలు అందుబాటులోకి తెస్తాం. అన్నిచోట్లా చెత్త తరలింపు వాహనాలు కూడా అందుబాటులోకి వస్తాయి. అందువల్ల 40కి పైగా పట్టణాలు, నగరాలు ఉత్తమ అవార్డులను సొంతం చేసుకొనే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ

రూ. 75 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం

- కడప నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తెచ్చిన ముఠా

సాక్షి, హైదరాబాద్: ఏపీలోని కడప జిల్లా లంకమల్ల రిజర్వ్ ఫారెస్ట్ నుంచి అక్రమంగా ఎర్రచందనం దుంగల్ని కల్వకుర్తి మీదుగా హైదరాబాద్ తరలించి విక్రయించేందుకు ప్రయత్నించిన ఓ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.75 లక్షల విలువైన దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు హైదరాబాద్ సంయుక్త పోలీసు కమిషనర్ కార్తికేయ తెలిపారు. డీసీపీ చక్రవర్తి గుమ్మితో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడపలోని ప్రొద్దుటూరుకు చెందిన షేక్ అబ్దుల్లా గతంలో ఐస్‌క్రీమ్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసి నష్టపోవడంతో ఎర్రచందనం దందాలో దిగితేనే తేలిగ్గా డబ్బు సంపాదించవచ్చని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం కడపకే చెందిన ఎర్రచందనం కేసుల పాత నేరస్తుడు రవిచంద్రను సంప్రదించి అరటన్ను బరువుగల 25 ఎర్రచందనం దుంగల్ని కొన్నాడు. వాటిని తన ప్రాంతానికే చెందిన సివిల్ కాంట్రాక్టర్ సాయంతో వాహనంలో ఎండు గడ్డి మాటున దాచి జడ్చర్ల వరకు తరలించాడు. అక్కడ నుంచి ఎటు వెళ్లాలో, ఎక్కడ దాచాలో అర్థం కాక కల్వకుర్తికి చెందిన తన స్నేహితులైన ఇనాయత్ ఖాన్, అబ్దుల్ ఖదీర్‌లను సంప్రదించాడు. వాళ్ల సూచన మేరకు సరుకును కల్వకుర్తికి తీసుకెళ్లి అక్కడున్న వాళ్ల పొలాల్లో పాతిపెట్టాడు. శాంపిల్‌గా చిన్న ముక్కలు తీసుకున్న నిందితులంతా హైదరాబాద్ వచ్చి కొనుగోలుదారుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు నిందితుల్ని అరెస్టు చేశారు.



"మీ లోపాలను ఎత్తి చూపే ఒక వివేకవంతుడైన విమర్శకుడిని మీరు కనుగొంటే కనుక, గుప్తనిధికి దారి చూపించే వ్యక్తిగా కూడా మీరు అతడిని అనుసరించండి.

– గౌతమ బుద్ధుడు

సాక్షి

బుధవారం, అక్టోబర్, 5

స్వదేశీ ఆయుధ సంపత్తి

విజయదశమి.. ఆయుధపూజ వేళ... భారత వాయుసేన (ఐఏఎఫ్) అమ్ములపొదిలోకి మరో అస్త్రం వచ్చి చేరింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన అత్యాధునిక తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ (ఎల్‌సీహెచ్) 'ప్రచండ' చేరికతో మన సైన్యానికి కొత్త జవసత్వాలు సమకూరాయి. జోధ్‌పూర్ వైమానిక కేంద్రం వేదికగా సోమవారం సైనిక ఉన్నతాధికారులతో కలసి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తొలివిడతగా నాలుగు హెలికాప్టర్లను లాంఛనంగా వాయుసేనలోకి ప్రవేశపెట్టారు. పలు విధాలుగా ఇది కీలక ఘట్టం. పొరుగున చైనా నుంచి పొంచివున్న ముప్పు నేపథ్యంలో ప్రధానంగా ఎత్తైన పర్వత ప్రాంతాల్లో సైతం శత్రువులపై పోరాడే దేశవాళీ ఛాపర్ ఇప్పుడు మన చేతిలో ఉన్నట్టయింది.

ప్రభుత్వ రంగ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్ – హాల్) తయారు చేసిన ఈ లోహవిహంగం గణనీయంగా ఆయుధాలు, ఇంధనం తీసుకొని 5 వేల మీటర్ల ఎత్తున కూడా కిందకు దిగగలదు. టేకాఫ్ తీసుకోగలదు. ప్రపంచంలో అలాంటి యుద్ధ హెలికాప్టర్ ఇదొక్కటే అని నిపుణుల మాట. అతి వేడిగా ఉండే ఎడారుల్లో, రక్తం గడ్డ కట్టించే అతి ఎత్తైన ప్రాంతాల్లో, విద్రోహ చర్యల్ని విచ్ఛిన్నం చేసే వేళల్లో – ఇలా అన్ని యుద్ధ సందర్భాల్లో గురి తప్పకుండా లక్ష్యాన్ని ఛేదించగలగడం ఈ లోహ విహంగాల ప్రత్యేకత. వెరసి, సైనిక ఆయుధాలను విదేశాల నుంచి కొనడానికే పేరుబడ్డ భారత్ ఈ దేశీయ తయారీ యుద్ధ హెలికాప్టర్లతో కనీసం ఇంతవరకైనా బయ్యర్ నుంచి బిల్డర్‌గా మారింది. 'మేకిన్ ఇండియా' స్వప్నసాకారంలో ఒక అడుగు ముందుకు పడింది.

1999 నాటి కార్గిల్ యుద్ధవేళ దేశీయంగా తయారైన తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ అవసరం తొలిసారిగా మనకర్థమైంది. అప్పటికి మన దగ్గర చేతక్, చీతా లాంటి హెలికాప్టర్లే ఉన్నాయి. కానీ మరింత చురుగ్గా, బహు పాత్రపోషణ చేయగలవి అవసరమయ్యాయి. ఆ పరిస్థితుల్లో తొలి దశ చర్చల తర్వాత 2006 అక్టోబర్‌లో ప్రభుత్వం ఎల్‌సీహెచ్ ప్రాజెక్ట్‌ను 'హాల్'కు మంజూరు చేసి, వాటిని అభివృద్ధి చేసే బాధ్యతను అప్పగించింది. అలా పైలట్, కోపైలట్‌లు ఒకరి వెనుక మరొకరు కూర్చొనేలా ఈ రెండు ఇంజన్ల, 5.8 టన్నుల లోహ విహంగాన్ని డిజైన్ చేశారు. అనేక కఠిన పరీక్షల అనంతరమే ఈ ఛాపర్లకు అనుమతినిచ్చి, సైన్యంలోకి తీసుకున్నారు. అందుకు 2010– 2015 మధ్య 4 నమూనా ఛాపర్లు సిద్ధం చేసి, రకరకాల ఎత్తుల్లో, 2 వేలకు పైగా గగనయాన పరీక్షలు చేశారు.

2017లో వైమానిక దళ నమూనాకూ, 2019లో ఆర్మీ నమూనాకూ తొలిదశ అనుమతి వచ్చింది. నిరుడు నవంబర్‌లో ప్రధాని మోదీ ప్రతీకాత్మకంగా ఎల్‌సీహెచ్‌ను భారత వైమానిక దళానికి అప్పగించి, ఆఖరి ఘట్టానికి తెర తీశారు. ఈ మార్చిలో భద్రతా వ్యవహారాల మంత్రివర్గ సంఘం వాయుసేనకు 10, ఆర్మీకి 5 – మొత్తం 15 ఎల్‌సీహెచ్‌ల తయారీకి ఆమోదం తెలిపింది. దరిమిలా సెప్టెంబర్ 29న బెంగళూరులో ఆర్మీలోకీ, ఇప్పుడు జోధ్‌పూర్‌లో వాయుసేనలోకీ ఎల్‌సీహెచ్‌లను లాంఛనంగా ప్రవేశపెట్టారు. ఇలాంటి ఎల్‌సీహెచ్‌లు 160 దాకా మనకు అవసరం. గంటకు 268 కి.మీ గరిష్ఠ వేగంతో వెళ్ళగల ఈ 'ప్రచండ' ఛాపర్లలో అనేక ప్రత్యేకతలున్నాయి. 6.5 కి.మీ ఎత్తున ఎగరగల సత్తా ఈ లోహ విహంగం సొంతం. 20 ఎంఎం టరెట్ గన్, 70 ఎంఎం రాకెట్లు, గగనతల క్షిపణి వ్యవస్థలతో ఇది యుద్ధసన్నద్ధమై ఉంటుంది. శత్రు రాడార్ల గురి నుంచి రక్షణవ్యవస్థ ఉండే ఈ ఛాపర్ ముష్కరుల గగనతల భద్రతావలయాన్ని ఛేదించి, విద్రోహ చర్యలను తిప్పికొడుతుంది.

తొలి దేశీయ యుద్ధ విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ జలప్రవేశం చేసి నెల తిరిగేసరికి ఇప్పుడు ఈ యుద్ధ హెలికాప్టర్లు మన వైమానికదళానికి సమకూరడం సంతోషమిచ్చే పరిణామం. వీటికన్నా ముందే ఈ జూన్‌లో తీరప్రాంత గస్తీ దళంలోకి దేశవాళీ అడ్వాన్స్డ్ లైట్ హెలికాప్టర్ ఎంకె–3 వచ్చి చేరింది. భారత రక్షణ రంగానికి ఇవన్నీ శుభసూచనలు. రక్షణ రంగంలో ఒకపక్క దిగుమతులు తగ్గించుకొంటూనే, మరోపక్క అంతర్జాతీయ వేదికపై తన ఉనికిని చాటుకుంటున్నట్టయింది. గత అయిదేళ్ళలో మన రక్షణ ఎగుమతులు 334 శాతం పెరిగాయని సర్కారు వారి మాట. ప్రస్తుతం 75కి పైగా దేశాలకు మన రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నాం. మన తేలికపాటి యుద్ధ విమానం తేజస్‌పై మలేసియా, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, ఈజిప్ట్, అమెరికా, ఇండొనేసియా, ఫిలిప్పైన్స్ సైతం ఆసక్తి కనబరచడం విశేషం.

రక్షణ ఉత్పత్తుల దేశవాళీ డిజైనింగ్, అభివృద్ధి, తయారీకై కొన్నేళ్ళుగా తీసుకుంటున్న విధాన నిర్ణయాలు క్రమంగా ఫలితమిస్తున్నట్టున్నాయి. విదేశాల నుంచి రక్షణ ఉత్పత్తుల్ని మనం దిగుమతి చేసుకోవడం 2012–16తో పోలిస్తే, 2017–21లో దాదాపు 21 శాతం తగ్గాయని స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చెబుతోంది. అయితే, ఇప్పటికీ ఆయుధాల దిగుమతిలో ప్రపంచంలో మనం ముందు వరుసలోనే మిగిలాం. రష్యన్ తయారీ ఆయుధాలపై భారీగా ఆధారపడ్డాం. ఈ పరిస్థితి మారాలంటే, తక్కువ వ్యయంతోనే ప్రపంచ ప్రమాణాలను అందుకొనే సాంకేతికతను అభివృద్ధి చేయాలి. అదే అతి పెద్ద సవాలు. చిక్కులు లేకుండా ప్రభుత్వం అవసరమైన వనరుల్ని అందించి, పరిశోధన – అభివృద్ధిని ప్రోత్సహిస్తే, కీలక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి ఆ సవాలును అధిగమించవచ్చు. రక్షణ రంగంలో దిగుమతులు తగ్గించుకొని, సొంత కాళ్ళ మీద నిలబడవచ్చు. దృఢసంకల్పం ఉంటే అది అసాధ్యమేమీ కాదని 'ప్రచండ్' రూపకల్పన చెబుతోంది. సాధించిన ఘనతతో పాటు సాధించాల్సిన లక్ష్యాలను మరోసారి గుర్తుచేస్తోంది.

గ్రహం అనుగ్రహం

శ్రీశుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి: శు.దశమి ఉ.11.15 వరకు
తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** శ్రవణం రా.9.33 వరకు
తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.1.17 నుండి 2.47 వరకు
దుర్ముహూర్తం: ప.11.24 నుండి 12.13 వరకు
అమృతఘడియలు: రా.1.18 నుండి 2.46 వరకు, విజయదశమి.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.45
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

వికేంద్రీకరణతోనే సమన్యాయం

విశ్లేషణ




ధర్మాన ప్రసాదరావు

స్వతంత్రం రాక ముందు మద్రాస్‌కు, స్వాతంత్ర్యం వచ్చాక కర్నూలుకు, ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక హైదరాబాద్‌కు పరుగులు తీసిన సామాన్య మధ్యతరగతి ప్రజల దగ్గరకు వికేంద్రీకృత పరిపాలనను ఇప్పటికైనా తీసుకు వెళ్లకపోతే వారు తీవ్ర నిరాశా నిస్పృహలకు గురి అయ్యే ప్రమాదం ఉంది. ఏ ప్రాంత వాసులకూ 'మనం నిర్లక్ష్యం చేయబడ్డాం' అనే ఆలోచన, ఊహ రాకుండా జాగ్రత్త పడాల్సిన సమయం ఇది. పరిపాలనా వికేంద్రీకరణ ఈనాటి మాట కాదు. ఇది ప్రజల చిరకాల వాంఛ. శ్రీబాగ్ ఒప్పందంలోనే దీని బీజాలు పడ్డాయి. అలా ఆలోచిస్తే అమరావతి కన్నా విశాఖపట్నమే రాజధానిగా మేలైన నగరం. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో ఏకైక అతిపెద్ద నగరం విశాఖ. పాలనా రాజధానిగా త్వరగా, తక్కువ ఖర్చుతో విశాఖను అభివృద్ధి చేయవచ్చు.

జూన్ 2, 2014. ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తేదీ. ఉమ్మడి రాష్ట్రాన్ని విభజిస్తూ భారతదేశ పార్లమెంట్ చేసిన 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం' (రీ–ఆర్గనైజేషన్ యాక్ట్, 2014) అమలులోకి వచ్చిన రోజు. ఈ చట్టం చేసే ముందు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ విధివిధానాల పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వం శ్రీకృష్ణ కమిటీని నియమించింది. ఈ కమిటీ 2010 ఫిబ్రవరి నుంచి ఉమ్మడి రాష్ట్రం అంతటా విస్తృతంగా పర్యటించింది. పది నెలలు పర్యటించి చేసిన అధ్యయనంలో వివిధ అంశాలను ప్రస్తావిస్తూ నివేదికను సమర్పించింది. తొలుత రాయలసీమ ప్రాంతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేరడానికి అంగీకరించకపోవడం, ఆ తర్వాత 1937లో జరిగిన శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు ఆర్థిక, సామాజిక పరిపాలనా అంశాల్లో కొన్ని భద్రతలు కల్పించడంతో ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు ఒకటి కావడం, ఆ తర్వాత తెలంగాణతో కలిసి 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించడం వంటి పరిణామాలను కమిటీ తన నివేదికలో ప్రస్తావించింది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 5లో హైదరాబాద్ రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా పది సంవత్సరాలు ఉండి, ఆ తర్వాత తెలంగాణకు మాత్రమే రాజధానిగా కొనసాగుతుందని, ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుందని పేర్కొన్నారు. సెక్షన్ 6లో కేంద్ర ప్రభుత్వం నియమించే నిపుణుల కమిటీ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 అమలు నాటి నుండి ఆరు నెలల లోపు ఆంధ్రప్రదేశ్‌లో నూతన రాజధాని కోసం వివిధ ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేసి తగిన సూచనలు, సిఫారసులు చేస్తుందని ఉంది. తదనుగుణంగా కేంద్ర ప్రభుత్వం శివరామకృష్ణన్ కమిటీని నియమించి, కమిటీ అధ్యక్షులుగా డాక్టర్ రతన్ రాయ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ సైన్స్ అండ్ పాలసీ డైరెక్టర్)ను, సభ్యులుగా ఆరోమార్ రెవి (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ సెటిల్మెంట్స్), శ్రీ జగన్ షా (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ డైరెక్టర్), ప్రొఫెసర్ కె. రవీంద్రన్ (న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డీన్)లను నియమించింది. పట్టణాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో ఈ కమిటీకి అపార అనుభవం ఉంది.

ఈ కమిటీ రాష్ట్రంలో 11 జిల్లాలు పర్యటించి ప్రజలను ప్రజా సంఘాలను కలిసింది. వారితో సంప్రదింపులు జరిపింది. వారి సూచనలు, సలహాలు తీసుకుంది. 4728 ప్రజా విజ్ఞప్తుల్ని పరిశీలించి వాటన్నింటినీ క్రోడీకరించింది. 187 పేజీలతో తన నివేదికను నాటి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ''హైదరాబాద్‌లో కమిషనరేట్‌లు, డైరెక్టరేట్‌లతో కూడిన శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు; మంత్రిత్వ శాఖల కేంద్రీకరణకు అనేక సంవత్సరాలు పట్టింది. అన్నేళ్లుగా రాజధాని పేరిట హైదరాబాద్‌లో జరిగిన ఈ కేంద్రీకృత అభివృద్ధే విభజన డిమాండ్‌కు కీలకాంశం. కాబట్టి ఒకే ఒక పెద్ద



రాజధాని నిర్మాణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సాధ్యం కాదు'' అని ఆ నివేదికలో కమిటీ అభిప్రాయపడింది. అలాగే గ్రీన్ ఫీల్డ్ (కొత్తగా నిర్మాణం మొదలు పెట్టడం) రాజధాని కూడా ఆమోదయోగ్యం కాదని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అయితే ఆనాటి ప్రభుత్వం ఈ సూచనను పట్టించుకోలేదు. పైగా అత్యంత విచారకరమైన విషయమేమిటంటే ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో భూలభ్యత గురించి అడిగినప్పుడు ప్రభుత్వం ఎంతమాత్రం సహకరించకపోవడం! అసలు కమిటీ నివేదిక ఇవ్వక ముందే ఒక అభిప్రాయానికొచ్చి విభజన చట్టానికి వ్యతిరేకంగా తానే ఒక కమిటీ నియమించుకుంది. అర్హతలూ, అనుభవం, నైపుణ్యం ఏ మాత్రం లేని ఆనాటి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కమిటీ అధ్యక్షుడిగా నియమించారు చంద్రబాబు. అందులో సభ్యులుగా ఉన్న వారిని చూస్తే వారి ఆలోచన, సామర్థ్యం, రాష్ట్రం ఏమైపోయినా ఫరవాలేదనుకునే బాధ్యతా రాహిత్యం, ఇతర ప్రాంతాల అభివృద్ధి పట్ల చంద్రబాబుకు ఉన్న నిర్లక్ష్యం ఇట్టే అర్థమవుతుంది. సుజనా చౌదరి, గల్లా జయదేవ్, బొమ్మిడాల శ్రీనివాస్, జీవీకే సంజయ్ వంటివారు ఆనాటి కమిటీ సభ్యులు. రాజ్యాంగబద్ధంగా, శాసన సమ్మతంగా ఏర్పాటైన శివరామకృష్ణన్ నివేదికను తొక్కిపెట్టి, ఏ చట్టంలోనూ పేర్కొనని నారాయణ కమిటీని అడ్డం పెట్టుకొని అమరావతిని రాజధానిగా ప్రకటించారు! దాని కోసం సీఆర్డీఏ (క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చట్టం చేశారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైన చర్య.

రాజ్యాంగ సభలో 1949 మే 27న 'రాజధాని ఎక్కడ ఉండాలి?' అనే విషయంపై చర్చ జరిగినా, రాజ్యాంగంలో ప్రస్తావన జరగలేదు. రాజధాని ఒకటే ఉండాలని గాని, ఒకే చోట ఉండాలి గాని ఎక్కడా నిర్దేశించలేదు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక వర్గాలు ఒకేచోట ఉండాలని నిర్ణయించలేదు. ఆర్టికల్ 85 ప్రకారం రాష్ట్రపతి అనుకూలమని భావించిన చోట పార్లమెంటును సమావేశపరిచే అధికారం ఉంది. అలాగే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కోర్టు విచారణలు ఎక్కడ జరపాలో నిర్ణయించే అధికారం ఉంది. వైఎస్సార్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులను దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రణాళికలు సూచించమని రిటైర్డ్ అధికారి నాగేశ్వరరావు అధ్యక్షతన కమిటీ వేసింది. ఈ కమిటీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య అసమానతలను దృష్టిలో పెట్టుకొని పరిపాలన వికేంద్రీకరణ చేస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధిని సూచిస్తూ తన నివేదికను 2019 డిసెంబర్ 20న ప్రభుత్వానికి సమర్పించింది. ఆ కమిటీ నిర్దిష్ట ప్రతిపాదనలు చేసింది. సెక్రటేరియట్, ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం, సమ్మర్ అసెంబ్లీ, హైకోర్ట్ బెంచ్ విశాఖపట్నంలో; రాష్ట్ర శాసన సభ, హైకోర్ట్ బెంచ్, మినిస్టర్స్ క్వార్టర్స్ అమరావతి, మంగళగిరిల్లో; హైకోర్ట్ ప్రిన్సిపల్ సీట్, సంబంధిత కోర్టులు కర్నూలులో పెట్టాలని సూచించింది.

అసలు ఈ పరిపాలన వికేంద్రీకరణ ఈనాటి మాట కాదు. ఇది ప్రజల చిరకాలవాంఛ. శ్రీబాగ్ ఒప్పందంలోనే దీని బీజాలు పడ్డాయి. ఆ ఆకాంక్షలు, కోరికలు తీరే రోజులు సమీపిస్తున్నాయని పిస్తోంది. ఈ నేపథ్యంలో ఆలోచిస్తే అమరావతి కన్నా విశాఖపట్నమే రాజధానిగా మేలైన నగరం. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఏకైక అతిపెద్ద నగరం విశాఖ. పరిపాలన రాజధానిగా అతి త్వరగా తక్కువ ఖర్చుతో విశాఖను అభివృద్ధి చేయవచ్చు. రోడ్డు, రైలు, విమాన, సముద్ర మార్గాల్లో ఇతర రాష్ట్రాలు, దేశాలతో విశాఖపట్నం అనుసంధానం కలిగి ఉంది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడి వాతావరణం ఎంతో అనుకూలమైనది. అన్ని ప్రాంతాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలు ఇక్కడ ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ రంగాలలోని చాలా కంపెనీలు విశాఖపట్నంలో, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్నాయి. విశాఖపట్నం మొదటి నుంచీ జీడీపీకి కీలక వాటాను అందిస్తున్నా తిరిగి తగినంత ప్రభుత్వ నిధుల కేటాయింపులు జరగడం లేదు.

ఇప్పుడు మనం ఎక్కడున్నామని ప్రశ్నించుకుంటే... చుట్టూ తిరిగి, తెలుగుదేశం ఐదేళ్ల పాలన ఒక కల లాగే మిగిలిపోయి, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం సెక్షన్ 6 ముందు నిలబడ్డాం. మన ముందు రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం శివరామకృష్ణన్ రిపోర్ట్ ఉంది. అన్ని ప్రాంతాలకు న్యాయం జరగాలంటే వికేంద్రీకరణ ఒకటే సూత్రమనే తారకమంత్రం వినిపిస్తోంది. సమాన అభివృద్ధి అనే విధానాన్ని పట్టించుకోకపోతే భవిష్యత్తు పట్ల యువత ఆశలు కునారిల్లిపోతాయి. ప్రజాస్వామ్య ప్రభుత్వంపట్ల విశ్వాసం సన్నగిల్లిపోతుంది. స్వతంత్రం రాక ముందు నుండి మద్రాస్‌కు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కర్నూలుకు, ఏపీ ఏర్పడ్డాక హైదరాబాద్‌కు పరుగులు తీసిన సామాన్య మధ్యతరగతి ప్రజల దగ్గరకు వికేంద్రీకృత పరిపాలనను ఇప్పటికైనా తీసుకు వెళ్లకపోతే వారు తీవ్ర నిరాశా నిస్పృహలకు గురి అయ్యే ప్రమాదం ఉంది. ఏ ప్రాంత వాసులకూ 'మనం నిర్లక్ష్యం చేయబడ్డాం' అనే ఆలోచన, ఊహ రాకుండా జాగ్రత్త పడాల్సిన సమయం ఇది.

వ్యాసకర్త రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

జగన్మాత ఆశీస్సులు



జీవితంలో ఎత్తుపల్లాలుంటాయి. కఠిన వాస్తవాలూ ఎదురవుతాయి. కానీ వాటిని తట్టుకుని నిలబడే ధైర్యాన్ని, మానసిక దృఢత్వాన్ని దుర్గామాత మనకు అందిస్తుంది. విజయ దశమి శుభాకాంక్షలు.

– ఆయేషా, ప్రౌడ్ ఇండియన్

తొందరపాటు



పహాడీలు అని మనం ఎవర్ని పిలుస్తాం? కొండలు, పర్వతాలలో నివసించేవారినే కదా. పహాడీలకు ఉద్యోగాలలో, విద్యావకాశాలలో రిజర్వేషన్లు కల్పిస్తామని హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ఏ పహాడీలకు ఆయన రిజర్వేషన్‌లు ఇవ్వబోతున్నారు. పూంఛ్, రాజౌరీలలో ఉన్న 99 శాతం మంది సున్నీ పహాడీలకా, లేక జమ్మూలోని ఇతర జిల్లాల్లో ఉన్న 80 శాతం మంది హిందూ పహాడీలకా?

– ప్రొఫెసర్ హరి ఓం, ప్రవాస కశ్మీరీ

ఒక్కరూ లేరా!



సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మహిళా సాధికారతకు బ్రాండ్ అంబాసిడర్. భీమ్ యాప్‌కు ప్రచారకర్త. పీ.ఎం. సర్ సైతం సుశాంత్ చేత 'ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి' అని చెప్పించారు. కానీ సుశాంత్ హత్య జరిగాక ఒక్క నాయకుడూ న్యాయం జరిపించేందుకు ముందుకు రావడం లేదు! ఇక ఆ దుర్గా మాతే సుశాంత్ తరఫున పోరాడేందుకు మనకు శక్తిని ఇవ్వాలి.

– చైతాలీ ముఖర్జీ, సోషల్ యాక్టివిస్ట్

ఇంటెలిజెంట్ ర్యాప్



'నేనెందుకు హాయిగా నవ్వగలుగుతున్నానంటే నేను దీవెనలు పొంది వచ్చాను కాబట్టి..' అని పాడుతున్న కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ 'బాట్ హార్డ్‌ర్యాప్స్' తన మాయాజాలంతో మీ గొంతుకు శ్రావ్యమైన బాణీలను సమకూర్చబోతోంది. ఈ టెక్నాలజీని ఉపయోగించి మీరు మాట్లాడండి చాలు. అది ర్యాప్ గీతం అయిపోతుంది. వారాంతాలలో విన్నపాటలనే వినే కర్మ కూడా మనకిక తప్పినట్లే!

– జిసెల్, క్రిప్టో ఇన్వెస్టర్

ప్రతిన పూనుదాం!



ఒక మూగ ప్రాణిని ప్రేమించే వరకు మనిషి ఆత్మలోని కొంత భాగం నిద్రాణంగానే ఉండిపోతుందని ఫ్రెంచ్ కవి ఆనటోల్ ఫ్రాన్స్ అన్న మాట నిజం. జంతువులకు ప్రేమను పంచాలని ప్రతిన పూనేందుకు వరల్డ్ యానిమల్ డే (4 అక్టోబర్) మంచి సందర్భం.

– గగన్‌దీప్ సింగ్, జ.డి.ఎస్. కన్సల్టెంట్

మనకిది తప్పదు!



నా ట్వీట్ తర్వాత కశ్మీర్‌లోని ఉన్నత స్థాయి పోలీసు అధికారి హత్య వార్తా కథనాన్ని ఎన్డీ టీవీ సవరించుకుంది. అప్పటి వరకు 'అపరాధి' అని మాత్రమే చెబుతున్న ఆ ఛానల్ అనిష్టంగానే అయినా అతడి పేరు యాసిర్ అహ్మద్ అని బహిర్గతపరచింది. ఇటువంటి వామపక్ష కుయుక్తుల పట్ల నిరంతర అప్రమత్తత అవసరం.

– అనూప్ వర్మ, రిటైర్డ్ ఫ్లయిట్ లెఫ్టినెంట్

క్యారెక్టర్ సర్టిఫికెట్



అక్టోబర్ 5న మోదీ హిమాచల్ ప్రదేశ్ పర్యటనను కవర్ చేసే జర్నలిస్టులందరికీ మీడియా యాజమాన్యాలు 'క్యారెక్టర్ సర్టిఫికెట్' ఇచ్చి పంపాలని బిలాస్‌పూర్ జిల్లా యంత్రాంగం ఆదేశించి, వెంటనే ఆదేశాలను ఉపసంహరించుకుంది. నేనడం ఏంటంటే.. సర్టిఫికెట్‌కు బదులుగా తమ విధేయతను ప్రదర్శించుకునే జర్నలిస్టులకు పచ్చబొట్టు వేస్తే పేపర్‌లెస్ అవుతుంది, పైగా పర్యవేక్షణా సులభం.

– సర్ కాజమ్, సెటైరిస్ట్

భారతీయ గ్రామాల్లో ఇంగ్లిష్ విప్లవం

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

అక్టోబర్ 5 అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం. అదే రోజు భారతీయ ఇంగ్లిష్ దినోత్సవం కూడా. భారతదేశంలో ఇంగ్లిష్ భాషలో విద్యకు 205 సంవత్సరాల చరిత్ర ఉంది. యాదృచ్ఛికంగా అక్టోబర్ 5న నా 70వ జన్మదినం కూడా! ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందుబాటులోకి తేవాలంటూ గత 30 సంవత్సరాలుగా నేను చేస్తూ వస్తున్న ప్రచారం ఇప్పుడు ఒక అర్థవంతమైన దశకు చేరుకుంది. విలియం కారీ, రాజా రామమోహన్ రాయ్ 1817లో నాటి కలకత్తాలో దేశంలోనే మొట్టమొదటి ఇంగ్లిష్ మీడియం పాఠశాలను ప్రారంభించారు. 2022 నాటికి ప్రధానంగా వైద్యశాస్త్రం వల్ల ప్రపంచం కాస్త ఉపశమనం చెందింది. అంతర్జాతీయ ప్రసార కర్తగా ఇంగ్లిష్ భాషను ఉపయోగించుకుని అభివృద్ధి చెందిన వైద్య శాస్త్రం నిజంగానే ప్రపంచం ధ్వంసం కాకుండా కాపాడింది. సైన్స్, ఇంగ్లిష్ రెండూ కలిసి మనలేకపోయి ఉంటే, కరోనా మహమ్మారి కారణంగా ప్రపంచం మరుభూమి అయిపోయి ఉండేది.

భారతదేశంలో ఇంతవరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లాంటి ఒకట్రెండు రాష్ట్రాలే తమ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనను తప్పనిసరి చేశాయి. భారతదేశంలో విద్యా విప్లవానికి ఇదే నాంది. ఇప్పటికే చాలా కాలంగా నాగాలాండ్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలోనే బోధన కొనసాగుతూ వస్తోంది. ఇటీవలి కాలంలోనే చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటో తరగతి నుంచే ఇంగ్లిష్‌ని తప్పనిసరి సబ్జెక్టుగా చేయడం ప్రారంభించాయి. కశ్మీర్ చాలా కాలానికి ముందే ఒకటో తరగతి నుంచే ఇంగ్లిష్‌ని తప్పనిసరి సబ్జెక్టుగా ప్రారంభించేసింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ కూడా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇంగ్లిష్ బోధించడాన్ని ఎంతగానో ప్రోత్సహించింది. వీటితో పాటుగా, భారతదేశ వ్యాప్తంగా వేలాది ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు కూడా ఉన్న విషయం తెలిసిందే. గత 65 సంవత్సరాల నా చైతన్యపూర్వకమైన, భావ ప్రసార జీవితంలో ఒక మందగమనంతో కూడిన నిశ్శబ్ద విప్లవం చోటుచేసుకుంది. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, గ్రామీణులు, పట్టణ వాసులు తేడా లేకుండా అన్ని ఇళ్లలో నిదానంగా ఇంగ్లిష్ మెల్లగా అడుగుపెట్టేసింది. మార్పు తీసుకు రావడానికి ఇది ప్రారంభం. ఈ క్రమంలో బియ్యం స్థానంలో రైస్ అనే పదం వచ్చి చేరింది. మాంసం స్థానంలో మటన్ వచ్చి చేరింది. చేపలు అనే పదాన్ని ఫిష్ తోసిపారేసింది. కోడికూర స్థానంలో చికెన్, కూరగాయల స్థానంలో వెజిటబుల్స్ వంటి ఇంగ్లిష్ పదాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ గ్రామాల్లో, కుగ్రామాల్లో అన్ని కమ్యూనిటీలకు సొంతమైపోయాయి.

గ్రామాల్లోని అన్ని సంతల్లో, అంగళ్లలో కూడా తెలుగు పదాలు పక్కకుపోయి ఇంగ్లిష్ పదాలు వచ్చి చేరాయి. ఒక తెలుగులోనే కాదు.. దేశవ్యాప్తంగా ఇదే ట్రెండ్ కొనసాగుతోంది. సరుకులకు ఉపయోగించే రోజువారీ పేర్లు, పదాలకు సంబంధించి కూడా ఇంగ్లిష్ పదాలు చలామణిలో ఉంటున్నాయి. నిదానంగా అయినా సరే, భారతీయ జీవనం తప్పనిసరిగా ఆంగ్లీకరణకు గురవుతోందని చెప్పాలి. ప్రజల జీవితంలోకి ప్రవేశిస్తున్న ఇంగ్లిష్ వారి భవిష్యత్తును కూడా మారుస్తోంది. ఇప్పటికైతే ప్రతి గ్రామంలోనూ స్త్రీ పురుషులకు కొన్ని వందల ఇంగ్లిష్ పదాలు తెలుసు. ఈరోజు ఇంగ్లిషులో ఉన్న మెషిన్లను ఉపయోగిస్తున్నవారు సెల్‌ఫోన్ వంటి ఇంగ్లిష్ పేర్లనే వాడుతున్నారు. వీరి మాతృభాషలో సెల్, ఫోన్ వంటి ఇంగ్లిష్ పదాలకు సరిసమాన పదాలు లేవు.

1950లలో బస్సు, ట్రెయిన్ వంటి ఇంగ్లిష్ పదాలు మన గ్రామాలను చేరుకున్నాయి. ఎందుకంటే ఈ వాహనాల్లో వారు ప్రయాణించడం మొదలెట్టారు. అలా ప్రయాణిస్తున్నప్పుడు టికెట్, కండక్టర్ వంటి పదాలను కూడా వారు నేర్చేసుకున్నారు. సంవత్సరం తర్వాత సంవత్సరం



గడిచే కొద్దీ పనిముట్ల పేర్లు, మెషిన్లు వంటి యంత్రాల పేర్లకు పలు ఇంగ్లిష్ పదాలు వాడటం వారి జీవితంలో భాగమైపోయింది. నా తొలి బాల్యంలో నేను ఉపయోగించిన కురుమ భాష లేదు. అందుకు బాధగానూ లేదు. మా గ్రామంతో పాటూ మొత్తం తెలుగు నేలపై ఇప్పుడు అన్ని వ్యక్తీకరణల్లోనూ మెల్లగా తెలుగు పదాల స్థానంలో ఇంగ్లిష్ పదాలు వచ్చి చేరుతున్నాయి. వ్యాకరణంతో కూడిన భాషలో మాట్లాడకుండానే ఒక ఇంగ్లిష్ పదం లేదా పేరును ఉపయోగించడం ద్వారా చాలామంది ప్రజలు ఇప్పుడు పరస్పరం భావ ప్రసారం చేసుకుంటున్నారు. గ్రామంలో ఉత్పాదక భాష ఎన్నడూ వ్యాకరణ కేంద్రకంగా ఉండేది కాదు. అది భావ ప్రసార కేంద్రకంగా ఉండేది. ఇంగ్లిష్ పదాలు తమ కమ్యూనికేషన్ పరిధిని విస్తరించుకున్నాయి. నా తొలి బాల్యంలో గ్రామస్థులు ఇంగ్లిష్ పేర్లు కలిగి ఉన్న మెషిన్లను వాడటం మొదలెట్టారు. వాటి విడిభాగాలు కూడా ఇంగ్లిషులోనే ఉండేవి. ఉదా. 1960ల మొదట్లో సైకిల్ అనే పేరున్న వాహనం వారి జీవితంలోకి వచ్చేసింది. అలాగే చైన్లు, హ్యాండిల్స్ వంటి పదాలు కూడా. ఆ కాలంలోనే వారి గ్రామంలోకి వచ్చిన కరెంట్ అదే పేరుతో చలామణీ అయ్యేది. ఆయిల్ ఇంజిన్‌ని అదే పేరుతో పిలిచేవారు. వాటి పేర్లతోనే ప్రజలు వాటి పాత్రలను, విధులను అర్థం చేసుకునేవారు.

ప్రాంతీయ భాషల్లో మాట్లాడేవారి మాతృభాషా పదాల స్థానంలో విప్లవాత్మకంగా ఇంగ్లిష్ పదాలు వచ్చి చేరాయి. ఆరెస్సెస్– బీజేపీ, కాంగ్రెస్ లేదా కమ్యూనిస్టు లేక ప్రాంతీయ పార్టీలు మద్దతిచ్చినా, లేకున్నా ఈ భాషా విప్లవాన్ని ఆపలేకపోయాయి. హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బుద్ధిస్టులు, పార్సీలు వంటి అన్ని మతాల వాడుకలో ఇంగ్లిష్ పదాలు వచ్చి చేరాయి. మతాచరణలు, మత ఛాందసత్వాలు, మతతత్వం వంటివి ఈ భాషా విప్లవాన్ని ఆప లేవు.


ఇంగ్లిష్ పదాలతో మార్కెట్ అనేది మార్పుకు అసలైన యజమానిగా మారిపోయింది. ఈ మార్పును నేను చూడగలిగాను. ఇతరుల భాషను అర్థం చేసుకోలేని గ్రామాల్లోని ఇరుగుపొరుగు వారు కూడా ఇంగ్లిష్ పదాలను ఉత్తమంగా అర్థం చేసుకోవడం మొద లెట్టారు. ఎందుకంటే ఇంగ్లిష్ పదాలు వారిని మార్కెట్‌కు అనుసంధానం చేశాయి. ఇంగ్లిష్ పదాలతో గ్రామ ప్రజలు ఇండియన్స్ అయిపోయారు. ఇంగ్లిష్ వారిని జాతీయవాదులను చేసింది. హిందీతో సహా ఏ ఇతర ప్రాంతీయ భాష కూడా దీన్ని సాధించలేకపోయింది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

మంచిరోజు

సత్యం, జ్ఞానం, అనంతం అయిన పరబ్రహ్మ... నిత్య, నిర్గుణ, నిరాకార తత్వం. సృష్టి చేయాలని అపించినప్పుడు ఆ పరబ్రహ్మ నుండి ఆయన శక్తి జాగృతమై ప్రకటితమౌతుంది. నిప్పుకు వేడిమి అనే శక్తి లాగా, పరబ్రహ్మకు పరాశక్తి. రెండు తత్వాలూ అభిన్నమే. సృష్టిమూలమైన పరాశక్తిని ప్రకృతి అనీ, భగవతి అనీ, మహా మాయ అనీ, దేవి అనీ ఎన్నెన్నో పేర్లతో భక్తులు స్తుతిస్తారు.

పరాశక్తి లేకపోతే పరమ పురుషుడు కనీసం కదలలేడు. ఆమె ఆయనతో ఉంటే, ఆయన చతుర్దశ భువనాలను, చరాచరప్రాణులతో సహా, సృష్టిస్తాడు. నిజానికి ఆయన సృష్టించడు. తన సాన్నిధ్యంలో



జ్యోతిర్మయం

పరాశక్తి చేత సృష్టింప జేస్తాడు. సృష్టిని నియంత్రించే దేవీదేవతలూ, త్రిమూర్తులూ, అందరూ ఆదిపరాశక్తి రూపాలే. ఆ శక్తి అంశలే, బిడ్డలే. ఆమె సృష్టి లాగే, ఆమె నామాలూ, రూపాలూ, గుణాలూ, మహిమలూ, లీలలూ కూడా అనంతాలు. ఆమె శక్తులనూ లీలలనూ దేవీ భాగవత పురాణం విస్తృతంగా వర్ణిస్తుంది. దాని సారాన్ని పోతన అలతి పదాలతో, అనల్పార్థంతో, 'అమ్మల గన్న అమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాల బెద్దమ్మ... తన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి అమ్మ, దుర్గ, మా అమ్మ, కృపాబ్ధి...' అని సుందరంగా, సులభ గ్రాహ్యంగా చెప్పారు. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి ఇత్యాది దేవీమూర్తులు, ఆ 'చాల పెద్దమ్మ' అంశతో ఆమెచేత సృష్టి అయినవారే.

చైతన్యరూపంలో, ఈ విస్తృతమైన జగత్తులోని అణువణువులోనూ వ్యాపించి నిలిచి ఉన్న ఆ పరాశక్తికి నమస్సులు అంటుంది అతి ప్రసిద్ధమైన దుర్గా సప్తశతి. సర్వమంగళ మాంగల్య అయిన దేవి వైభవాన్ని అనవరతం స్మరిస్తూ ఆమె భక్తులు పులకించే పుణ్యకాలం దేవీ నవరాత్రులు. శిష్టరక్షణ కోసం దుష్టశిక్షణ జరిపే ఆ భువనేశ్వరి అతి విశిష్టమైన విజయాలు సాధించి 'అపరాజిత'గా నిలిచిన అద్భుతమైన శుభతిథి ఆశ్వయుజ శుద్ధ దశమి. అది ఆమెతోపాటు ఆమె భక్తులందరికీ 'విజయ దశమి'. అన్ని పుణ్య కార్యాలకూ, సత్సంకల్పాలకూ అనువైన మంచి రోజు.

– ఎం. మారుతి శాస్త్రి

పవన విద్యుత్‌లో ఏపీ పరుగు

- పునరుత్పాదక విద్యుదుత్పత్తిపై వాతావరణ మార్పుల ప్రభావం
- కొన్నాళ్లకు గాలి వేగం ఉత్తరాదిలో తగ్గి.. దక్షిణాదిలో పెరిగే అవకాశం
- రాష్ట్రంలో పవన విద్యుత్‌కు అనుకూల పరిస్థితులు

సాక్షి, అమరావతి : కర్బన ఉద్గారాలను తగ్గించే ప్రయత్నంలో రాష్ట్రం ముందడుగు వేస్తోంది. పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులను ఆకర్షిస్తూ దావోస్ వేదికగా రూ.1.25 లక్షల కోట్ల విలువైన నాలుగు ఒప్పందాలు కుదుర్చుకుంది. పంప్డ్ స్టోరేజ్, సౌర, పవన విద్యుత్ రంగాల్లో ఈ పెట్టుబడులతో ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవలే రాష్ట్రంలో ప్రపంచంలోనే అతిపెద్ద 5,230 మెగా వాట్ల ఏకీకృత పునరుత్పాదక విద్యుదుత్పత్తి కేంద్రానికి శంకుస్థాపన జరిగింది. ప్రభుత్వ చర్యలకు వాతావరణంలో వస్తున్న మార్పులు తోడవ్వడంతో ఏపీలో పవన విద్యుత్‌కు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని అధ్యయనాల్లో వెల్లడైంది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, వినియోగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. పవన విద్యుత్‌ను పెంచడం ద్వారా దేశంలో మిలియన్లకు పైగా ఉద్యోగాలను సృష్టించవచ్చని గ్లోబల్ విండ్ ఎనర్జీ కౌన్సిల్(జీడబ్ల్యూఈసీ) ఇటీవల తన నివేదికలో పేర్కొంది. అయితే వాతావరణంలో వస్తున్న మార్పుల ప్రభావం పునరుత్పాదక విద్యుదుత్పత్తిపై పడనుందని, దాని వల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో గాలి వేగం తగ్గి, దక్షిణాది రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఏపీలో పెరిగే అవకాశం ఉందని కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటీయెరాలజీ(పూణె)కి చెందిన పరిశోధకులు తాజాగా వెల్లడించారు. వాతావరణ మార్పులు జల, పవన, సౌర విద్యుదుత్పత్తిపై భవిష్యత్తులో ప్రభావం చూపొచ్చని తాజా అధ్యయనం అంచనా వేసింది. మరోవైపు 'కపుల్డ్ మోడల్ ఇంటర్-కంపారిజన్ ప్రాజెక్ట్(సీఎంఐపీ) ప్రయోగాల్లో సముద్రతీర ప్రాంతాలపై గాలి సామర్థ్యం పెరుగుతున్నట్టు చూపుతోంది. వాతావరణ మార్పుల వల్ల ఏపీలో పవన విద్యుత్‌కు అనుకూల పరిస్థితులున్నట్టు సీఎంఐపీలో అధ్యయనంలో తేలింది.

పవన విద్యుత్ పెరుగుతోంది

పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించి 10,785.51 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం రాష్ట్రానికి ఉంది. ఈ మొత్తంలో పవన విద్యుత్ సామర్థ్యం 4096.65 మెగా వాట్లు కాగా, ప్రస్తుతం రోజుకి 15 మిలియన్ యూనిట్ల నుంచి 20 మిలియన్ యూనిట్ల మధ్య పవన విద్యుత్ వస్తోంది. మరో వారం పది రోజుల్లో మరింత పవన విద్యుత్ అందుబాటులోకి రానుంది.

– విజయానంద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి.

శ్రీశైలానికి మరింత పెరిగిన వరద

- 1,16,516 క్యూసెక్కులకు పెరిగిన ఇన్‌ఫ్లో
- 5 గేట్ల ద్వారా నీరు విడుదల



నాగార్జున సాగర్ నుంచి18 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురి సౌత్/సత్రశాల (రెంటచింతల): శ్రీశైలం జలాశయానికి వరద మరింతగా పెరిగింది. ఎగువ ప్రాజెక్టులైన జూరాల, సుంకేసుల నుంచి మంగళవారం సాయంత్రానికి 1,16,516 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలానికి వస్తోంది. సోమవారం రాత్రి రెండు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల చేయగా, ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం 5 గేట్లను తెరచి 1,39,915 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 66,592 క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 7 వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కులు, హంద్రీ-నీవా సుజల స్రవంతికి 1,013 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 884.80 అడుగుల్లో 214.84 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సాగర్ నుంచి 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

సాగర్ జలాశయానికి 2,10,165 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో మంగళవారం 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. క్రస్ట్ గేట్ల ద్వారా 1,59,626 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 32,886 క్యూసెక్కులు మొత్తం 1,92,512 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ కాలువ, ఎస్ఎల్‌బీసీ, వరద కాలువలు కలిపి 17,653 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

రూ.1,567.46 కోట్ల పింఛన్ సొమ్ము పంపిణీ



విజయవాడ ప్రియదర్శిని కాలనీలో ఎస్‌కే హబీబుల్లాకు పింఛను అందిస్తున్న వలంటీరు ధనలక్ష్మి



గుంటూరు ఐపీడీ కాలనీలో దేవమ్మకు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీరు కరిమున్నీసా

నేడు కూడా పంపిణీ కొనసాగింపు

సాక్షి, అమరావతి: దసరా పండుగ నేపథ్యంలో వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారికి ముందుగానే ప్రభుత్వం ఫింఛన్‌ను అందజేసింది. మంగళవారం కూడా లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వలంటీర్లు కొనసాగించారు. ఈ నెలలో ఇప్పటివరకు 61,63,878 లబ్ధిదారులకు రూ.1,567.46 కోట్లు చేరాయి. 98.57 శాతం మంది లబ్ధిదారులకు ఇప్పటికే పంపిణీ పూర్తయింది. బుధవారం దసరా అయినా, మిగిలిన లబ్ధిదారులకు పంపిణీ కొనసాగుతుందని సెర్ప్ అధికారులు తెలిపారు.

ఓయూలో 26 వరకు తరగతుల్లేవ్

హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ పీజీ కోర్సుల విద్యార్థులకు ఈ నెల 26వ తేదీ వరకు తరగతులు జరగవని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తెలిపారు. దసరా సెలవులు ఈ నెల 9వ తేదీతో ముగిసినా.. కాలేజీలకు అధ్యాపకులు హాజరవుతారు తప్ప తరగతులు ప్రారంభం కావని స్పష్టం చేశారు. కరోనా కారణంగా రెండేళ్లుగా ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పీజీ కోర్సుల తరగతుల నడుమ వ్యవధి ఏర్పడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశాల అనంతరం ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు ఒకేసారి తరగతులు నిర్వహించాలని నిర్ణయించామని.. హాస్టళ్లు, భోజనశాలలు కూడా ఈ నెల 26 నుంచే ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ డైరెక్టర్‌గా ఎ.రాజారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజా రవాణా విభాగం (ఆర్టీసీ) పాలకమండలి సభ్యుడిగా అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన ఎ.రాజారెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఆయనను అనధికార డైరెక్టర్‌గా నియమిస్తూ రవాణా శాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది.

గవర్నర్ విజయదశమి శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రజలకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దేశం యావత్ దసరా పండుగను వేడుకగా జరుపుకుంటుందని పేర్కొన్నారు. కనకదుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలందరికీ శుభం కలగాలని, రాష్ట్రం సుభిక్షంగా, సుసంపన్నంగా వెలుగొందాలని గవర్నర్ ఆకాంక్షించారు.

చంద్రబాబు శుభాకాంక్షలు..

తెలుగు ప్రజలకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దుర్గమ్మ ఆశీస్సులతో సకల జనులకు మంచి జరగాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు నెలకొనాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా...

కులాంతర ప్రేమకు కుటుంబం బలవన్మరణం

శిడ్లఘట్ట: కూతురు వేరే కులం వ్యక్తిని ప్రేమించి వెళ్లిపోయిందని తీవ్ర ఆవేదనకు గురైన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటన కర్ణాటకలో కోలారు జిల్లా హండిగనాళ గ్రామంలో మంగళవారం జరిగింది. శ్రీరామప్ప (69) తన భార్య సరోజ (55), కుమారుడు మనోజ్ (25), కూతురు అర్చనతో హండిగనాళలో ఉంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన డ్రైవర్ నారాయణ స్వామిని ప్రేమించిన అర్చన సోమవారం ఇల్లు వదిలి అతనితో వెళ్లిపోయింది. అర్చన ఒక్కలిగ అగ్రవర్ణానికి చెందిన అమ్మాయి కాగా, నారాయణస్వామి దళిత వ్యక్తి. కూతురు కనిపించడం లేదని అదే రోజు ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామంలో తమ పరువు పోయిందని, ఇక జీవించలేమని నిర్ణయించుకున్నారు. తమ మరణానికి అర్చనే కారణమంటూ సూసైడ్‌నోట్ రాసి పురుగుల మందు తాగి శ్రీరామప్ప, భార్య, కుమారుడు ప్రాణాలు తీసుకున్నారు. అదనపు ఎస్పీ కుశాల్ చౌక్సే, పోలీసులు సంఘటనాస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంటికి తిరిగి రావాలని, లేకపోతే అందరం చచ్చిపోతామని అక్కకు తమ్ముడు మనోజ్ పంపిన మెసేజ్‌లను ఫోన్‌లో పోలీసులు గుర్తించారు.

రాహుల్ యాత్రకు దసరా విరామం

మైసూరు: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు దసరా పండుగ సందర్భంగా ఈ నెల 4, 5 తేదీలలో విరామం ప్రకటించారు. నాలుగు రోజుల క్రితం జోడో యాత్ర కర్ణాటకలో ప్రవేశించి మైసూరు నగరానికి చేరుకుంది. మైసూరులో దసరా మహోత్సవాల సందడి, ప్రజలు పండుగ పనుల్లో ఉన్నందున యాత్రకు సెలవు ఇవ్వడమే మేలని రాహుల్ భావించారు. 6వ తేదీన తిరిగి మొదలయ్యే పాదయాత్రలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ కూడా పాల్గొంటారు. సోనియా ఇప్పటికే మైసూరు చేరుకున్నారు. ప్రస్తుతం మైసూరు హెచ్‌డీ కోటెలోని ఒక రిసార్టులో సోనియా, రాహుల్ గాంధీ విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఢిల్లీలో నలుగురు పీఎఫ్‌ఐ సభ్యుల అరెస్ట్

న్యూఢిల్లీ: నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్‌ఐ)తో సంబంధాలున్న నలుగురు వ్యక్తులను ఢిల్లీ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సెప్టెంబర్ 28వ తేదీన పీఎఫ్‌ఐను కేంద్రం నిషేధించాక ఢిల్లీలో జరిగిన మొదటి అరెస్టులివి. ఢిల్లీలోని వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు జరిపి పీఎఫ్‌ఐతో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న 33 మందిని అదుపులోకి తీసుకుని, విచారణ అనంతరం నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసు శాఖ ప్రతినిధి చెప్పారు. షహీన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు మేరకు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ) కింద వీరిని అరెస్ట్ చేశామన్నారు.

జపాన్ మీదుగా ఉ.కొరియా క్షిపణి ప్రయోగం

సియోల్: ఉత్తరకొరియా మరోసారి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడింది. దాదాపు ఐదేళ్ల తర్వాత ఆ దేశం జపాన్ మీదుగా మంగళవారం బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. అమెరికాకు చెందిన గ్వామ్ దీవిని సైతం తాకే సామర్థ్యమున్న ఈ అణు క్షిపణి ప్రయోగంతో జపాన్ ఉలిక్కిపడింది. ముందు జాగ్రత్తగా పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు కొన్ని ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర కొరియా మంగళవారం మధ్యంతర క్షిపణి ప్రయోగం చేపట్టినట్లు దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ పేర్కొనగా, అది మధ్యంతర లేదా దీర్ఘ శ్రేణి క్షిపణి అయి ఉంటుందని జపాన్ తెలిపింది. ఒకవేళ దీర్ఘ శ్రేణి క్షిపణి అయితే అమెరికా ప్రధాన భూభాగమే లక్ష్యంగా చేపట్టిన ప్రయోగమై ఉంటుందని నిపుణులు అంటున్నారు. తాజా పరిణామాన్ని ప్రమాదకరమైన, నిర్లక్ష్యపూరిత చర్యగా అమెరికా అభివర్ణించింది. ఈ ఏడాదిలో ఉత్తరకొరియా పలుమార్లు క్షిపణి పరీక్షలు జరిపి అమెరికా, మిత్రదేశాలకు తన సత్తా చూపింది.

ఆటోను ఢీకొన్న కంటెయినర్ • 10 మంది మృతి

వడోదర: గుజరాత్‌లోని వడోదర సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అదుపు తప్పిన కంటెయినర్ ట్రక్కు ఎదురుగా వస్తున్న ప్రయాణికుల ఆటోను ఢీకొట్టింది. ఘటనలో ఆటోలోని ఇద్దరు చిన్నారులు, ఇద్దరు మహిళలు సహా 10 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వేగంగా వెళ్తున్న ట్రక్కు కారును ఢీకొట్టి, అదుపు తప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న ఆటోపైకి దూసుకెళ్లింది. కాగా, నుజ్జయిన ఆటోలో చిక్కుకున్న వారిని పోలీసులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. 10 మంది చనిపోగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు చెప్పారు. మృతుల కుటుంబాలకు సీఎం భూపేంద్ర పటేల్ రూ.4 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున సాయం ప్రకటించారు. కాగా, మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో మంగళవారం ఉదయం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఐదుగురు చనిపోయారు.

సవరణ

'లఖీంపూర్ ఖేరిని మర్చిపోం..' శీర్షికన మంగళవారం వచ్చిన వార్తలో రాకేశ్ తికాయత్‌ను పొరపాటున భారతీయ కిసాన్ సంఘ్ నేతగా రాయడం జరిగింది. ఆయన భారతీయ కిసాన్ యూనియన్(బీకేయూ)నేతగా చదువుకోగలరు.


అస్పెక్ట్


జీలింగర్


క్లాసర్

భౌతిక శాస్త్రంలో ముగ్గురికి ఉమ్మడిగా నోబెల్

- క్వాంటమ్ సైన్స్‌లో పరిశోధనలకు ప్రతిష్టాత్మక బహుమతి
- ప్రకటించిన రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్

స్టాక్‌హోమ్: భౌతిక శాస్త్రంలో ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి 2022 సంవత్సరానికి గాను ముగ్గురు సైంటిస్టులను వరించింది. ఫోటాన్లలో చిక్కుముడులు, క్వాంటమ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో అలెన్ ఆస్పెక్ట్(75), జాన్ ఎఫ్ క్లాసర్(79), ఆంటోనీ జీలింగర్(77) సాగించిన విశేషమైన పరిశోధనలను గుర్తించి, ఈ బహుమానానికి ఉమ్మడిగా ఎంపిక చేసినట్లు స్వీడన్‌లోని 'రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' మంగళవారం ప్రకటించింది. క్వాంటమ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ నేడు ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగమని, ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని నోబెల్ కమిటీ సభ్యులు ఈవా ఒల్సాన్ చెప్పారు. సమాచార బదిలీ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెన్సింగ్ టెక్నాలజీ వంటి విభాగాల్లో క్వాంటమ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ గణనీయమైన పాత్ర పోషిస్తోందని అన్నారు. క్వాంటమ్ మెకానిక్స్ నుంచే ఈ సైన్స్ ఉద్భవించిందని తెలిపారు. అలెన్ ఆస్పెక్ట్ ఫ్రాన్స్‌కు చెందినవారు కాగా, జాన్ ఎఫ్ క్లాసర్ అమెరికన్ పౌరుడు, ఆంటోన్ జీలింగర్ ఆస్ట్రియా వాసి. ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు 2010లో ఇజ్రాయెల్‌లో వూల్ఫ్ ప్రైజ్ గెలుచుకున్నారు. నోబెల్ ప్రైజ్ కోసం చాలా ఏళ్లుగా వీరి పేర్లు పరిశీలనకు వస్తున్నాయి. నోబెల్ ప్రైజ్ లభించిందని తెలియగానే మొదట తాను నమ్మలేకపోయానని జీలింగర్ చెప్పారు. ఇది తనకు సానుకూలమైన షాక్ అని ఆనందం వ్యక్తం చేశారు. ఆయన యూనివర్సిటీ ఆఫ్ వియన్నాలో పనిచేస్తున్నారు. రసాయన శాస్త్రంలో నోబెల్ విజేతను బుధవారం ప్రకటించనున్నారు. భౌతిక శాస్త్రంలో గత ఏడాది (2021) నోబెల్ పురస్కారం సూకురో మనాబే, క్లాజ్ హసెల్‌మన్, జార్జియో పారిసి అనే ముగ్గురు శాస్త్రవేత్తలకు ఉమ్మడిగా లభించిన సంగతి తెలిసిందే.

కణ కవలలపై పరిశోధనలు

- క్వాంటమ్ ఎంటాంగిల్మెంట్‌పై అలెన్ ఆస్పెక్ట్, క్లాసర్, జీలింగర్ కృషి
- వేగవంతమైన కంప్యూటర్లు, సురక్షితమైన సమాచార వ్యవస్థల రూపకల్పనకు వీలు

అక్కినేని నాగార్జున ద్విపాత్రాభియనం చేసిన సినిమా 'హలో బ్రదర్' గుర్తుందా? 1994లో విడుదలైన ఈ సినిమా చూసుంటే.. ఈ ఏడాది భౌతిక శాస్త్ర నోబెల్ ప్రైజ్ గ్రహీతలు అలెన్ ఆస్పెక్ట్, జాన్ ఎఫ్ క్లాసర్, ఆంటోనీ జీలింగర్‌లు చేసిన పరిశోధనలు అర్థం చేసుకోవడం సులువవుతుంది. కణస్థాయిలో జరిగే కొన్ని భౌతిక దృగ్విషయాలను నియంత్రించడం వీలవుతుందని వీరు వేర్వేరుగా జరిపిన పరిశోధనలు స్పష్టం చేశాయి. ఫలితంగా అత్యంత శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటర్ల తయారీ మొదలుకొని హ్యాకింగ్‌కు అస్సలు చిక్కని సమాచార వ్యవస్థల రూపకల్పనకు మార్గం సుగమమైంది. ఇంతకీ ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు జరిపిన ప్రయోగాలేమిటి? హలో బ్రదర్ సినిమా చూసుంటే వాటిని అర్థం చేసుకోవడం ఎలా సులువు అవుతుంది?

దూరంగా ఉన్నప్పటికీ ఒకేలా ప్రవర్తన

ముందుగా చెప్పుకున్నట్లు హలో బ్రదర్ చిత్రంలో నాగార్జునది ద్విపాత్రాభినయం. పుట్టినప్పుడే వేరైన ఇద్దరు కవలల కథ. కవలలంటే చూసేందుకు ఒకేలా ఉండేవారు మాత్రమే అని అనుకునేరు. వీరిద్దరు కొంచెం దగ్గరగా వస్తే చాలు.. ఒకరిని కొడితే ఇంకొకరికి నొప్పి కలుగుతుంది. కిలోమీటర్ దూరంలో ఉన్నా సరే ఒకరికి నవ్వు వచ్చినా, దుఃఖం కలిగినా అదే రకమైన భావనలు రెండో వ్యక్తిలోనూ కలుగుతూంటాయి! నిజ జీవితంలో ఇలాంటి కవలలు ఉండటం అసాధ్యమేమో గానీ భౌతిక శాస్త్రంలో మాత్రం సుసాధ్యమే. సూక్ష్మ కణాల మధ్య కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇలాంటి స్థితి ఏర్పడుతూ ఉంటుంది. దీన్నే క్వాంటమ్ ఎంటాంగిల్మెంట్ అని పిలుస్తుంటారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ ఈ కణాల్లో ఒకదానిలో జరిగే మార్పు ప్రభావం ఇంకోదాంట్లోనూ కనిపిస్తుందన్నమాట! అలెన్ ఆస్పెక్ట్, జాన్ ఎఫ్ క్లాసర్, ఆంటోన్ జీలింగర్‌లు పరిశోధనలు చేసింది ఈ క్వాంటమ్ ఎంటాంగిల్మెంట్‌పైనే. దూరంగా ఉన్నా కూడా ఒక్కతీరుగా ప్రవర్తించే కాంతి కణాల (ఫోటాన్లు)పై ఈ ముగ్గురు శాస్త్రవేత్తలూ వేర్వేరుగా పరిశోధనలు నిర్వహించారు. ఈ ప్రయోగాల ఫలితాల ఆధారంగా కొన్ని కొత్త, వినూత్నమైన టెక్నాలజీలు రూపుదిద్దుకున్నాయి. ఫలితంగా చాలాకాలంగా కేవలం సిద్ధాంతాలకు మాత్రమే పరిమితమైన కొన్ని విషయాలు వాస్తవ రూపం దాల్చడం మొదలైంది. లెక్కకు చిక్కనంత వేగంగా పనిచేసే కంప్యూటర్లు, అతి సురక్షితమైన సమాచార వ్యవస్థలు వీటిల్లో మచ్చుకు కొన్ని మాత్రమే.

చిరకాల శేష ప్రశ్నలు

నిజానికి క్వాంటమ్ ఎంటాంగిల్మెంట్‌పై చాలాకాలంగా ఎన్నో శేష ప్రశ్నలు మిగిలే ఉన్నాయి. రెండు కణాలు దూరంగా ఉన్నా ఒకేలా ప్రవర్తించడం వెనుక ఏముందో తెలుసుకునేందుకు ప్రయత్నాలు చాలానే జరిగాయి. 1960వ దశకంలో జాన్ స్టూవర్ట్ బెల్ అనే శాస్త్రవేత్త ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. గుర్తు తెలియని అంశాలు ఉన్నప్పుడు పెద్ద ఎత్తున సేకరించే కొలతల ఫలితాలు నిర్దిష్టమైన విలువకు మించి ఉండవని ఈ సిద్ధాంతం చెబుతుంది. ఈ ''బెల్స్ అసమానత''లు నిర్దిష్ట ప్రయోగాల్లో చెల్లవని క్వాంటమ్ మెకానిక్స్ చెబుతుంది. ఈ ఏడాది భౌతికశాస్త్ర నోబెల్ ప్రైజ్ గ్రహీతల్లో ఒకరైన జాన్ ఎఫ్ క్లాసర్ గతంలోని స్టూవర్ట్ బెల్ సిద్ధాంతాలను మరింత అభివృద్ధి చేయడమే కాకుండా.. లెక్కలకు మాత్రమే పరిమితం కాకుండా వాస్తవిక ప్రయోగాలు చేపట్టారు. క్వాంటమ్ మెకానిక్స్‌లో ''బెల్స్ అసమానత''లు పనిచేయవని స్పష్టమైంది. అలెన్ ఆస్పెక్ట్ ఈ విషయాలను మరింత ముందుకు తీసుకెళుతూ.. జాన్ క్లాసర్ ప్రయోగాల్లోని కొన్ని లోపాలను సరిదిద్దే వ్యవస్థను రూపొందించారు. వీరిద్దరి ప్రయోగాల ఫలితాల ఆధారంగా ఆంటోనీ జీలింగర్ ఎంటాంగిల్మెంట్ స్థితిలో ఉన్న కణాలను నియంత్రించవచ్చని ప్రయోగపూర్వకంగా నిరూపించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

సైనిక పరిష్కారం అసాధ్యం

జెలెన్‌స్కీతో మోదీ మంతనాలు

న్యూఢిల్లీ: నెలల తరబడి కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి సైనిక పరిష్కారం అసాధ్యమని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. 'ఇరు దేశాల పరస్పర దాడులతో రష్యా, ఉక్రెయిన్‌లోని అణువిద్యుత్ కేంద్రాల భద్రత ప్రమాదంలో పడింది. ఇది పౌర సమాజానికి, పర్యావరణానికి పెను ముప్పుగా మారనుంది' అని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. యుద్ధం నేపథ్యంలో మంగళవారం మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మంతనాలు జరిపారు. 'ఇకనైనా శత్రుత్వాలకు సెలవు పలికి చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యకు పరిష్కారం చూడాలి. సైనిక పరిష్కారం అసాధ్యం' అని జెలెన్‌స్కీతో మోదీ అన్నారు. మరోవైపు, 4 ఉక్రెయిన్ ప్రాంతాలను కలిపేసుకుంటూ రష్యా తెచ్చిన తీర్మానాలను ఆ దేశ పార్లమెంట్ ఓకే చెప్పింది.

ఎన్నికల హామీలకు నిధులెలా తెస్తారు?

- ఈ నెల 19లోగా అభిప్రాయాలు పంపండి
- రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ
- ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సవరించాలని యోచన

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత పథకాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఉచితాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా మోడల్ కోడ్‌ను(ఎన్నికల ప్రవర్తనా నియమావళి) సవరించాలని ఎన్నికల సంఘం నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల హామీల అమలుకు నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తారో ఓటర్లకు చెప్పాలని, ఈ ప్రతిపాదనపై ఈ నెల 19వ తేదీలోగా అభిప్రాయాలు తెలియజేయాలని పేర్కొంది. ఈ మేరకు గుర్తింపు పొందిన అన్ని జాతీయ పార్టీలు, రాష్ట్ర పార్టీలకు మంగళవారం లేఖ రాసింది. మేనిఫెస్టోల్లో ప్రకటించిన ఎన్నికల వాగ్దానాలకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ఓటర్లకు అందజేయాలని లేఖలో స్పష్టం చేసింది. మోడల్ కోడ్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న ఆర్థిక వనరులు ఏమిటో కూడా ఓటర్లకు తెలియచేయాలని వెల్లడించింది. పార్టీ ఇచ్చే ఎన్నికల హామీల విషయంలో తాము కళ్లు మూసుకొని కూర్చోలేమని తేల్చిచెప్పింది.

బూటకపు వాగ్దానాలతో విపరిణామాలు

రాజకీయ పార్టీలు ఇచ్చే బూటకపు వాగ్దానాలు విపరిణామాలకు దారితీస్తాయని ఎన్నికల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు వాగ్దానాలు చేయకుండా తాము అడ్డుకోలేకపోనప్పటికీ, ఓటర్లకు సమాచారం ఇచ్చే హక్కు ఉందని పేర్కొంది. ఇకపై దేశంలో ఎప్పుడు, ఎక్కడ ఎన్నికలు జరిగినా ప్రతి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నిర్దిష్ట ఫార్మాట్‌లో పార్టీల వ్యయాల వివరాలను అందించాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. ఎన్నికల హామీల అమలుకు అవసరమైన నిధుల వివరాలను ఓటర్లకు చెప్పే అంశాన్ని ఎన్నికల ప్రవర్తనా నియామావళి(ఎంసీసీ)లోని పార్ట్–8లో (ఎన్నికల మేనిఫెస్టోపై మార్గదర్శకాలు) చేరుస్తూ ఎంసీసీని సవరించాలని ఎన్నికల సంఘం ప్రతిపాదించింది. దీని ప్రకారం మేనిఫెస్టోల్లో ఇచ్చే హామీల అమలుకు నిధులు సేకరించే మార్గాలను బహిర్గతం చేయాల్సి ఉంటుంది. అదనపు పన్నులు, ఖర్చుల హేతుబద్ధీకరణ, కొన్ని పథకాల్లో కోత, మరిన్ని అప్పులు తీసుకురావడం వంటి వివరాలు వెల్లడించాలి. ఓటర్లకు ఉచితాలు పంచే సంస్కృతికి రాజకీయ పార్టీలు చరమగీతం పాడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే పిలుపునిచ్చారు. దీనిపై అధికార బీజేపీ, ప్రతిపక్షాల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం సైతం జరిగింది. ఉచితాలపై సర్వోన్నత న్యాయస్థానంలో సైతం ప్రస్తుతం విచారణ కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

మంచు చరియలు పడి 10 మంది మృతి


కాపాడేందుకు బయల్దేరిన సహాయక బృందం

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తర కాశీ జిల్లాలోని 'ద్రౌపది కా దండా–2'పర్వత శిఖరం వద్ద మంచు చరియలు విరిగి పడిన ఘటనలో 10 మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయారు. నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెయినీరింగ్ (ఎన్‌ఐఎం)కు చెందిన 34 మంది పర్వతారోహకులు, ఏడుగురు ఇన్‌స్ట్రక్టర్లు మంగళవారం ఉదయం 'ద్రౌపది కా దండా–2'పర్వత శిఖరం అధిరోహించారు. తిరిగి వస్తుండగా 8.45 గంటల సమయంలో 17వేల అడుగుల ఎత్తులో ఉండగా మంచు చరియలుపడ్డాయి. వారిలో 8 మందిని తోటి వారు రక్షించగలిగారు. 10 మంది చనిపోయారని ఎన్‌ఐఎం ప్రిన్సిపాల్ కల్నల్ అమిత్ బిష్త్ చెప్పారు. ఇప్పటి వరకు నాలుగు మృతదేహాలను వెలికి తీసినట్లు చెప్పారు. మిగతా వారి కోసం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం(ఎస్‌డీఆర్‌ఎఫ్), ఐటీబీపీ పోలీసులు, ఎన్‌ఐఎం నిపుణుల సాయం తీసుకుంటున్నట్లు సీఎం ధామి చెప్పారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

విషమంగా ములాయం ఆరోగ్యం

లక్నో/గురుగ్రామ్: గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రి ఐసీయూలో సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, యూపీ మాజీ సీఎం ములాయం సింగ్(82) యాదవ్‌కు చికిత్స కొనసాగుతోంది. ఆయన పరిస్థితి విషమంగానే ఉందని సమాజ్‌వాదీ పార్టీ తెలిపింది. పూర్తి స్థాయి వైద్య నిపుణుల బృందం ఆయనకు చికిత్స కొనగిస్తోందంటూ ఆస్పత్రి వర్గాలు విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌ను ఆ పార్టీ మంగళవారం ట్వీట్ చేసింది.


నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అహ్మదాబాద్‌లో చీరలు ధరించి గర్బా నృత్య కార్యక్రమంలో పాల్గొన్న పురుషులు

విత్‌డ్రా చేయించాలని రాహుల్‌పై ఒత్తిడి తెచ్చారు

తిరువనంతపురం: కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో తన అభ్యర్థిత్వానికి వ్యతిరేకంగా కొందరు రాహుల్ గాంధీని ఆశ్రయించారని ఆ పార్టీ నేత శశిథరూర్ వెల్లడించారు. ''నేను ఎన్నికల్లో నిల్చోవడం కొందరికి సుతరామూ ఇష్టంలేదు. నేరుగా నాకే ఈ విషయం చెప్పలేక కొందరు రాహుల్ గాంధీ చెంతకు వెళ్లారు. థరూర్ తన నామినేషన్ ఉపసంహరించుకునేలా మీరే ఒప్పించాలని ఆయనపై ఒత్తిడి పెంచారు' అని థరూర్ పేర్కొన్నారు. ''అయితే ఈ విషయంలో ఆ కొందరికి రాహుల్ వద్ద పరాభవం ఎదురైంది. 'కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో ఏకగ్రీవం వద్దు. పోటీ ఉండాల్సిందే. విత్‌డ్రా చేసుకోవాలని థరూర్‌కు నేను సూచించలేను' అని వారిని రాహుల్ వారించారు. 'కాంగ్రెస్‌లో చాలా మంది సీనియర్ నేతలున్నారు. వారి మద్దతు నేనెప్పుడూ కోరుకోలేదు. ఇప్పుడు కూడా అంతే' అని థరూర్ వ్యాఖ్యానించారు.

కశ్మీర్ జైళ్ల శాఖ డీజీ దారుణ హత్య

పనిమనిషే హంతకుడని తేల్చిన పోలీసులు


డీజీ హేమంత్(ఫైల్)


నిందితుడు యాసిర్

జమ్మూ: జమ్మూకశ్మీర్ డైరెక్టర్ జనరల్ (జైళ్లు) హేమంత్ కె లోహియా(57) సోమవారం రాత్రి హత్యకు గురయ్యారు. జమ్మూ శివారులో కన్హాచక్ ప్రాంతంలోని స్నేహితుడి ఇంట్లో తెగిన గొంతు, కాలిన గాయాలతో విగతజీవిగా కనిపించారు. పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్(పీఏఎఫ్ఎఫ్) తామే డీజీని చంపినట్లు ప్రకటించుకుంది. పరారీలో ఉన్న పనిమనిషి యాసిర్ లోహార్(23)ని పోలీసులు తీవ్రంగా గాలించి మంగళవారం పట్టుకున్నారు. 'ఘటనలో ఉగ్రవాదుల హస్తమున్నట్లు కనిపించడం లేదు. యాసిర్‌ను విచారిస్తున్నాం. అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నాం'అని ఘటనా స్థలిని పరిశీలించిన డీజీపీ దిల్బాగ్ సింగ్ చెప్పారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మూడు రోజుల పర్యటన సమయంలోనే 1992 బ్యాచ్ ఐపీఎస్ అయిన హేమంత్ హత్యకు గురికావడం సంచలనం కలిగించింది. ఆగస్టులోనే హేమంత్ లోహియా ప్రమోషన్‌పై జైళ్ల విభాగం డీజీగా నియమితులయ్యారు. స్నేహితుడి ఇంట్లోకి ఇటీవలే ఆయన మకాం మార్చారు.

పదునైన ఆయుధంతో దాడి


హత్యా ఘటనకు సంబంధించిన మరికొన్ని వివరాలను అదనపు డీజీపీ ముకేశ్ సింగ్ వెల్లడించారు. 'సోమవారం రాత్రి డీజీ హేమంత్ కాళ్లకు ఆయిల్ రుద్దుకుంటున్న సమయంలో లోపలి నుంచి తలుపు బోల్ట్ పెట్టిన యాసిర్.. అదను చూసి ఆయనపై పదునైన ఆయుధంతో దాడి చేశాడు. పగిలిన బాటిల్‌తో గొంతు కోశాడు. అనంతరం తలదిండును ముఖంపై అదిమి ఊపిరాడకుండా చేశాడు. దిండుకు నిప్పుపెట్టి మృతదేహాన్ని కాల్చేందుకు యత్నించాడు. లోపలి నుంచి పొగలు రావడం గమనించిన గార్డులు తలుపు పగులగొట్టి లోపలికి వచ్చారు. అప్పటికే యాసిర్ పరారయ్యాడు' అని ఆయన వివరించారు. 'ఆ వెంటనే యాసిర్ కోసం పోలీసులు వేట ప్రారంభించారు. సాంతూరు రాంబన్ జిల్లా హల్లా ధంద్రత్‌లో ఉంటున్న అతని భార్య సహా కొందరిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలికి 10 కిలోమీటర్ల దూరంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో దాక్కున్న యాసిర్‌ను పట్టుకున్నాం' అని చెప్పారు. ఆరు నెలలుగా ఆ ఇంట్లో పనిచేస్తున్న యాసిర్ మానసిక పరిస్థితి బాగోలేదని, జీవితంపై విరక్తితో ఉన్నట్లు అతడి డైరీ రాతలను బట్టి తెలుస్తోందన్నారు. డీజీ మృతదేహానికి జమ్మూ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. ఆ తర్వాత వేరే చోట అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

డీలిమిటేషన్‌లో మార్పులు చేయలేం

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ఆర్డర్ గెజిట్ నోటిఫికేషన్‌ను సవాల్ చేయడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం, జమ్మూకశ్మీర్(యూటీ) స్పష్టం చేశాయి. ఈ పునర్విభజనకు సంబంధించి కమిషన్ ఏర్పాటు, దాని పరిధి, పదవీకాలం, అధికారాలపై ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన నేపథ్యంలో దీనిపై వ్యాఖ్యలు చేయదలచుకోలేదని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను సవాల్ చేస్తూ హాజీ అబ్దుల్ గనీ ఖాన్, మహమూద్ మట్టూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు కేంద్రం, జమ్మూకశ్మీర్(యూటీ), ఎన్నికల సంఘం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశాయి. పునర్విభజనపై ఏర్పాటైన కమిషన్ గెజిట్‌లో ప్రచురణ అయిన తర్వాత డీలిమిటేషన్ చట్టం–2002లోని సెక్షన్ 10(2) ప్రకారం సవాల్ చేయడం సాధ్యం కాదని కేంద్రం పేర్కొంది. మేఘరాజ్ కొఠారీ వర్సెస్ డీలిమిటేషన్ కమిషన్ కేసులో ఈ సెక్షన్‌ను ఇప్పటికే కోర్టు సమర్థించిందని గుర్తుచేసింది. పిటిషన్లను అనుమతిస్తే గెజిట్ నిష్ఫలం అవుతుందని, ఇది ఆర్టికల్ 329ని ఉల్లంఘించడమేనని తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసెంబ్లీ సీట్లు పెంపునకు సంబంధించి ఏపీ విభజన చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ఇదే కేసుతో సుప్రీంకోర్టు గతంలో జత చేసింది.

ఢిల్లీలో 'ఉచిత విద్యుత్'పై దర్యాప్తు

- వారంలోగా నివేదిక ఇవ్వండి
- చీఫ్ సెక్రటరీకి లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా ఆదేశం



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అమలవుతున్న ఉచిత విద్యుత్ పథకంలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరపాలని లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లోగా తనకు నివేదిక అందజేయాలని చీఫ్ సెక్రటరీ నరేశ్ కుమార్‌కు లెఫ్టినెంట్ గవర్నర్ సూచించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత్ విద్యుత్ పథకంలో అక్రమాలు జరిగాయని, ఇందులో లోపాలున్నాయని లెఫ్టినెంట్ గవర్నర్ సెక్రటేరియట్‌కు ఫిర్యాదులు అందినట్లు వెల్లడించాయి. ఈ పథకం వెనుక భారీ కుంభకోణం ఉందంటూ న్యాయవాద వర్గాల నుంచి కూడా ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నాయి.

ఉచిత విద్యుత్‌ను అడ్డుకొనే కుట్ర: కేజ్రీవాల్

తాము ప్రకటించిన ఉచిత విద్యుత్ పథకం పట్ల గుజరాత్ ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. అందుకే ఢిల్లీలో ఉచిత్ విద్యుత్‌కు అడ్డంకులు సృష్టించేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాల నేపథ్యంలో ఈ మేరకు మంగళవారం ట్వీట్ చేశారు. దేశ రాజధానిలో ఉచిత విద్యుత్ పథకాన్ని ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. గుజరాత్‌లో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వచ్చే ఏడాది మార్చి 1వ తేదీ నుంచి ప్రజలకు ఉచితంగా కరెంటు సరఫరా చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం పన్నుల పేరిట ప్రజల రక్తం పీల్చేస్తోందని, వారికి కొంత ఊరటనివ్వాలని తాము సంకల్పిస్తే బీజేపీ సహించలేకపోతోందని దుయ్యబట్టారు. ఇదిలా ఉండగా, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ విజయాన్ని అడ్డుకోవడానికి కేంద్ర సర్కారు కుతంత్రాలకు పాల్పడుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ విమర్శించింది. ఢిల్లీలో ఉచిత విద్యుత్ పథకంపై వస్తున్న ఆరోపణలను ఖండించింది.


పార్లమెంటరీ స్థాయీ సంఘాల పునర్వ్యవస్థీకరణ

చైర్మన్ పదవుల్లో ప్రతిపక్షాలకు మొండిచేయి

న్యూఢిల్లీ: పలు పార్లమెంటరీ స్థాయీ సంఘాలను కేంద్ర ప్రభుత్వం మంగళవారం పునర్వ్యస్థీకరించింది. చైర్మన్ పదవులు అధికార బీజేపీ, మిత్రపక్షాలకే దక్కాయి. ప్రతిపక్షాలకు మొండిచెయ్యి ఎదురయ్యింది. ఇన్నాళ్లూ వివిధ స్టాండింగ్ కమిటీలకు చైర్మన్‌గా పనిచేసిన ప్రతిపక్ష ఎంపీలను తొలగించారు. హోంశాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ పదవి నుంచి కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మనూ సింఘ్విని తొలగించి, బీజేపీ ఎంపీ బ్రిజ్ లాల్‌ను నియమించారు. ఐటీ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ పోస్టు నుంచి కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్‌ను తొలగించారు. షిండే వర్గం శివసేన ఎంపీ ప్రతాప్‌రావు జాదవ్‌ను నియమించారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ పోస్టు నుంచి సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్‌గోపాల్ యాదవ్‌ను పక్కనపెట్టారు. పరిశ్రమలపై స్టాండింగ్ కమిటీ చైర్మన్ పదవి తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్) నుంచి డీఎంకే చేతుల్లోకి వెళ్లిపోయింది. పార్లమెంట్‌లో మూడో అతిపెద్ద పార్టీ, రెండో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కనీసం ఒక్క చైర్మన్ పదవి లభించలేదు.

గుజ్జర్, బకర్వాల్, పహాడీ వర్గాలకు ఎస్టీ హోదా

కశ్మీర్ పర్యటనలో హామీ ఇచ్చిన హోం మంత్రి అమిత్ షా



రాజౌరీ(జమ్మూకశ్మీర్): జమ్మూకశ్మీర్‌లో వెనకబడిన వర్గాలైన గుజ్జర్, బకర్వాల్, పహాడీలకు ఎస్టీ హోదా కల్పిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. జమ్మూకశ్మీర్ పర్యటనలో ఉన్న అమిత్ మంగళవారం రాజౌరీలో ఏర్పాటుచేసిన ఒక ర్యాలీలో ప్రసంగించారు. 'జస్టిస్ వర్మ కమిషన్ సిఫార్సుల మేరకు ఈ మూడు వర్గాల ప్రజలకు ఎస్టీ రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయి. వీరికి కొత్తగా రిజర్వేషన్ ఇవ్వడం వల్ల ఇప్పటికే ఎస్టీ కోటా లబ్ధి పొందుతున్న వర్గాలకు ఎలాంటి నష్టం జరగబోదు. మూడేళ్ల క్రితం ఆర్టికల్ 370, ఆర్టికల్ 35–ఏ రద్దుచేశాక నేడు ఈ వర్గాలకు రిజర్వేషన్ కల్పించే అవకాశం వచ్చింది' అని షా అన్నారు. 'ఒక్క పహాడీలకే ఎస్టీ హోదా దక్కుతుందని కొందరు విష ప్రచారం చేసి గుజ్జర్, బకర్వాల్‌లను నిరసనలకు రెచ్చగొట్టారు. కానీ ఆ పాచికలు పారలేదు. గతంలో కేవలం మూడు కుటుంబాలే కశ్మీర్‌ను దశాబ్దాలపాటు ఏలాయి. ఇప్పుడు పంచాయతీ, జిల్లా మండళ్లకు జరిగిన పారదర్శకమైన ఎన్నికల ద్వారా 30 వేల మందికి తమ రాష్ట్రాన్ని ముందుకు నడిపించే అధికారమొచ్చింది' అని రాష్ట్ర ప్రతిపక్ష పార్టీలను అమిత్ దుయ్యబట్టారు. 'పునర్‌వ్యవస్థీకరణ తర్వాత రాజౌరీ, పూంచ్, దోడా, కిష్త్వార్‌లలో సీట్లు పెరుగుతాయి. తర్వాతే రాష్ట్ర ఎన్నికలు ఉంటాయి. గతంలో రాష్ట్రానికొచ్చే కేంద్ర నిధులతో కొన్ని వర్గాలే లబ్ధి పొందేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. శాంతి భద్రతల పరిస్థితి మెరుగుపడింది' అని షా అన్నారు. సరిహద్దు జిల్లాలైన రాజౌరీ, పూంచ్‌లలో జనాభాలో 40 శాతం మంది బకర్వాల్, గుజ్జర్‌లే. పహాడీల జనాభా అతి స్వల్పం. 1991 ఏప్రిల్ నుంచి కశ్మీరీలు, డోగ్రాలకు 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ ఫలాలు దక్కుతున్నాయి. తమకు రిజర్వేషన్ కల్పించాలని చాన్నాళ్లుగా పహాడీలు డిమాండ్ చేస్తుండగా గుజ్జర్, బకర్వాల్‌లు వ్యతిరేకిస్తున్నారు. 2020 జనవరి నుంచి ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో పహాడీలకు 4 శాతం కోటా కల్పించారు.

మహిషాసురమర్ధనిగా రాజశ్యామల


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

సింహాచలం: విశాఖ శ్రీశారదా పీఠంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 9వ రోజు శ్రీశారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు మహిషాసురమర్ధనిగా మంగళవారం దర్శనమిచ్చారు. అమ్మవారికి పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి విశేష పూజలు నిర్వహించారు. చండీహోమం, చండీ పారాయణం, నవావరణార్చన, రాజశ్యామల హోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తేరుపై తిరుమలవాసుడు!

అశ్వవాహనంపై విహరించిన ఆపదమొక్కులవాడు

తిరుమల: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ వేంకటేశ్వరుడు మహారథం (తేరు)పై భక్తులను అనుగ్రహించాడు. భక్తకోటి గోవింద శరణాగతుల మధ్య ఈ కార్యక్రమం ఆలయ మాడ వీధుల్లో వేడుకగా సాగింది. గుర్రాల వంటి ఇంద్రియాలు మనస్సు అనే తాడుతో కట్టి రథం వంటి శరీరాన్ని రథికుడైన ఆత్మ ద్వారా అదుపు చేయాలనే తత్వజ్ఞానాన్ని స్వామి వారు ఈ రథోత్సవం ద్వారా భక్తులకు సందేశమిచ్చారు. రథసేవలో దేవదేవుడిని దర్శించినవారికి పునర్జన్మ ఉండదని పురాణాల ప్రవచనం. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు గోవిందా.. గోవిందా..అంటూ మహారథం మోకు (తాడు)ను లాగారు. వాహన సేవ తరువాత గంట పాటు పండితులు నిర్వహించిన వేదగోష్టితో సప్తగిరులు పులకించాయి.

అశ్వవాహనంపై ఆనందనిలయుడి దర్శనం

రాత్రి చల్లటి చలిగాలుల మధ్య మలయప్ప స్వామి అశ్వ వాహనంపై భక్తులను కటాక్షించారు. చతురంగ బలాల్లో అత్యంత ప్రధానమైనది అశ్వ బలం.


అశ్వవాహనంపై ఊరేగుతున్న మలయప్ప స్వామి వారికి హారతి ఇస్తున్న టీటీడీ అర్చకులు

కలియుగాంతంలో శ్రీనివాసుడు అశ్వవాహనం మీద వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తాడని చాటి చెప్పడమే ఈ వాహన పరమార్థం. బంగారు, వజ్ర, వైఢూర్య ఆభరణాలు, విశేష పుష్పాలంకరణాంతరం స్వామి వారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగారు. బ్రహ్మరథం, గజ, అశ్వ, తురగ, చతురంగ బలాలు ముందుకు సాగగా జానపద కళాకారులు, భజన బృందాలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య వాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది.

సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 32 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సర్వ దర్శనానికి 10 గంటలు పడుతోంది. సోమవారం అర్ధరాత్రి వరకు 82,815 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3 05 కోట్లు వేశారు.

నేడే చక్రస్నానం..

బుధవారం ఉదయం 3 గంటల నుంచి పల్లకి ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని వరాహస్వామి ఆలయంలో నిర్వహిస్తారు. ఆ తరువాత శ్రీవారి శంఖు, చక్రాలను పుష్కర జలాల్లో ముంచి లేపుతారు. ఈ కార్యక్రమం ఉదయం 3 నుంచి ప్రారంభమై 9 గంటలకు ముగుస్తుంది. రాత్రి 7–9 గంటల మధ్యలో ధ్వజావరోహణం నిర్వహిస్తారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు


వాహన సేవలో పాల్గొన్న జస్టిస్ ఎన్వీ రమణ

శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ రవీంద్ర బాబు, జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. అనంతరం వీరందరూ వాహన సేవలో పాల్గొన్నారు. అలాగే, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అశ్వవాహన సేవలో పాల్గొన్నారు.

సిద్ధిదాయినిగా శ్రీశైల భ్రామరి

అశ్వవాహనంపై మల్లికార్జునుడు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లు అశ్వవాహనంపై అధిష్టించి భక్తులకు కనువిందు చేశారు. భ్రమరాంబదేవి సిద్ధిదాయిని అలంకారంలో భక్తులకు అభయమిస్తూ దర్శనమిచ్చారు. అక్కమహాదేవి అలంకార మండపంలో సిద్ధిదాయిని అలంకారంలో ఉన్న భ్రమరాంబదేవి, అశ్వవాహనంపై అధిష్టించిన స్వామివార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ప్రదక్షిణ చేయించి గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తరించారు.

ఎన్నికల్లో పోటీ ప్రాథమిక హక్కు కాదు

అది చట్టబద్ధ హక్కు మాత్రమే

- నామినేషన్ తిరస్కరణ ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కాదు
- ఏపీ సెక్రటేరియట్ సెక్షన్ ఆఫీసర్ల సంఘం ఎన్నికల కేసులో హైకోర్టు తీర్పు

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో పోటీ చేయడమన్నది ప్రాథమిక హక్కు కాదని, చట్టబద్ధ హక్కు మాత్రమేనని హైకోర్టు తేల్చి చెప్పింది. నామినేషన్ తిరస్కరణ ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు రాదని స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదని, దానికి విచారణార్హత లేదని తెలిపింది. ప్రస్తుత కేసులో పిటిషనర్ ఏపీ సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం కింద జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునంది. ఎన్నికల అధికారి నియామకాన్ని కూడా అక్కడే సవాలు చేసుకోవాలని తెలిపింది. ఆ పిటిషన్‌ను 6 నెలల్లో పరిష్కరించాలని జిల్లా కోర్టును ఆదేశిస్తూ జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ తీర్పు చెప్పారు.

ఏపీ సెక్రటేరియట్ సెక్షన్ ఆఫీసర్ల సంఘం ఎన్నికల్లో తన నామినేషన్‌ను తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ రెవెన్యూ శాఖలో సెక్షన్ ఆఫీసర్ వాసుదేవరావు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. ఆయన తరఫు న్యాయవాది తాతా సింగయ్యగౌడ్ వాదనలు వినిపిస్తూ, సంఘం కార్యదర్శి పోస్టుకు పిటిషనర్ నామినేషన్ దాఖలు చేశారని, అన్నీ పక్కాగా ఉన్నా కూడా ఓటర్ల జాబితాలోని సీరియల్ నంబర్‌తో పేరు సరిపోలడంలేదంటూ నామినేషన్‌ను తిరస్కరించారని తెలిపారు. దీని ద్వారా పిటిషనర్ ప్రాథమిక హక్కులను హరించారని తెలిపారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన వ్యక్తి నియామకం చెల్లదని, అతను సెక్షన్ ఆఫీసర్ కాదని, అసిస్టెంట్ సెక్రటరీగా పదోన్నతి పొందారని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది వి.మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ, అసలు ఈ వ్యాజ్యానికి విచారణార్హతే లేదని తెలిపారు. ఏపీ సెక్రటేరియట్ సెక్షన్ ఆఫీసర్ల సంఘం ఏపీ సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం కింద ఏర్పాటైందని, అందువల్ల నామినేషన్ తిరస్కరణపై జిల్లా కోర్టులో సవాల్ చేయాలన్నారు. ఈ ఎన్నికలతో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని తెలిపారు. అసోసియేషన్ తరఫు న్యాయవాది అప్పారావు వాదనలు వినిపిస్తూ, ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాత అందులో కోర్టు జోక్యం తగదన్నారు. ఫలితాల తరువాత జిల్లా కోర్టులో పిటిషన్ వేయడమే పిటిషనర్ ముందున్న మార్గమన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెలువరించారు.

మహిషాసురమర్ధనిగా కరుణించిన కనకదుర్గ

- టీటీడీ తరఫున కనకదుర్గమ్మకు సారె
- నేటితో ముగియనున్న దసరా ఉత్సవాలు
- నేడు జలవిహారం
- పెరుగుతున్న భవానీ భక్తులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా వేడుకలు తుదిదశకు చేరాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజు మంగళవారం కనకదుర్గమ్మ.. మహిషాసురమర్ధనిగా భక్తులను అనుగ్రహించారు. ఈ ఉత్సవాలు బుధవారం పూర్ణాహుతితో ముగియనున్నాయి. ఈ ఏడాది ఉత్సవాల్లో మూలా నక్షత్రం నుంచి భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. దసరా ఘడియలు దగ్గర పడుతుండటంతో ఉత్తరాంధ్ర నుంచి వచ్చే భక్తుల సంఖ్య బాగా పెరిగింది. ఈ ఏడాది కరోనా ప్రభావం లేకపోవడంతో పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనం కోసం భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేసి, అందుకు తగ్గట్లు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అనధికార దర్శనాలకు అడ్డుకట్టవేసి, సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా కలెక్టర్ తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. ఇప్పటికే దాదాపు 10 లక్షలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయవర్గాలు పేర్కొన్నాయి. మహర్నవమి సందర్భంగా మంగళవారం భారీగా తరలివచ్చిన భక్తులు నగరోత్సవంలో అమ్మవారిని దర్శించుకుని తరించారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో మంత్రి చెల్లుబోయిన గోపాలకృష్ణ, మాజీ మంత్రి కొడాలి నాని తదితరులున్నారు. ఉత్సవాల్లో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కుచిపూడి కళాకారుల నాట్య విన్యాసాలు భక్తులను అలరించాయి.

నేడు హంసవాహన తెప్పోత్సవం

దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా విజయదశమి రోజు బుధవారం శ్రీగంగా, దుర్గ అమ్మవార్ల సమేత మల్లేశ్వరస్వామి కృష్ణానదిలో జలవిహారం చేయనున్నారు. హంసవాహన తెప్పోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. కృష్ణానదికి వరద ఉధృతి ఉన్నందున తెప్పోత్సవాన్ని నిలకడగానే నిర్వహిస్తున్నారు. ఈ కమనీయ జలవిహారాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా పది ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. చివరిరోజు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. దసరా ఉత్సవాలు ముగిసిన తరువాత 6, 7 తేదీల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భవాని భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి అలంకారం.. శ్రీరాజరాజేశ్వరీదేవి

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆశ్వయుజ శుద్ధ దశమి బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ.. శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. దసరా ఉత్సవాల సంపూర్ణ పుణ్యాన్ని అందరికీ అందించే అపరాజితాదేవిగా, చల్లనితల్లిగా ఆమె భక్తులను అనుగ్రహించనుంది.

టీటీడీ స్థలంలో దుర్గమ్మ భక్తులకు వసతి: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) తరఫున టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలతో సారె సమర్పించారు. కలెక్టర్ ఢిల్లీరావు, ఈవో భ్రమరాంబ స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ కుమ్మరిపాలెం సెంటర్‌లో ఉన్న టీటీడీ స్థలంలో ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తులకు వసతి కల్పించేందుకు కృషిచేస్తామని చెప్పారు. దాతల సహకారంతో అమ్మవారి ఆలయంలో రావిచెట్టు కింద ఉన్న ఇంద్రకీలాద్రి క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామి విగ్రహానికి బంగారు తొడుగు, ఆలయానికి వెండి తొడుగు ఏర్పాటు చేస్తామని తెలిపారు. టీటీడీ చైర్మన్ దంపతుల వెంట టీటీడీ ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి ఉన్నారు.


విజయవాడ కనకదుర్గమ్మకు సారెను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ దంపతులు

దుర్గమ్మను దర్శించుకున్న న్యాయమూర్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దేవీనవరాత్రులను పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై మహిషాసురమర్ధనిదేవిగా అలంకరించిన దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డి.వెంకటరమణ, జస్టిస్ బి.ఎస్.భానుమతి, జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్ తదితరులు మంగళవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన న్యాయమూర్తులకు ఆలయ ఈవో భ్రమరాంబ స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.


అమ్మవారి సన్నిధిలో జస్టిస్ వెంకట రమణ కుటుంబం

కొనసాగుతున్న అల్పపీడనం

- ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలపై అధిక ప్రభావం
- మరో మూడురోజులు విస్తారంగా వానలు
- ఒకటి రెండుచోట్ల అతి భారీ వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉంది. ఇది ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి వైపునకు వంగి ఉంది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ బుధవారం నాటికి ఆంధ్రప్రదేశ్ తీరంపైకి ప్రవేశించనుంది. మరోవైపు ఈ ఉపరితల ఆవర్తనం నుంచి ఉత్తర కోస్తా మీదుగా ఉత్తరప్రదేశ్ వరకు ద్రోణి విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో బుధ, గురు, శుక్రవారాల్లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాంధ్రల్లో చాలాచోట్ల, రాయలసీమలో ఒకటి రెండుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం నివేదికలో వెల్లడించింది. ముఖ్యంగా బుధవారం విజయనగరం, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఒకటి రెండుప్రాంతాల్లో భారీవర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు కూడా పడే అవకాశం ఉందని తెలిపింది. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55.. గరిష్టంగా 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. మత్స్యకారులు రానున్న రెండు రోజులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని హెచ్చరించింది. మంగళవారం గోపవరంలో 4.9 సెంటీమీటర్లు, గోనెగండ్లలో 4.4, విశాఖపట్నంలో 3.7, రాజమహేంద్రవరంలో 2.6, తునిలో 2.3, అనంతసాగరంలో 2.2, సబ్బవరంలో 2 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

జగన్ పాలనలో సంక్షేమ రాజ్యం

- మంత్రి కొట్టు సత్యనారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్/శ్రీశైలం టెంపుల్: సీఎం వైఎస్ జగన్ పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, సంక్షేమ రాజ్యం నడుస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శ్రీశైలంలో భ్రమరాంబికా దేవికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళ్తూ మంగళవారం గుంటూరుకి వచ్చిన ఆయన దేవదాయ శాఖాధికారులతో సమావేశమయ్యారు. అనంతరం అక్కడ, శ్రీశైలంలో మీడియాతో మాట్లాడుతూ..విజయవాడలోని దుర్గమ్మ దర్శనానికి వచ్చిన సామాన్యులకే ప్రాధాన్యతనిచ్చామన్నారు.

మూడు రాజధానులకు ప్రజా మద్దతు

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధిపర్చే లక్ష్యంతో ప్రభుత్వం మూడు రాజధానులకు కట్టుబడి ఉందని, ఇందుకు ప్రజల మద్దతు మెండుగా ఉందన్నారు. అమరావతి నుండే శాసనసభ నడుపుతాం, శాసనాలు చేస్తామని మంత్రి అన్నారు. అమరావతి రైతుల పేరుతో సాగుతున్న



పాదయాత్రపై మంత్రి స్పందిస్తూ.. అది రియల్ ఎస్టేట్ ముసుగులో చంద్రబాబు ఆడిస్తున్న ఫేక్ యాత్ర అని విమర్శించారు. తాడేపల్లిగూడెంలో మా తరఫున, ప్రభుత్వం తరఫున ఎక్కడా అడ్డంకులు సృష్టించలేదని ఆయన స్పష్టంచేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు రోజుకో కామెంట్ చేస్తుంటారని.. ఆయన వ్యాఖ్యలకు స్పందించాల్సిన అవసరంలేదన్నారు.

స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీశైలంలో కొట్టు సత్యనారాయణ స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రధానాలయ రాజగోపురం ముందు భ్రమరాంబా మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తుల వద్ద శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవదాయ కమిషనర్ హరిజవహర్‌లాల్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు 'ఈ–స్కూటర్లు'

- వాయిదా పద్ధతిలో ప్రభుత్వ, ప్రైవేట్ సిబ్బందికి సర్కారు అవకాశం
- 60 వాయిదాల్లో ధరను చెల్లించేలా ప్లాన్
- ఒక్కో వాహనంపై కిలోవాట్‌కు రూ.10 వేల వరకూ రాయితీ
- రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వేల చార్జింగ్ స్టేషన్లు

సాక్షి, అమరావతి: వాతావరణంలో కాలుష్యం, కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు విద్యుత్ వాహనాల (ఈవీ) వాడకాన్ని ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా డౌన్ పేమెంట్ లేకుండా నేరుగా వాయిదా పద్ధతుల్లో ఉద్యోగులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు ఆంధ్రప్రదేశ్ నూతన పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్ఈడీసీఏపీ) అన్ని ప్రభుత్వ శాఖలకు సమాచారం పంపింది. ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసిన వారికి రాయితీలు కూడా వస్తాయని అందులో పేర్కొంది. ఒక్కో కిలోవాట్ బ్యాటరీ సామర్థ్యానికి రూ.10 వేలు చొప్పున కేంద్రం రాయితీ ఇస్తుంది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి దీనివల్ల ఎక్కువగా ప్రయోజనం చేకూరనుంది. వారు కోరితే ఈ–వాహనాల కొనుగోలుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం ప్రత్యేకంగా సూచించింది.

అందరికీ అవకాశం..

వాహనాలు కొనుగోలు చేసిన ఉద్యోగుల వేతనాల నుంచి 24–60 నెలల్లో వాయిదాలను వసూలు చేసుకునేలా ఏర్పాట్లుచేయనున్నారు. కనీసం నెలకు రూ.2,500 చెల్లించేలా వెసులుబాటు కల్పించనున్నారు. అదే విధంగా ఈ పథకం కింద ప్రభుత్వోద్యోగులకు రుణాలు అందించేందుకు ధనలక్ష్మి బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాతో నెడ్‌కాప్ ఒప్పందం కుదుర్చుకుంది. వడ్డీరేటు 9 శాతం. ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. అయితే, వారు ఆ సంస్థ సీఈఓగానీ లేదా మేనేజర్‌గానీ అధీకృత లెటర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆసక్తిగల ప్రభుత్వ, ప్రైవేటు సిబ్బంది ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎన్ఆర్ఈడీసీఏపీ సూచించింది.

అందుబాటులోకి చార్జింగ్ స్టేషన్లు

ఈవీల ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు నెడ్‌క్యాప్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 109 ఛార్జింగ్ స్టేషన్లు ఉండగా జాతీయ, రాష్ట్ర రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ స్థలాలు, ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు వంటి చోట్ల ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వేల ప్రాంతాలను గుర్తించింది. తక్కువ సమయంలో ఎక్కువ ఛార్జ్ అయ్యే స్టేషన్లని అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ ఏడాది చివరికల్లా 300 ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాలను నెలకొల్పాలని నెడ్‌కాప్ సంకల్పించింది. నగరాలు, పట్టణాల్లో ప్రతి మూడు కిలోమీటర్లకు ఒకటి, జాతీయ రహదారుల్లో 25 కి.మీ.కు ఒకటి ఏర్పాటుచేయనుంది.

● తెలంగాణ

టీఆర్ఎస్ టు బీఆర్ఎస్.. మరో ప్రస్థానం!

- పేరు మారుస్తూ నేడు జనరల్ బాడీ భేటీలో తీర్మానం
- జాతీయ స్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణ కోసమే పేరు మార్పు
- పార్టీ రాజ్యాంగంలో మార్పు చేస్తూ ఎన్నికల కమిషన్‌కు సమాచారం
- ప్రస్తుతానికి పార్టీ జెండా, రంగు, ఎన్నికల చిహ్నం ఇప్పుడున్నవే కొనసాగింపు!

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా రెండు దశాబ్దాల క్రితం పురుడు పోసుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి.. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో కొత్త పాత్ర పోషించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో 'జాతీయత'ను ప్రతిబింబించేలా టీఆర్ఎస్ పేరు మార్పిడికి పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు బుధవారం ముహూర్తం నిర్ణయించారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన తెలంగాణ రాష్ట్ర సమితి పేరును 'భారత రాష్ట్ర సమితి' (బీఆర్ఎస్)గా మారుస్తూ ఏకవాక్య తీర్మానాన్ని ప్రతిపాదించనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1.19 గంటలకు పార్టీ కొత్త పేరుపై అధికారిక ప్రకటన చేయనున్నారు. 'కొత్త పార్టీని ఏర్పాటు చేయడం లేదు. ప్రస్తుతమున్న టీఆర్ఎస్ పేరును మాత్రమే మారుస్తున్నాం. పార్టీ జెండా, రంగు, ఎన్నికల చిహ్నం తదితరాలన్నీ పాతవే ఉంటాయి. ఎన్నికల సంఘం నియమావళి మేరకు పార్టీ పేరు మార్చేందుకు కేవలం జనరల్ బాడీ తీర్మానం సరిపోతుంది. ఈ తీర్మానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించడం కేవలం లాంఛనప్రాయమే' అని టీఆర్ఎస్ కీలక నేత ఒకరు తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ వంటి పార్టీలు ప్రాంతీయ పార్టీలే అయినా.. పలు రాష్ట్రాల ఎన్నికల్లో పోటీ చేస్తూ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. ఇదే తరహాలో టీఆర్ఎస్ ముందుకు వెళ్లనుందని పార్టీ వర్గాలు చెప్పాయి.

బీఆర్ఎస్‌లో 'విడుతలై చిరుతైగల్ కచ్చి' విలీనం!

బీఆర్ఎస్‌లో తమ పార్టీని విలీనం చేసేందుకు తమిళనాడుకు చెందిన 'విడుతలై చిరుతైగల్ కచ్చి' ముందుకు వచ్చింది. బుధవారం తెలంగాణ భవన్ వేదికగా కేసీఆర్ సమక్షంలో విలీన ప్రకటన ఉండనుంది. 'విడుతలై చిరుతైగల్ కచ్చి' పార్టీ నుంచి చిదంబరం లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు తొల్కప్పియన్ తిరుమవలవన్ మంగళవారం సాయంత్రమే హైదరాబాద్‌కు చేరుకున్నారు. కాగా, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జేడీ(ఎస్) అధ్యక్షుడు కుమారస్వామి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

అది ప్రజలే నిర్ణయిస్తారు

పవన్ రాజకీయ భవిష్యత్తుపై చిరంజీవి



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్తులో ప్రజలు ఏ వైపు ఉంటారన్నది వారే నిర్ణయిస్తారని సినీ నటుడు చిరంజీవి చెప్పారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'గాడ్ ఫాదర్' విడుదలవుతున్న సందర్భంగా మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడారు. తన తమ్ముడు పవన్ కల్యాణ్ రాజకీయ పార్టీకి మద్దతు విషయమై స్పందించారు. 'నా తమ్ముడి నిబద్ధత, నిజాయితీ ఇవన్నీ నాకు చిన్నప్పట్నుంచీ తెలుసు. వారు ఏ పక్షాన ఉంటారు? ఎటు ఉంటారు? ఎలా ఉంటారు? అనేది భవిష్యత్‌లో ప్రజలు నిర్ణయిస్తారు. అలాంటివాడు రావాలన్నది నా ఆకాంక్ష. నేనొకవైపు తనొకవైపు ఉండటం కంటే నేను ఉపసంహరించుకుని సైలెంట్ అయిపోతే తను ఎమర్జ్ అవుతాడు. భవిష్యత్‌లో గొప్ప నాయకుడు అవుతాడు. ఆ రోజు రావాలని కూడా నేను కోరుకుంటున్నాను' అని చెప్పారు. 'నేను ఏపీలో ఎంపీగా పోటీ చేయనున్నానని, నా కోడలు ఉపాసన తెలంగాణలో మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీ చేస్తారంటూ క్రియేట్ చేసేవారు సినిమా పరిశ్రమకు వచ్చి రాస్తే అద్భుతమైన కథలు వస్తాయి. ప్లీజ్..' అని చిరంజీవి చమత్కరించారు.

ఉపఎన్నికలో ఓ గ్రామ ఇన్‌చార్జిగా కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి మంత్రులు, ఎమ్మెల్యేలను మండలాలు, గ్రామాల ఇన్‌చార్జ్‌లుగా నియమించిన కేసీఆర్ తాను కూడా ఓ గ్రామానికి బాధ్యుడిగా వ్యవహరించనున్నారు. మర్రిగూడ మండలం లెంకలపల్లికి గజ్వేల్ ఎమ్మెల్యే హోదాలో కేసీఆర్ ఇన్‌చార్జిగా వ్యవహారాలు చక్కబెట్టనున్నారు. కేసీఆర్ మార్గనిర్దేశనంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బృందం అక్కడ ప్రచార కార్యక్రమాలు నిర్వహించనుంది. ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో కేసీఆర్ మంగళవారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. దసరా మరునాడు నుంచి మునుగోడు ఉప ఎన్నిక ప్రచారానికి పార్టీ ఇన్‌చార్జ్‌లు తమ బృందాలతో తరలి వస్తున్నట్లు కేసీఆర్ వెల్లడించారు. అన్ని వర్గాల ఓటర్లను కలిసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. నియోజకవర్గాన్ని 86 యూనిట్లుగా విభజించి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. నామినేషన్ల దాఖలుకు 15వ తేదీ తుది గడువు కాగా, కొత్తగా ఏర్పాటయ్యే బీఆర్ఎస్‌కు ఆలోగా కేంద్ర ఎన్నికల సంఘం ధ్రువీకరణ లభిస్తే టీఆర్ఎస్ అభ్యర్థి బీఆర్ఎస్ తరఫున పోటీకి దిగుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

సూర్యలంక తీరంలో ఆరుగురు గల్లంతు

- సముద్ర స్నానానికొచ్చిన 8 మంది విజయవాడ సింగ్‌నగర్ విద్యార్థులు
- ఒడ్డుకు కొట్టుకొచ్చిన మూడు మృతదేహాలు
- మరో ముగ్గురి కోసం గాలింపు
- ఇద్దరు క్షేమం



అభి, చింతల సిద్ధూ(ఫైల్)

బాపట్ల టౌన్: బాపట్ల జిల్లా సూర్యలంక సముద్రతీరంలో ఆరుగురు విద్యార్థులు గల్లంతయ్యారు. వారిలో ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. బాధితులు, పోలీస్ అధికారుల కథనం ప్రకారం... విజయవాడ సింగ్‌నగర్‌లోని పైపులరోడ్డుకు చెందిన విద్యార్థులు చందన కైలాష్, బెజ్జం అభి, చింతల సిద్ధూ, సాయిమధు, జక్కంపూడి ప్రభుదాస్, సర్వసిద్ది ఫణి, రాఘవ, వసంత పరిశుద్ధరావు తదితరులు సముద్ర స్నానం కోసం మంగళవారం ఉదయం బాపట్ల బీచ్‌కు వచ్చారు. చందన కైలాష్‌ను ఒడ్డున ఉండి దుస్తులు, సెల్‌ఫోన్లు చూడమని, మిగిలిన ఏడుగురు స్నానానికి దిగారు. పది నిమిషాల పాటు సరదాగా గడిపారు. ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి బెజ్జం అభి (17), చింతల సిద్ధూ(17) సముద్రంలోకి కొట్టుకుపోయారు. వారిని కాపాడేందుకు ప్రయత్నించిన సాయిమధు (15), జక్కంపూడి ప్రభుదాస్, సర్వసిద్ది ఫణి, రాఘవ, వసంత పరిశుద్ధరావు నీట మునిగారు. అయితే పరిశుద్ధరావు గట్టిగా కేకలు వేయడంతో మెరైన్ పోలీసులు అతడిని మాత్రమే కాపాడగలిగారు. బెజ్జం అభి, చింతల సిద్ధూ, సాయిమధు మృతదేహాలు మధ్యాహ్నానికి ఒడ్డుకుకొట్టుకువచ్చాయి. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ కె.వి జయకృష్ణన్, జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అప్రమత్తమయ్యారు. రాఘవ, జక్కంపూడి ప్రభుదాస్, సర్వసిద్ది ఫణి కోసం 15 మంది మెరైన్ సిబ్బంది, 10 మంది రూరల్ పోలీసులు, 20 మంది గజఈతగాళ్లు రెండు బోట్‌ల సహాయంతో గాలిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరంతా టెన్త్, ఇంటర్ చదువుతూ డ్యాన్స్ స్కూల్‌లో ప్రాక్టీసు చేస్తున్నారు. ఖాళీ సమయాల్లో క్యాటరింగ్ పనులకు వెళ్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నారు.


సాయిప్రణీదీప్(ఫైల్)

ఏనుగుల దాడిలో గొర్రెల కాపరి మృతి

మృతదేహం కోసం వెళ్లిన వారిపైనా దాడికి ప్రయత్నించిన ఏనుగులు



పెద్దపంజాణి: ఏనుగుల దాడిలో ఓ గొర్రెలకాపరి మృతిచెందాడు. ఈ ఘటన చిత్తూరు జిల్లా, పెద్దపంజాణి మండలంలోని జిట్టంవారిపల్లి గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగింది. జిట్టంవారిపల్లి గ్రామానికి చెందిన గంగయ్య(73) గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన యథావిధిగా మరికొందరు గొర్రెలకాపరులతో కలిసి మంగళవారం ఉదయం గొర్రెలను మేత కోసం సమీపంలోని కీలపట్ల అటవీ ప్రాంతంలోకి తోలుకువెళ్లాడు. ఆ ప్రాంతంలో నెలరోజులుగా తిష్టవేసిన ఏనుగుల గుంపు ఒక్కసారిగా దాడి చేయడంతో గంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు సమీపంలో ఉన్న గొర్రెల కాపరులు పరుగుతీసి ప్రాణాలు కాపాడుకున్నారు. వారు గ్రామానికి వెళ్లి గంగయ్య మృతి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు అడవిలోకి వెళ్లిన వారిపైనా ఏనుగులు తిరగబడటంతో అక్కడ నుంచి వెనుదిరిగారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి, వారి సాయంతో మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

మీ వెంటే మేమంతా

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తోన్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ప్రజా సంక్షేమానికై అహర్నిశలూ శ్రమిస్తున్న జగనన్న వెంటే తామంతా నడుస్తామని నాయకులతో ప్రజలు చెబుతున్నారు. అన్ని జిల్లాల్లో మంగళవారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.



శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కొత్త కూర్మినాయుడుపేటలో వృద్ధులకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



కోనసీమ జిల్లా మలికిపురం మండలం గొల్లపాలెంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు



ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం రెడ్డిగణపవరంలో సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మహిళకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణం 25వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



కృష్ణాజిల్లా పెనమలూరు మండలం గోసాలలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

శాసనసభలో ప్రభుత్వ విప్‌గా శ్రీకాంత్‌రెడ్డి

సాక్షి,అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసన సభలో రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా గడికోట శ్రీకాంత్ రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు సాధారణ పరిపాలన విభాగం(రాజకీయం) ముఖ్య కార్యదర్శి రేవు ముత్యాలరాజు మంగళవారం విడుదల చేశారు.

దొంగయాత్రను అడ్డుకోవడం ఖాయం

737వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నేతలు



తాడికొండ: అమరావతి రైతుల ముసుగులో కుల ఉగ్రవాదులు చేస్తున్న దొంగయాత్రలు కట్టిపెట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు అడ్డుకోవడం ఖాయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 737వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో పలువురు నాయకులు పాల్గొని ప్రసంగించారు. అమరావతి జేఏసీ పాదయాత్రలో రైతులు లేరని, టీడీపీ నాయకులే బౌన్సర్లను ఏర్పాటు చేసుకుని చేస్తున్న ఖరీదైన దొంగ యాత్రను కట్టిపెట్టాలన్నారు. 'రియల్ ఎస్టేట్ వద్దు-రియల్ స్టేట్ ముద్దు' అంటూ అమరావతి జేఏసీ పాదయాత్రకు నిరసనగా తాడేపల్లిగూడెంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, నల్ల బెలూన్‌లతో నిరసన తెలియజేయడం హర్షణీయమన్నారు. కులవాదుల ఆగడాల గురించి అన్ని ప్రాంతాల ప్రజలకు వాస్తవాలను తెలియజెప్పేందుకు బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా యాత్రను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, పులి దాసు, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్, పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

షార్‌లో అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం

విద్యార్థులు అంతరిక్ష రంగంవైపు దృష్టి సారించాలని తమిళనాడు గవర్నర్ రవి సూచన



షార్‌లో అంతరిక్ష వారోత్సవాలను ప్రారంభిస్తున్న తమిళనాడు గవర్నర్ రవి

సూళ్లూరుపేట: దేశంలోని ప్రతి ఒక్కరికీ అంతరిక్ష సాంకేతిక ప్రగతి ఫలాలను అందుతున్నాయని.. ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ఎంతో ప్రశంసనీయమైందని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి అన్నారు. మంగళవారం సూళ్లూరుపేటలోని షార్‌లో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన జరిగిన సభలో రవి మాట్లాడుతూ.. విక్రమ్ సారాభాయ్, సతీష్ ధవన్ వంటి ఎందరో మహానుభావుల కృషి వల్ల నేడు భారత్ అంతరిక్ష ప్రయోగాల్లో ఉన్నత స్థానానికి చేరుకుందన్నారు. చంద్రయాన్, మంగళ్‌యాన్ వంటి ప్రయోగాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఇప్పుడు మానవ సహిత యాత్రకు సిద్ధమవ్వడం చూస్తుంటే ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థులు అంతరిక్ష రంగం వైపు దృష్టి సారించాలని సూచించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ.. వరదలు, భూకంపాలకు సంబంధించి ఇస్రో ఉపగ్రహాలు ఇస్తున్న సమాచారంతో ఆస్తి, ప్రాణనష్టాలను తగ్గుతున్నాయని చెప్పారు. ఇస్రో ప్రయోగాల ఫలితాలు సామాన్యుడికి సైతం అందుతున్నాయన్నారు. అందుకే ఈసారి స్పేస్ సస్టెయిన్‌బిలిటి అనే అంశం మీద అంతరిక్ష వారోత్సవాలను జరుపుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఇస్రో శాస్త్రవేత్తలుగా తయారయ్యేందుకు గాను అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం మీద అవగాహన కల్పించే కార్యక్రమాలను 5 రాష్ట్రాల్లోని 22 పట్టణాల్లో చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు సి.రఘురామ్, ఆర్.సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరుపై పంచాయతీలకు ర్యాంకులు



- 9 కేటగిరిల్లో వివరాల సేకరణ
- ప్రతి కేటగిరి వారీగా 20–25 అంశాలతో ప్రశ్నావళి
- దాని ప్రకారం దేశ, రాష్ట్ర స్థాయిలో మూడేసి ఉత్తమ అవార్డులు
- దరఖాస్తు చేసుకోకపోతే కేంద్ర ఆర్థిక సంఘం నిధుల నిలుపుదల

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలకు వాటి పనితీరు ఆధారంగా దేశ, రాష్ట్రస్థాయిలో వేర్వేరుగా ర్యాంకులు ఇచ్చేందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ యోచిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించడం ద్వారా పేదరిక నిర్మూలనలో అభివృద్ధి.. ప్రజల ఆరోగ్య పరిస్థితిలో పురోగతి.. గ్రామంలో మౌలిక వసతులు.. నీటి వనరులు.. పారిశుధ్యం, పచ్చదనం పరిస్థితులు.. పంచాయతీ సొంత ఆదాయ వనరులను పెంపొందించుకోవడంతో పాటు వృద్ధులు, వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతి.. పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్.. వంటి తొమ్మిది అంశాల ఆధారంగా ర్యాంకులు కేటాయించనున్నారు. వీటి కేటాయింపునకు ప్రతి అంశంలోనూ 20–25 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ రూపొందించింది. దీని ప్రకారం.. అత్యుత్తమ ర్యాంకులు పొందిన గ్రామ పంచాయతీలకు జాతీయ స్థాయి ఉత్తమ పంచాయతీ అవార్డులను ఇవ్వడంతో పాటు రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ పంచాయతీ అవార్డును అందజేస్తారు. 9 కేటగిరిల్లో మూడేసి చొప్పున జాతీయ, రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ పంచాయతీలను ఎంపికచేసి అవార్డులిస్తారు.

అవార్డులకు తప్పకుండా పోటీపడాల్సిందే..

మరోవైపు.. అన్ని గ్రామ పంచాయతీలు ఈ అవార్డుల ఎంపికకు తప్పనిసరిగా పోటీపడాల్సిందేనని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు స్పష్టంచేశారు. ఈ అవార్డులకు పోటీపడని పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు నిలిపివేసే అవకాశం ఉంటుందన్నారు. అలాగే..

- ర్యాంకులకు సంబంధించి ప్రత్యేక వెబ్‌సైట్‌ను కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సూచించింది.
- ప్రశ్నావళి ప్రకారం పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో ఈనెల 31లోగా నమోదు చేసుకోవాలి. వెంటనే పోర్టల్‌లో మార్కులు ప్రత్యక్షమవుతాయి.
- ఉత్తమ మార్కులు పొందిన మూడేసి పంచాయతీలకు అవార్డులతో పాటు మిగిలిన పంచాయతీలకు స్కోర్ ఆధారంగా ర్యాంకులిస్తారు.

గోదావరిలో నీటి లభ్యతపై శాస్త్రీయ అధ్యయనం

- 50 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా లెక్క
- మార్చి నాటికి అధ్యయనం పూర్తి
- కేంద్రానికి నివేదిక ఇవ్వనున్న సీడబ్ల్యూసీ
- దాని ఆధారంగా గోదావరి–కావేరి అనుసంధానం
- శాస్త్రీయంగా నీటి లభ్యత తేల్చాకే అనుసంధానం చేపట్టాలని ఏపీ సూచన
- ఏకీభవించిన కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి
- శాస్త్రీయంగా నీటి లభ్యతను తేల్చాలని సీడబ్ల్యూసీకి ఆదేశం



సాక్షి, అమరావతి: గోదావరిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా అంచనా వేసేందుకు కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) కసరత్తు చేస్తోంది. మార్చి నాటికి అధ్యయనాన్ని పూర్తి చేసి కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిక ఇవ్వనుంది. ఈ నివేదిక ఆధారంగా మిగులు జలాలను లెక్క గట్టి, దాని ఆధారంగా గోదావరి – కావేరి అనుసంధానం చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఇచ్చంపల్లి నుంచి 247 టీఎంసీల గోదావరి జలాలను నాగార్జునసాగర్ (కృష్ణా), సోమశిల (పెన్నా), గ్రాండ్ ఆనకట్ట (కావేరి)కి తరలించేందుకు జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ప్రతిపాదించింది. ఇందుకు పరివాహక ప్రాంతాల పరిధిలోని రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలతో కేంద్రం సంప్రదింపులు జరిపింది. పోలవరం, కాళేశ్వరం ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చిన సమయంలో లెక్కకట్టిన నీటి లభ్యతకు, గోదావరి–కావేరి అనుసంధానంలో పేర్కొన్న నీటి లభ్యతకు పొంతన లేదని ఏపీ ప్రభుత్వం ఇటీవలి ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంలో అభ్యంతరం తెలిపింది. గోదావరిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చాకే అనుసంధానం చేపట్టాలని సూచించింది. ఏపీ వాదనతో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఏకీభవించారు. కేంద్ర జల్ శక్తి శాఖ ఆదేశాల మేరకు గోదావరిలో 50 ఏళ్ల ప్రవాహాల ఆధారంగా నీటి లభ్యతను సీడబ్ల్యూసీ లెక్కిస్తోంది.

నీటి లభ్యత పక్కాగా తేలేనా..?

మహారాష్ట్రలో పశ్చిమ కనుమల్లో నాసిక్ వద్ద పురుడుపోసుకునే గోదావరి 1,465 కిలోమీటర్ల పొడవున ప్రవహించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో 3,12,150 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ నదీ పరివాహక ప్రాంతం ఉంది. ఇది దేశ భౌగోళిక విస్తీర్ణంలో 9.5 శాతంతో సమానం. సీడబ్ల్యూసీ గోదావరి పరివాహక ప్రాంతాన్ని తొమ్మిది ఉప పరివాహక ప్రాంతాలుగా విభజించి 2019లో నీటి లభ్యతపై పునఃపరిశీలన చేసింది. 1985–86 నుంచి 2014–15 మధ్య 30 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాలను పరిగణనలోకి తీసుకొని 75 శాతం లభ్యత ఆధారంగా 3,334.39 టీఎంసీలు ఉన్నట్లు తేల్చింది. దీనిపై పరివాహక ప్రాంతంలోని రాష్ట్రాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. వందేళ్ల లేదా కనీసం 50 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా అధ్యయనం చేయాలని స్పష్టంచేశాయి. ఈ క్రమంలో తాజా అధ్యయనంలోనైనా నీటి లభ్యతను సీడబ్ల్యూసీ పక్కాగా తేలుస్తుందా? లేదా? అన్నది తేలాల్సి ఉంది.

ఎనిమిదో సారి అధ్యయనం

గోదావరిలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ ప్రస్తుతం చేస్తున్న అధ్యయనం ఎనిమిదోది. స్వాతంత్య్రానికి పూర్వం 1901–03లో ఫస్ట్ ఇరిగేషన్ కమిషన్ అధ్యయనం చేసి 75 శాతం లభ్యత ఆధారంగా గోదావరిలో 3,306.64 టీఎంసీలు ఉంటాయని అంచనా వేసింది. 1962లో కృష్ణా, గోదావరి కమిషన్ 3,341.47 టీఎంసీలు ఉన్నట్లు తేల్చింది. దాని ఆధారంగానే బచావత్ ట్రిబ్యునల్ 1980 జూలై 8న పరివాహక ప్రాంతంలోని రాష్ట్రాలకు నీటిని పంపిణీ చేసింది.

గోదావరిలో నీటి లభ్యతపై ఇప్పటిదాకా చేసిన అధ్యయనాలు

సంవత్సరం	అధ్యయనం చేసిన సంస్థ	నీటి లభ్యత (75 శాతం ఆధారంగా) (టీఎంసీలలో)
1901–03	ఫస్ట్ ఇరిగేషన్ కమిషన్	3,306.64
1949	భోస్లా ఎంపిరియల్ ఫార్ములా	3,554.72
1960	సీడబ్ల్యూ అండ్ పీసీ	3,266.14
1962	కృష్ణా, గోదావరి కమిషన్	3,341.47
1988	సీడబ్ల్యూసీ	3,341.47
1993	సీడబ్ల్యూసీ	3,130.49
2019	సీడబ్ల్యూసీ	3,334.39

బందరు పోర్టుకు పూర్వవైభవం

న్యాయపరమైన చిక్కులు తొలగడంతో త్వరలో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన

సాక్షి, అమరావతి: మచిలీపట్నం (బందరు) పోర్టు నిర్మాణానికి న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడంతో త్వరలో శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టడానికి ఏపీ మారిటైమ్ బోర్డు ప్రణాళిక సిద్ధంచేస్తోంది. ఏపీ చరిత్రలో ఒక వెలుగు వెలిగిన ఈ పోర్టు త్వరలో పూర్వవైభవం పొందనుంది. అలాగే, బందరు పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు.. మచిలీపట్నం వద్ద ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పుడు పోర్టు నిర్మాణం కూడా జరిగితే ఫుడ్ ప్రాసెసింగ్, పోర్టు ఆధారిత పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమలు కూడా ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభిస్తాయని అంచనా. కేవలం పోర్టులను నిర్మించడమే కాకుండా పోర్టు ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించేలా మెరైన్ ఎకనామిక్ జోన్స్‌ను అభివృద్ధి చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు ఏపీ మారిటైమ్ బోర్డు డిప్యూటీ సీఈఓ రవీంద్రనాథ్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఇందుకోసం పోర్టు పరిసరాల్లో కనీసం నాలుగు నుంచి ఐదువేల ఎకరాల్లో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గుంటూరు నుంచి మిర్చి, పొగాకు వంటి వాణిజ్య పంటలతో పాటు ప్రకాశం జిల్లా గ్రానైట్ పరిశ్రమ నుంచి ఎగుమతులకు ఈ పోర్టు అనువుగా ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రాంతం నుంచి ఎగుమతుల కోసం చెన్నై, విశాఖపట్నం పోర్టులకు వెళ్లాల్సి వస్తోందని, అదే బందరు పోర్టు అందుబాటులోకొస్తే లాజిస్టిక్ వ్యయం భారీగా తగ్గుతుందని రైట్స్ సంస్థ రూపొందించిన డీపీఆర్‌లో వివరించింది. అలాగే, తెలంగాణలోని ఫార్మా, టెక్స్‌టైల్స్ వంటి పరిశ్రమలకు కూడా బందరు పోర్టు దగ్గరగా ఉండటం కలిసొచ్చే అంశం. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోర్టుకు శంకుస్థాపన చేయనున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు.

రూ.3,670.67 కోట్ల పనులకు టెండర్లు

- రూ.5,156 కోట్లతో బందరు పోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా నాలుగు బెర్తుల నిర్మాణం కోసం ఏపీ మారిటైమ్ బోర్డు రూ.3,670.67 కోట్ల విలువైన పనులకు టెండర్లను పిలిచింది.
- నాలుగు బెర్తుల్లో రెండు సాధారణ, ఒకటి బొగ్గుకు, మరొకటి బహుళ అవసరాలకు వినియోగించేలా నిర్మిస్తారు.
- 46.606 మిలియన్ క్యూబిక్ మీటర్ల డ్రెడ్జింగ్ పనులతో పాటు మౌలిక వసతులను అభివృద్ధి చేస్తారు.
- కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ 30 నెలల్లో పనులను పూర్తిచేయాలి.
- నాలుగు బెర్తుల ద్వారా ఏడాదికి 35 మిలియన్ టన్నుల సరుకు రవాణా సామర్థ్యాన్ని ఈ పోర్టు కలిగి ఉంటుంది.
- 2040 నాటికి బెర్తుల సంఖ్య 11కి చేర్చడమే కాకుండా సరుకు నిర్వహణ సామర్థ్యం 115.97 మిలియన్ టన్నులు, బొగ్గు నిర్వహణ 32.28 మిలియన్ టన్నులకు చేర్చాలన్నది లక్ష్యం. ఇందుకోసం మొత్తం రూ.11,463 కోట్లు అవసరమవుతాయని అంచనా.
- తొలిదశ నిర్మాణ పనులు ద్వారా 10,000 మందికి, పోర్టు నిర్వహణ సమయంలో 5,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.
- ఇక రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా మూడు పోర్టులను నిర్మిస్తుండగా ఇప్పటికే రామాయపట్నం పోర్టు పనులు మొదలయ్యాయి. త్వరలో భావనపాడు పోర్టు పనులు కూడా ప్రారంభం కానున్నాయి.

జాతీయ రిజిస్ట్రేషన్ల విధానంలోకి ఏపీ!

- దేశమంతా ఒకే రిజిస్ట్రేషన్ల విధానం కోసం కేంద్రం ప్రయత్నాలు
- ఇప్పటికే 12 రాష్ట్రాల్లో ఎన్‌జీడీఆర్ఎస్ సాఫ్ట్‌వేర్‌తోనే రిజిస్ట్రేషన్లు
- ఏపీలోని రేణిగుంట, కంకిపాడులోనూ ప్రయోగాత్మకంగా అమలు

సాక్షి, అమరావతి: దేశమంతా ఒకే తరహా రిజిస్ట్రేషన్ల విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీనికోసం జాతీయ రిజిస్ట్రేషన్ల విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా ప్రపంచ బ్యాంకు నిధులతో నేషనల్ జనరిక్ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సిస్టమ్(ఎన్‌జీడీఆర్ఎస్)ను ప్రవేశపెట్టింది. ఇప్పటికే 12 రాష్ట్రాల్లో ఈ విధానం అమలవుతుండగా.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ కూడా ఇందులో భాగం కాబోతోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అనుకూలంగా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు దేశంలో ఎక్కడైనా వ్యాపారం చేసుకునేందుకు వీలుగా దీనికి రూపకల్పన చేశారు. ప్రస్తుతం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రిజిస్ట్రేషన్ల విధానం ఉండడం వల్ల పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ఆస్తులు, లీజ్ అగ్రిమెంట్లతో పాటు రిజిస్ట్రేషన్ల వ్యవహారాలన్నీ దేశమంతా ఒకేలా ఉండేందుకు ఎన్‌జీడీఆర్ఎస్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను పుణే ఎన్ఐసీ అభివృద్ధి చేసింది. ఈ విధానంలో రిజిస్ట్రేషన్ల వ్యవహారాలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయి. ఈ విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేసేందుకు పుణే ఎన్ఐసీ, ఏపీ ఎన్ఐసీ సంయుక్తంగా పనిచేస్తున్నాయి.

పైలట్ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుతం ఏపీలో రిజిస్ట్రేషన్ల కోసం వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ స్థానంలో ఎన్‌జీడీఆర్ఎస్‌ను తీసుకురానున్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు, తిరుపతి జిల్లా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేయనున్నారు. పూర్తి అవగాహన వచ్చిన తర్వాత.. రాష్ట్రమంతా అమలు చేయాలని భావిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు వచ్చిన ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని.. అలాంటి సమస్యలు ఇక్కడ ఎదురవ్వకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రిజిస్ట్రేషన్లలో అవకతవకలకు ఏ మాత్రం ఆస్కారం లేకుండా కొత్త విధానాన్ని రూపొందించారని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ వి.రామకృష్ణ చెప్పారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు ఇది చాలా అనుకూలమన్నారు.

క్లుప్తంగా

17న రాష్ట్రానికి జర్మనీ, నార్వే అంబాసిడర్‌ల రాక

- రెండు రోజులు రాష్ట్రంలో పర్యటన

సాక్షి, అమరావతి: జర్మనీ, నార్వే దేశాల అంబాసిడర్‌ల బృందం ఈ నెల 17వ తేదీన రాష్ట్రానికి రానుంది. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను రెండు రోజులపాటు ఈ బృందం పరిశీలించనుంది. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 'అమృత్ సరోవర్' పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో కొత్త నీటి చెరువుల తవ్వకం, పాత చెరువులకు పునరుజ్జీవం వంటి కార్యక్రమాలను చేపట్టింది. ఈ కార్యక్రమం అమలులో కేంద్రం ప్రభుత్వం నిర్ధారించిన ఆగస్టు 15వ తేదీ నాటికి మన రాష్ట్రం దేశంలో మూడో స్థానంలో నిలిచింది. జర్మనీ, నార్వే అంబాసిడర్ల బృందం రాష్ట్రంలో అమృత్ సరోవర్ కింద చేపట్టిన అభివృద్ధి పనులతోపాటు ఇటీవల భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించనుంది.

అమరావతి పాదయాత్రకు నిరసన సెగ



తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో నిరసన తెలుపుతున్న స్థానికులు

తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అమరావతి రైతుల పేరుతో సాగుతున్న పాదయాత్రకు నిరసన సెగ తగిలింది. 'జగన్ కోరుకునేది అందరి అభివృద్ధి-చంద్రబాబు కోరుకునేది అస్మదీయుల అభివృద్ధి' 'మూడు రాజధానులకు ప్రజామోదం', 'జగన్‌ది అభివృద్ధి మంత్రం-చంద్రబాబుది రాజకీయ కుతంత్రం' అంటూ ఫ్లెక్సీలు, నల్ల బెలూన్లు యాత్ర సాగే మార్గంలో వెలిశాయి. తాడేపల్లిగూడెంలోని ఎస్వీఆర్ సెంటర్లో యాత్రను నిరసిస్తూ స్థానికులు మంగళవారం నినాదాలు చేశారు.

ఏపీలో ఏకలవ్య జాతీయ క్రీడలు



డిసెంబర్ 17 నుంచి 23 వరకు మెగా స్పోర్ట్స్ ఈవెంట్

- విజయవాడ, గుంటూరు, ఏఎన్‌యూలో క్రీడా వేదికలు
- 15 వ్యక్తిగత విభాగాలు, 7 టీమ్ గేమ్స్‌లో పోటీలు
- పోటీపడనున్న 4,970 మంది క్రీడాకారులు
- గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో శాప్ ఆధ్వర్యాన నిర్వహణ

సాక్షి, అమరావతి: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) 3వ జాతీయ క్రీడా పోటీలకు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇవ్వనుంది. డిసెంబర్ 17 నుంచి 23వ తేదీ వరకు గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఈ పోటీలను నిర్వహించనుంది. మొత్తం 15 వ్యక్తిగత విభాగాలు, 7 టీమ్ గేమ్స్ కేటగిరీల్లో పోటీలు ఉంటాయి. దేశ వ్యాప్తంగా 4,970 మంది క్రీడాకారులు పోటీపడనున్నారు. ఈ మేరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, లయోలా కాలేజీ గ్రౌండ్స్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఆయా పోటీల వేదికలను ఖరారు చేశారు.

అండర్ 14, 19 విభాగాల్లో వ్యక్తిగత పోటీలు

ఈ మెగా టోర్నీలో అండర్-14, 19 బాలబాలికలు వ్యక్తిగత విభాగాల్లో పోటీ పడనున్నారు. వీటిల్లో ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, చెస్, జిమ్నాస్టిక్స్, జూడో, టెన్నిస్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ (ఫ్రీ స్టైల్), యోగా ఉన్నాయి. టీమ్ స్పోర్ట్స్‌లో కేవలం అండర్-19 బాలబాలికలకు మాత్రమే అవకాశం కల్పించారు. ఇందులో బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఉన్నాయి. ఈ పోటీల్లో మొత్తం 180 జట్లు పాల్గొంటాయి. అండర్-14 వ్యక్తిగత పోటీల్లో 632 మంది బాలురు, 634 మంది బాలికలు, అండర్-19 కేటగిరీలో బాలురు 727, బాలికలు 770 మంది, టీమ్ గేమ్స్‌లో బాలురు 1,135, బాలికలు 1,072 మంది పాల్గొంటారు.

రాష్ట్ర జట్టుకు 487 మంది ఎంపిక

రాష్ట్ర జట్టు ఎంపిక కోసం గత నెలాఖరున అరకు గిరిజన స్పోర్ట్స్ స్కూలులో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించారు. రాష్ట్రంలో 28 ఏకలవ్య గురుకులాల నుంచి వెయ్యి మంది కిపైగా క్రీడాకారులు పాల్గొనగా, వారిలో 487 మందిని ఎంపిక చేశారు. ఎక్కువ పతకాలు సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర జట్టుకు డిసెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు గురుకులాల్లో ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం

ఏకలవ్య గురుకుల పాఠశాలల 3వ జాతీయ క్రీడా పోటీలను రాష్ట్రంలో నిర్వహించడం ప్రభుత్వానికి గర్వకారణం. గిరిజన సంక్షేమ శాఖ సమన్వయంతో శాప్ ఈ జాతీయ టోర్నీకి అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర జట్టు ఎంపికను పూర్తి చేశాం. ఎక్కువ పతకాలు సాధించే విభాగాలపై దృష్టి సారించాం.

– ఎన్.ప్రభాకరరెడ్డి, శాప్ ఎండీ

6,603.63 టీఎంసీలు కడలిలోకి

- పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- కృష్ణా, గోదావరి, వంశధార నదుల్లో స్థిరంగా వరద
- గతేడాది కంటే ఈ ఏడాది ఇప్పటికే 3,546.46 టీఎంసీలు అధికంగా సముద్రంలోకి



సాక్షి, అమరావతి: పరీవాహక ప్రాంతాల్లో (బేసిన్‌లో) విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరి, కృష్ణా, వంశధార నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. బేసిన్‌లో ప్రాజెక్టులన్నీ నిండటంతో ఈ మూడు నదుల నుంచి జూన్ 1న మొదలైన ప్రస్తుత నీటి సంవత్సరంలో మంగళవారం ఉదయం 6 గంటల వరకు 6,603.63 టీఎంసీలు బంగాళాఖాతంలో కలిశాయి. గత నీటి సంవత్సరంలో ఈ మూడు నదుల నుంచి 3,057.17 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. ఈ నీటి సంవత్సరంలో ఇప్పటికే గతేడాది కంటే 3,546.46 టీఎంసీలు అధికంగా కడలిపాలవడం గమనార్హం. గత మూడేళ్ల కంటే ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదుల్లో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది.

» గోదావరి వరద ఉద్ధృతికి ఎగువన జైక్వాడ్ ప్రాజెక్టు నుంచి దిగువన ధవళేశ్వరం బ్యారేజ్ వరకు బేసిన్ పరిధిలోని అన్ని ప్రాజెక్టులు నిండాయి. దీంతో మిగులు జలాలను ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఈ నీటి సంవత్సరంలో మంగళవారం ఉదయం 6 గంటల వరకు ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 5,759.74 టీఎంసీల ప్రవాహం వచ్చింది. గోదావరి డెల్టాకు 90.74 టీఎంసీలను విడుదల చేసి, మిగిలిన 5,669 టీఎంసీలను కడలిలోకి వదిలేశారు. గతేడాది ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 2,752.84 టీఎంసీల ప్రవాహం చేరగా.. గోదావరి డెల్టాలో ఖరీఫ్, రబీ పంటలకు 250.59 టీఎంసీలను విడుదల చేసి, మిగిలిన 2,502.25 టీఎంసీలను సముద్రంలోకి వదిలేశారు.

» కృష్ణా పరవళ్లు తొక్కుతుండటంతో ఎగువన ఆల్మట్టి నుంచి దిగువన ప్రకాశం బ్యారేజ్ వరకు బేసిన్ పరిధిలోని ప్రాజెక్టులన్నీ నిండాయి. జూన్ 1 నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు ప్రకాశం బ్యారేజ్‌లోకి 934.243 టీఎంసీల ప్రవాహం వచ్చింది. కృష్ణా డెల్టాకు 95.49 టీఎంసీలను విడుదల చేసి, మిగిలిన 838.753 టీఎంసీలను కడలిలోకి వదిలేశారు. గత నీటి సంవత్సరంలో ప్రకాశం బ్యారేజ్‌లోకి 671.92 టీఎంసీల ప్రవాహం చేరగా.. కృష్ణా డెల్టాలో ఖరీఫ్, రబీ పంటలకు 170.56 టీఎంసీలను విడుదల చేసి, మిగిలిన 501.36 టీఎంసీలను సముద్రంలోకి వదిలేశారు.

» గొట్టా బ్యారేజ్‌లోకి వంశధార ప్రవహిస్తోంది. జూన్ 1 నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు గొట్టా బ్యారేజ్‌లోకి 110.78 టీఎంసీల ప్రవాహం వచ్చింది. వంశధార ఆయకట్టుకు 14.902 టీఎంసీలను విడుదల చేసి, మిగిలిన 95.878 టీఎంసీలను సముద్రంలోకి వదిలేశారు. గతేడాది గొట్టా బ్యారేజ్‌లోకి 75.55 టీఎంసీల ప్రవాహం చేరగా.. వంశధార ఆయకట్టులో ఖరీఫ్, రబీ పంటలకు 21.99 టీఎంసీలను విడుదల చేసి, మిగిలిన 53.56 టీఎంసీలను సముద్రంలోకి వదిలేశారు.

చంద్రబాబుది నకిలీ పోరాటం

మంత్రి రోజా ధ్వజం



తణుకులో ఎడ్ల బండి తోలుతున్న మంత్రి రోజా, చిత్రంలో మంత్రి కారుమూరి, చీఫ్ విప్ జగ్గిరెడ్డి

తణుకు అర్బన్: రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షనేత చంద్రబాబు మాత్రం తన బినామీల కోసం అమరావతి రైతుల పాదయాత్ర పేరిట నకిలీ పోరాటం చేస్తున్నారని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా విమర్శించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఎడ్ల బలప్రదర్శనలో మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. చంద్రబాబు మాత్రం తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం తాపత్రయపడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలంతా దసరా సందర్భంగా జగనన్న తీసుకున్న మూడు రాజధానుల సంకల్పం నెరవేరేలా అమ్మవార్ల ఆలయాల్లో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి కారుమూరితోపాటు ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ మహమ్మద్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య పాల్గొన్నారు.

నెమలి కృష్ణుడికి బంగారు పంచె బహూకరణ



నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో బంగారు పంచెను అందజేస్తున్న తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, శారద

నెమలి(గంపలగూడెం): ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలిలోని శ్రీవేణుగోపాల స్వామికి ఒక భక్తుడు బంగారు పంచెను బహూకరించారు. గంపలగూడేనికి చెందిన వ్యాపారి తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, శారద దంపతులు స్వామికి పర్వదినాల సమయంలో అలంకరణ కోసం వినియోగించే విధంగా రూ.20,78,400 వెచ్చించి 407.900 గ్రాముల బంగారంతో పంచెను తయారు చేయించారు. ఈ బంగారు పంచెను ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కావూరి శశిరేఖ, ప్రధాన అర్చకుడు తిరునగరి గోపాలాచార్యులకు మంగళవారం అందజేశారు. దాతలను అర్చకులు ఆశీర్వదించి స్వామి చిత్రపటాన్ని, ప్రసాదం అందజేశారు. దాత కుటుంబీకులు ఒగ్గు జయశ్రీ, వీరకుమార్, బూతుకూరు కీర్తి, మనోహర్, తల్లపురెడ్డి అనంతరెడ్డి పాల్గొన్నారు.

బాతువలో ఉద్రిక్తత



బాతువలో రోడ్డెక్కిన గ్రామస్తులు

జి.సిగడాం: మండలంలోని బాతువ గ్రామంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. రజక కులస్తులకు, ఇతర వర్గాల వారికి చిన్నగా మొదలైన గొడవ చినికి చినికి గాలివానగా మారింది. మంగళవారం ఉదయం పది గంటలకు మొదలైన ఘర్షణ రాత్రి 9.30 గంటలకు వరకు కొనసాగింది. ఏ సమయంలో ఎలాంటి కొట్లాట చూడాల్సి వస్తుందోనని స్థానికులు భయపడ్డారు. అయితే ఊరివారంతా సమన్వయం పాటించడంతో గొడవ సద్దుమణిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే..

బాతువ గ్రామానికి చెందిన 40 రజక కుటుంబాల వారు ఈ నెల 3న శ్రీకాకుళంలో ధర్నా చేశారు. ఈ ధర్నాకు రాష్ట్ర రజక సంఘం డైరెక్టర్ యువశ్రీ హాజరై సర్పంచ్ డి.ఆదినారాయణపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. అనంతరం గ్రామంలో రజక కులస్తులతో సమావేశమయ్యారు. దీంతో గ్రామంలోని వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చేసిన తప్పేమిటని ప్రశ్నించారు. ఆరోపణలు చేసిన వారు తక్షణం బాతువ గ్రామస్తులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గ్రామంలోని ఐదు వేల మంది రోడ్డుపైకి రావడంతో ఊరిలో వాతావరణం వేడెక్కింది. అంతా కలిసి యువ శ్రీ క్షమాపణలు చెప్పాల్సిందే అని డిమాండ్ చేశారు. దీంతో తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, రణస్థలం సీఐ బీహెచ్ స్వామినాయుడు, స్థానిక ఎస్‌ఐ సామంతుల రామారావులు కలిసి ఇరువర్గాలకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. రాత్రి 9.30 గంటలకు గ్రామపెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి ఇరువర్గాల వారిని శాంతింపజేశారు. గ్రామంలో ఎలాంటి గొడవ జరగకుండా సహకరించాలని కోరారు. దీనికి అంతా సమ్మతించారు. ఆఖరికి యువశ్రీ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న పరిస్థితి వేరని, తనకు వచ్చిన సమాచారం వేరని తెలిపారు. గ్రామ పెద్దలంతా కలిసికట్టుగా ఉన్నారని, వారి తప్పేమీ లేదని చెప్పారు. ఊరివారంతా కలిసి ఉండాలని కోరారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న యువశ్రీ

రెండో దశకు అంతా సిద్ధం



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

- ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు బడుల్లో పేదల చేరిక
- ఒకటో తరగతిలో ప్రవేశాలు అంతా పారదర్శకం
- అక్టోబర్ 10లోగా ఎంపికైన పాఠశాలల్లో అడ్మిషన్లు పొందాలి
- ఎంఈఓ కార్యాలయాల్లో, విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఎంపిక జాబితా సిద్ధం

శ్రీకాకుళం న్యూకాలనీ:

నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలన్న ప్రభుత్వం ఆలోచన తుది అంకానికి చేరుకుంది. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అనుసరించి సెక్షన్ 12(1)సి ప్రకారం 2022-23 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు అందిస్తున్నారు. తొలి విడతలో ఎంపికైన విద్యార్థులు ఇప్పటికే అడ్మిషన్లు పొందారు. తాజాగా రెండో విడతకు సంబంధించి ఎంపికైన విద్యార్థుల వివరాలు మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో సిద్ధంగా ఉంచారు.

10 లోగా అడ్మిషన్లు పొందాలి..

ఎంపికైన విద్యార్థులు అక్టోబర్ 10వ తేదీలోగా ఎంపికైన ప్రైవేటు పాఠశాలల్లో చేరాలి. నిర్ణీత గడువు లోగా అడ్మిషన్లు పొందకపోతే సీట్లను కోల్పోవాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించి ప్రవేశాలు పొందాలని డీఈఓ సూచిస్తున్నారు.

వెబ్‌సైట్‌లో ఎంపికైన జాబితా..




ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాలని ప్రభుత్వం ఇప్పటికే భావించింది. ఇది చాలా గొప్ప నిర్ణయం. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం సెక్షన్ 12(1)సి ప్రకారం ప్రవేశాలు కల్పిస్తున్నాం. రెండో విడత ఎంపికైనవారి జాబితాను మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో ఉంచాం. అలాగే విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ://సీఎస్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్//వెబ్‌పోర్టల్‌లో కూడా ఎంపికైనవారి జాబితా అందుబాటులో ఉంది. అక్టోబర్ 10లోగా విధిగా అడ్మిషన్లు పొందాలి.

– గార పగడాలమ్మ, డీఈఓ, శ్రీకాకుళం

1998 డీఎస్సీ అభ్యర్థులకు శుభవార్త

- టైమ్ స్కేల్ విధానంలో పనిచేయడానికి సమ్మతించిన 433 మంది సర్టిఫికెట్ల పరిశీలన
- ఈ నెల 6,7 తేదీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు చర్యలు
- ఈ నెల 6వ తేదీన ఎంపికైన జాబితాలో క్రమ సంఖ్య నంబర్ 1 నుంచి 216 వరకు పరిశీలన
- 7వ తేదీన 217 నుంచి 433 నంబర్ వరకు పరిశీలన



శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ డీఎస్సీ-1998 ద్వారా ఎంపికై టైమ్ స్కేల్ పద్ధతి ప్రకారం ఉపాధ్యాయునిగా పని చేసేందుకు సమ్మతి తెలిపిన వారికి శుభవార్త అందింది. వారి ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే జిల్లా నుంచి 433 మంది అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకున్నారు. వీరంతా దాదాపు ఉద్యోగాలకు ఎంపికైనట్టే. అయితే వీరి సర్టిఫికెట్ల పరిశీలన ఒక్కటే పెండింగ్ ఉంది. అయితే తాజాగా సర్టిఫికెట్ల పరిశీలనకు కూడా విద్యాశాఖ చర్యలు తీసుకుంది.

6,7 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన..

తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 6,7 తేదీల్లో పరిశీలించనున్నారు. ఇందులో భాగంగా ఈనెల 6వ తేదీన వెబ్‌సైట్‌లో పేర్కొన్న అర్హుల జాబితాలో క్రమసంఖ్య ఒకటి నుంచి 216వ నంబర్ వరకు పరిశీలించనుండగా, 7వ తేదీన 217 నుంచి 433 నంబర్‌కు వరకు పరిశీలిస్తారు.

జిల్లా కేంద్రంలోని విద్యాశాఖకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల కేంద్రాలుగా ఆయా తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను చేపట్టనున్నారు.

తీసుకురావాల్సిన పత్రాలివే..

ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులు డీఎస్సీ ఇంటర్వ్యూ లెటర్, పాస్ ఫొటోలు 3, ఆన్‌లైన్ రిఫరెన్స్ నంబర్/జిరాక్స్‌కాపీ, హాల్‌టిక్కెట్/ర్యాంక్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్ (బీసీ,ఎస్సీ,ఎస్టీ), అకడమిక్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు (టెన్త్/ఇంటర్/డిగ్రీ/పీజీ/ఇతరాలు), టెక్నికల్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు (డీఈడీ/బీఈడీ), స్టడీ సర్టిఫికెట్లు/రెసిడెన్స్ సర్టిఫికెట్లు, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు, పీహెచ్‌సీ సర్టిఫికెట్ (అర్హులైనవారు), అలాగే పై ధ్రువీకరణ పత్రాలన్నీ మూడు సెట్ల జిరాక్స్ కాపీలపై (సెల్ఫ్ అటెస్టేషన్)చేసి తీసుకురావాల్సి ఉంటుందని డీఈఓ గార పగడాలమ్మ స్పష్టం చేశారు. సమయ పాలన పాటించాలని సూచించారు.

విస్తరిస్తున్న గుట్కా మాఫియా

- టెక్కలి, కోటబొమ్మాళి మండలాల్లో రూ.లక్షల్లో వ్యాపారాలు
- ఒడిశా నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా

టెక్కలి: టెక్కలి, కోటబొమ్మాళి మండలాల్లో గుట్కా మాఫియా వ్యాపారం చాప కింద నీరులా విస్తరిస్తోంది. ఒడిశా ప్రాంతం నుంచి యథేచ్ఛగా గుట్కాను అక్రమ రవాణా చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో పాన్‌షాప్‌లకు సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా డివిజన్ కేంద్రమైన టెక్కతో పాటు కోటబొమ్మాళి, నిమ్మాడ ప్రాంతాల్లో సిండికేట్‌గా గుట్కా అక్రమ వ్యాపారం కొనసాగుతోంది. టెక్కలికి ఆనుకుని ఒడిశా ప్రాంతం దగ్గరగా ఉండడమే కాకుండా ఆ ప్రాంతం నుంచి అడ్డదారుల్లో గుట్కా అక్రమ వ్యాపారానికి అడ్డు లేకపోవంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. డివిజన్ కేంద్రమైన టెక్కలిలో కొన్ని ప్రాంతాల్లో లక్షల విలువ కలిగిన గుట్కా నిల్వలు ఉన్నప్పటికీ పోలీసులు కనీసం కన్నెత్తి చూడకపోవడంపై ఆశ్చర్యం కలిగిస్తోంది.

నిమ్మాడ అడ్డాగా..

కోటబొమ్మాళితో పాటు నిమ్మాడ అడ్డాగా కొంత మంది గుట్కా వ్యాపారులు లక్షల రూపాయల విలువ కలిగిన గుట్కాను నిల్వ చేసినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ఖరీదైన కార్లలో గుట్కాను అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం. కొంత మంది పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒడిశాలో వెయ్యి.. ఆంధ్రాలో రూ.4వేలకు పైనే

ఒడిశా ప్రాంతంలో కేవలం వెయ్యి రూపాయలకు లభించే గుట్కా బాక్సు ఇక్కడ రూ.4 వేలకు పైగా ధర పలుకుతోంది.

దీంతో కొంత మంది గుట్కా వ్యాపారులు యువతకు ఎర వేస్తున్నారు. రోజుకు వెయ్యి నుంచి ఆ పైన సంపాదించవచ్చనే భావన కల్పిస్తూ వారిని ఈ వ్యాపారంలోకి దించుతున్నారు. దీంతో బృందాలుగా ఏర్పడి ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాల్లో అడ్డదారుల్లో ఒడిశా ప్రాంతం నుంచి గుట్కాను అక్రమంగా రవాణా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా గుట్కా అక్రమ వ్యాపారానికి కళ్లెం వేయకపోతే యువత ఇలాంటి వ్యాపారంలోకి దిగి భవిష్యత్‌ను నాశనం చేసుకునే ప్రమాదం ఉంది.

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువులు

దేవీ నవరాత్రుల సందర్భంగా శ్రీకాకుళంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు ఆకట్టుకుంటున్నాయి. విశాఖ బి కాలనీలో నివాసముంటున్న చట్టి తిరుమలరావు, సరస్వతీ దంపతుల ఇంట్లో గత 75 ఏళ్లుగా సంప్రదాయంగా వస్తున్న ఆచారంగా బొమ్మల కొలువులను ఈ ఏడాది కూడా అందంగా ఏర్పాటు చేశారు. అలాగే గుడివీధిలోని కూనపులి రామశాస్త్రి, విజయలక్ష్మీ దంపతులు కూడా గత 25ఏళ్లుగా బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తు వారి సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్



గుడివీధిలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు



విందు భోజనాలలో పెళ్లికొడుకు పెళ్లి కూతురు



కారులో ఊరేగింపు

సాక్షి బిజినెస్

బుధవారం
5-10-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,277	387
58,065	17,274

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,093	▲	278
డోజోన్స్	30,109	▲	619
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,086	▲	178
డాక్స్	12,670	▲	461
షాంఘై (సెప్టెంబర్ 30 ముగింపు)	3,024	▼	17
నికాయ్	26,992	▲	776

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

నేటి నుంచి 4 నగరాల్లో జియో 5జీ బీటా సర్వీసులు

న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం జియో బుధవారం నుంచి (నేడు) 4 నగరాల్లో 5జీ సర్వీసుల ట్రయల్స్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించనుంది. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, వారణాసి ఈ నగరాల్లో ఉన్నాయి. జియో ట్రూ 5జీ వెల్‌కమ్ ఆఫర్ కింద 5జీ సేవలను ప్రయత్నించాల్సిందిగా ఎంపిక చేసిన కస్టమర్లకు ఆహ్వానం పంపనున్నట్లు సంస్థ తెలిపింది. ఈ ఆఫర్ కింద సదరు సబ్‌స్క్రయిబర్స్‌కు సెకనుకు 1 గిగాబిట్ వేగంతో అపరిమిత 5జీ డేటా లభిస్తుందని పేర్కొంది. ఆహ్వానం పొందిన యూజర్లను తమ ప్రస్తుత జియో సిమ్‌ను లేదా 5జీ హ్యాండ్‌సెట్‌ను మార్చుకోవాల్సిన అవసరం లేకుండానే జియో ట్రూ 5జీ సర్వీస్‌కి అప్‌గ్రేడ్ చేయనున్నట్లు కంపెనీ వివరించింది. ట్రయల్‌లో 5జీ డేటాకు అదనపు చార్జీలు ఉండబోవని పేర్కొంది.

ట్రాక్సన్ టెక్నాలజీస్ ఐపీఓ.. షేరు ధర రూ. 75-80

న్యూఢిల్లీ: ప్రైవేట్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ట్రాక్సన్ (టీఆర్‌ఏసీఎక్స్‌ఎన్) టెక్నాలజీస్ ఈ నెల 10న పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు షేరుకి రూ. 75–80 ధరల శ్రేణిని ప్రకటించింది. 12న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 309 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఐపీవోలో దాదాపు 3.87 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనుంది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	51,286	▲	899
బంగారం (99.5 స్వచ్ఛత)	51,081	▲	896
వెండి (కిలో)	61,034	▲	3,717


కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-10-2022	
విశాఖ	430-00
చిత్తూరు	423-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	66.00
4-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

మార్కెట్లకు గ్లోబల్ జోష్

ప్రపంచవ్యాప్తంగా బలపడిన సెంటిమెంటుతో దేశీయంగానూ స్టాక్ మార్కెట్లకు హుషారొచ్చింది. ఇన్వెస్టర్లు మూకుమ్మడిగా కొనుగోళ్లకు ఎగబడటంతో తొలి నుంచీ మార్కెట్లు జోరందుకున్నాయి. వెరసి సెన్సెక్స్ 58,000, నిఫ్టీ 17,000 పాయింట్ల మైలురాళ్లను మరోసారి అధిగమించాయి. అన్ని రంగాలూ లాభాలతో ముగిశాయి. దీంతో మిడ్ క్యాప్స్ సైతం హైజంప్ చేశాయి.

- ప్రపంచ మార్కెట్ల దన్నుతో హైజంప్
- సెన్సెక్స్ 1,277 పాయింట్లు జూమ్
- 387 పాయింట్లు దూసుకెళ్లిన నిఫ్టీ
- మళ్లీ 58,000 దాటిన సెన్సెక్స్
- 17,274 వద్ద ముగిసిన నిఫ్టీ
- మెటల్, బ్యాంకింగ్, ఐటీ జోరు



ముంబై: ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు పరుగందుకోవడంతో దేశీయంగానూ బుల్ కదం తొక్కింది. సెన్సెక్స్ 1,277 పాయింట్లు పురోగమించి 58,065 వద్ద నిలిచింది. నిఫ్టీ 387 పాయింట్లు జంప్‌చేసి 17,274 వద్ద స్థిరపడింది. వెరసి ప్రధాన ఇండెక్సులు సాంకేతికంగా కీలకమైన 58,000–17,000 పాయింట్ల మైలురాళ్లను సులభంగా దాటేశాయ్. ప్రారంభంనుండీ ఇన్వెస్టర్లు అన్ని రంగాల కౌంటర్లలోనూ కొనుగోళ్లకు క్యూ కట్టడంతో మార్కెట్లు రోజంతా భారీ లాభాలతో సందడి చేశాయి. దీనికితోడు ముందురోజు విదేశీ ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) అమ్మకాలు ఆపి కొనుగోళ్లు చేపట్టడం ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు చెప్పారు.

అన్ని రంగాలూ లాభాల్లోనే...

ఎన్‌ఎస్‌ఈలో అన్ని రంగాలూ 3–1 శాతం మధ్య లాభపడ్డాయి. ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఐటీ 3 శాతం పుంజుకోగా.. మీడియా, ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ 2 శాతం ఎగశాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఇండస్‌ఇండ్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్ ద్వయం, కోల్ ఇండియా, టీసీఎస్, యూపీఎల్, హీరోమోటో, జేఎస్‌డబ్ల్యూ, హిందాల్కో, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఎల్ అండ్‌టీ, విప్రో, ఐటీసీ, యాక్సిస్, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్ 5–3 శాతం మధ్య జంప్ చేశాయి. బ్లూచిప్స్‌లో కేవలం పవర్‌గ్రిడ్ 1 శాతం నీరసించగా.. డాక్టర్ రెడ్డీస్ స్వల్పంగా క్షీణించింది.

'దసరా' సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు

యూఎస్ దూకుడు...

ఒక్కసారిగా మారిన పరిస్థితులతో సోమవారం అమెరికా సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లు దూకుడు చూపాయి. మంగళవారం ట్రేడింగ్‌లో ఆసియా, యూరోపియన్ మార్కెట్లు సైతం 2.5–3% మధ్య ఎగశాయి. కేంద్ర బ్యాంకు ఆరోసారి వడ్డీ రేట్లను పెంచడం ద్వారా తొమ్మిదేళ్ల గరిష్టం 2.6%కి ప్రామాణిక రేట్లను చేర్చినప్పటికీ ఆస్ట్రేలియా స్టాక్ ఇండెక్స్ 4% జంప్ చేసింది. తాజా గణాంకాలు డాలరు ఇండెక్స్, ట్రెజరీ ఈల్డ్స్‌ను దెబ్బతీశాయి. ఫెడ్ ఇకపై వడ్డీ రేట్ల పెంపు అంశంలో నెమ్మదించవచ్చన్న తాజా అంచనాలు స్టాక్స్ సహా పసిడి, వెండి, చమురు, క్రిప్టో కరెన్సీలకు డిమాండును పెంచినట్లు విశ్లేషకులు వివరించారు.

ఇన్వెస్టర్ల సంపద ప్లస్...

స్టాక్ మార్కెట్లు బౌన్స్‌బ్యాక్ కావడంతో ఇన్వెస్టర్ల సంపదగా వ్యవహరించే లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్(విలువ) భారీగా ఎగసింది. ఒక్క రోజులోనే దాదాపు రూ. 5,66,319 కోట్లు జమయ్యింది. వెరసి బీఎస్‌ఈ మార్కెట్ విలువ రూ.2,73,92,740 కోట్లకు బలపడింది. బీఎస్‌ఈ ప్రధాన ఇండెక్స్ సెన్సెక్స్ 2.3% జంప్ చేయగా, అన్ని రంగాలూ బలపడ్డాయి. మిడ్, స్మాల్ క్యాప్స్ 2.4–1.4% చొప్పున పుంజుకున్నాయి. వీటికితోడు మెటల్స్, ఫైనాన్షియల్స్, బ్యాంకింగ్, ఐటీ 3%స్థాయిలో లాభపడటం మార్కెట్ విలువకు దన్నునిచ్చింది.

రూపాయి అప్



డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ బలపడింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో మంగళవారం ట్రేడింగ్‌లో 20 పైసలు పుంజుకుని 81.62 వద్ద ముగిసింది. దేశీ ఈక్విటీలలో వరుసగా రెండో రోజు విదేశీ ఇన్వెస్టర్లు నికర పెట్టుబడిదారులుగా నిలవడం, ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు బలహీనపడటం వంటి అంశాలు రూపాయికి ప్రోత్సాహాన్నిచ్చినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. ఇంట్రాడేలో రూపాయి 81.36 వరకూ పుంజుకుంది. 81.66 వద్ద కనిష్టాన్ని తాకింది. విదేశీ మార్కెట్లో డాలరు ఇండెక్స్ 0.5 శాతం నష్టపోయి 111.20కు చేరింది.

బీ న్యూ దసరా దీపావళి ధమాకా ఆఫర్స్



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది సంవత్సరాలుగా 50 లక్షలకు పైగా మొబైల్ వినియోగదారుల అభిమానం, ఆదరణ, విశ్వాసం గెలుచుకున్న తమ సంస్థ దసరా, దీపావళి సందర్భంగా పలు ఆఫర్లను అందిస్తున్నట్లు మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్.. బీ న్యూ ప్రకటించింది. మొబైల్స్ పైనే కాకుండా గృహోపకరణాలపై కూడా అద్భుతమైన ఆఫర్లను అందిస్తున్నట్లు పేర్కొంది. ఎంపిక చేసిన మొబైల్స్‌పై 40 శాతం (రూ. 20,000 వరకూ), యాక్సెసరీస్‌పై 60 శాతం, టీవీలపై రూ. 15,000 వరకూ తగ్గింపును అమలు చేస్తున్నట్లు సంస్థ ఈ సందర్భంగా పేర్కొంది. ఎస్‌బీఐ కార్డ్ ద్వారా జరిగే ప్రతి కొనుగోలుపై 7.5 శాతం వరకూ క్యాష్‌బ్యాక్ తో సహా పలు ఆఫర్లు ఉన్నట్లు సంస్థ తెలిపింది. ఈ మేరకు జరిగిన ఒక కార్యక్రమంలో 'బీన్యూ' సీఎండీ వైడీ బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నిఖిలేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేష్ పాల్గొన్నారు.

ట్విటర్ కొనుగోలుకు మస్క్ ఓకే?

కంపెనీ షేరు 13 శాతం జూమ్; ట్రేడింగ్ నిలిపివేత

న్యూయార్క్: మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్ కొనుగోలు విషయంలో ముందుకే వెళ్లాలని ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం ఎలాన్ మస్క్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ముందుగా అనుకున్న రేటుకే డీల్‌ను పూర్తి చేస్తానని ఆఫర్ చేస్తూ కంపెనీకి ఆయన ఈ మేరకు లేఖ పంపినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ వార్తలతో ట్విటర్ షేరు ఒక్కసారిగా ఎగిసింది. దాదాపు 13 శాతం పెరిగి 47.95కి చేరింది. దీంతో షేర్లలో ట్రేడింగ్ నిల్చిపోయింది. షేరు ఒక్కింటికి 54.20 డాలర్ల చొప్పున మొత్తం 44 బిలియన్ డాలర్లకు ట్విటర్‌ను కొనుగోలు చేస్తానంటూ మస్క్ గతంలో ఆఫర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఆ తర్వాత వివిధ కారణాలు చూపి మస్క్ వెనక్కి తగ్గడంతో వివాదం కోర్టుకు చేరింది. ట్విటర్‌ను కొనుగోలు చేసేలా మస్క్‌ను ఆదేశించాలంటూ దాఖలైన పిటీషన్ .. ఈ నెలలో తదుపరి విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.



జల్లెడ పడుతున్న ఐటీ కంపెనీలు

- మూన్‌లైటింగ్ అభ్యర్థుల ఏరివేత
- తప్పుడు పత్రాలతో చేరిన వాళ్లను సైతం
- ఫ్రెషర్ల నియామకాలు మరింత ఆలస్యం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కంపెనీలు జల్లెడ పడుతున్నాయి. మూన్‌లైటింగ్‌కు పాల్పడిన ఉద్యోగులను, తప్పుడు పత్రాలతో చేరిన సిబ్బందిని ఏరివేస్తున్నాయి. అభ్యర్థులకు ప్రత్యక్షంగా మరోసారి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయి. మరోవైపు బ్యాంక్, ప్రావిడెంట్ ఫండ్ స్టేట్‌మెంట్లను ఉద్యోగుల సమక్షంలో, లైవ్‌లో తనిఖీ చేస్తున్నాయి. స్నేహితులు, సీనియర్ల సహకారంతో గతంలో ఇంటర్వ్యూలు గట్టెక్కినవారు.. ఈ ఇంటర్వ్యూల్లో నోరెళ్లబెడుతున్నారట. కొందరు ఒకటికి మించి ఉద్యోగాలు చేస్తున్నట్టు బయటపడింది. బెంచ్ మీద ఉన్నవారిని క్లయింట్లు స్వయంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండడం కొసమెరుపు. ఈ ఇంటర్వ్యూల్లో విజయం సాధిస్తేనే వేతనం. లేదంటే ఇంటిదారి పట్టాల్సిందే.



నియామకాలు చేపట్టవద్దని..

మూడు నెలల నుంచే జల్లెడ పట్టే కార్యక్రమాన్ని కంపెనీలు ప్రాధాన్యతగా చేపట్టాయి. తప్పుడు అనుభవం, వేతన ధ్రువపత్రాలతో వందలాది మంది చేరినట్టు తేలిందని పరిశ్రమ వర్గాల సమాచారం. విధుల్లో మరొకరి సాయం తీసుకున్నట్టు కొందరిని గుర్తించారు. ఇవన్నీ ఒక కొలిక్కి వచ్చేంత వరకు ఫ్రెషర్ల నియామకాలు చేపట్టవద్దని కంపెనీలు నిర్ణయించుకున్నాయి. ఫ్రెషర్లకు ఆఫర్ లెటర్లు ఇచ్చినప్పటికీ చేరిక తేదీని ఐటీ సంస్థలు వాయిదా వేస్తున్నాయని స్మార్ట్‌స్టెప్స్ కో-ఫౌండర్ నానాబాల లావణ్య కుమార్ సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. ఆఫర్ లెటర్లను రద్దు చేస్తే పరిశ్రమలో తప్పుడు సంకేతం వెళుతుందన్నారు. కాగా.. విప్రో, ఇన్ఫీ, టెక్ మహీంద్రా వంటి కంపెనీలు ఫ్రెషర్లకు ఇచ్చిన ఆఫర్ లెటర్లను రద్దు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

ఇలా బయటపడింది..

మహమ్మారి కాలంలో ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచే విధులు నిర్వర్తించారు. కోవిడ్ తగ్గుముఖం పట్టిన తర్వాత కొన్ని కంపెనీలు హైబ్రిడ్ విధానం, మరికొన్ని పూర్తిగా కార్యాలయం నుంచి విధులను అమలులోకి తెచ్చాయి. కొందరు ఆఫీస్‌కు రాలేమని పట్టుపట్టారు. సిబ్బంది ఎందుకు ఇలా చేస్తున్నారనే అంశంపై కంపెనీలు లోతుగా పరిశీలించాయి. వీరు మూన్‌లైటింగ్‌కు పాల్పడుతున్నట్టు తేలింది. కంపెనీలు పట్టుపట్టడంతో అధికంగా జీతం ఇచ్చే సంస్థల్లో ఇటువంటివారు చేరారు. ఆఫీస్‌లో ప్రత్యక్షంగా పని చేయాల్సి రావడంతో తప్పుడు అనుభవంతో చేరినవారు సాంకేతిక పరిజ్ఞానం లేక చేతులెత్తేశారు. మోసపూరితంగా చేరినవారిని రాజీనామా చేసి వెళ్లిపోవాల్సిందిగా కంపెనీలు ఆదేశిస్తున్నాయి.

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

టీఎస్‌పీఎస్సీ ఏఈఈ, ఏఈ-2022 స్టడీమెటీరియల్, ప్రీవియస్ పేపర్స్, బిట్‌బ్యాంక్, గైడెన్స్ కోసం... — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఏపీలో 72 ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆయుష్ విభాగంలో మెడికల్ ఆఫీసర్(ఆయుర్వేద) పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 72
» అర్హత: ఆయుర్వేదంలో బ్యాచిలర్‌డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. » వయసు: 01.07.2022 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.57,100 నుంచి రూ.1,47,760 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాత పరీక్ష (పేపర్1, 2), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 06.10.2022
» ఫీజు చెల్లింపునకు చివరితేది: 20.10.2022
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.10.2022
» రాత పరీక్ష తేది: నవంబర్ 2022
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఏపీలో 53 మెడికల్ ఆఫీసర్(హోమియోపతి) పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆయుష్ విభాగంలో మెడికల్ ఆఫీసర్(హోమియోపతి) పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 53
» అర్హత: హోమియోపతిలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 01.07.2022 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» జీతం: నెలకు రూ.57,100 నుంచి రూ.1,47,760 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష(పేపర్ 1,2), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 06.10.2022
» దరఖాస్తు ఫీజు చెల్లింపునకు చివరితేది: 20.10.2022
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.10.2022
» రాతపరీక్ష తేది: నవంబర్ 2022
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఏపీ ఆయుష్ విభాగంలో లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆయుష్ విభాగంలో హోమియో లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 34
» అర్హత: సంబంధిత విభాగంలో పీజీ(హోమియోపతి) ఉత్తీర్ణతతోపాటు ప్రకటనలో తెలిపిన విధంగా ఇతర అర్హతలు, బోధనానుభవం ఉండాలి.
» వయసు: 01.07.2022 నాటికి 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష(పేపర్1, పేపర్ 2), ధ్రువపత్రాల పరిశీలన, తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 07.10.2022
» ఫీజు చెల్లింపునకు చివరితేది: 21.10.2022
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.10.2022
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఏపీ ప్రభుత్వ శాఖల్లో 45 నాన్ గెజిటెడ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 45
» పోస్టుల వివరాలు: శాంపిల్ టేకర్(ఏపీ ప్రివెంటివ్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్ ల్యాబ్స్-ఫుడ్(హెల్త్) సబ్-సర్వీస్)-12, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్ గ్రేడ్2(ఏపీ జువెనైల్ వెల్ఫేర్ కరెక్షనల్ సబ్ సర్వీస్)-03, టెక్నికల్ అసిస్టెంట్(జియో ఫిజిక్స్) (ఏపీ గ్రౌండ్ వాటర్ సబ్ సర్వీస్)-04, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్(ఏపీ ఫిషరీస్ సబ్ సర్వీస్)-03, టౌన్ ప్లానింగ్-బిల్డింగ్ ఓవర్‌సీర్(ఏపీ టౌన్, కంట్రీ ప్లానింగ్)-02, జూనియర్ ట్రాన్స్‌లేటర్(తెలుగు)(ఏపీ ట్రాన్స్‌లేషన్ సబార్డినేట్ సర్వీస్)-01, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్(ఏపీ ఇండస్ట్రియల్ సబార్డినేట్ సర్వీస్)-08, టెక్నికల్ అసిస్టెంట్(ఏపీ మైన్స్-జియాలజీ సబ్ సర్వీస్)-04, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్(ఏపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీస్- ఫుడ్(హెల్త్) అడ్మినిస్ట్రేషన్ సబార్డినేట్ సర్వీస్)-08.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్స్ ట్రెనింగ్ సర్టిఫికేట్, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 01.07.2022 నాటికి 18 నుంచి 42ఏళ్లు(జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ పోస్టులకు 25 నుంచి 42 ఏళ్లు) మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష(పేపర్-1,పేపర్-2), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 11.10.2022
» ఫీజు చెల్లింపునకు చివరితేది: 01.11.2022
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.11.2022
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

గేట్ @ ఎంటెక్, పీఎస్‌యూ కొలువు

» ఆలస్య రుసుంతో 7వ తేదీ వరకూ దరఖాస్తుకు గడువు
» గేట్ స్కోర్‌తో ఎంటెక్‌తోపాటు పీఎస్‌యూ ఉద్యోగాలు
» ఉద్యోగ ప్రకటనలను ప్రారంభించిన ప్రభుత్వ రంగ సంస్థలు
» 2023 ఫిబ్రవరి 4,5,11,12 తేదీల్లో గేట్ పరీక్ష

గేట్-2023కు దరఖాస్తు చేశారా.. ఈ స్కోర్‌తో ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఎన్ఐటీల్లో ఎంటెక్‌లో చేరడం టార్గెట్‌గా పెట్టుకున్నారా..ప్రభుత్వ రంగ సంస్థల్లో కొలువు సొంతం చేసుకోవడమే మీ లక్ష్యమా..!!అయితే లక్షల మందితో పోటీ పడేలా ప్రిపరేషన్‌కు పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. ఎందుకంటే.. గేట్‌కు హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య లక్షల్లోనే ఉంటోంది. టాప్ స్కోర్ కోసం సీరియస్ అభ్యర్థులంతా ఇప్పటికే తమ కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. మరోవైపు గేట్ స్కోర్ ఆధారంగా నియామకాలు చేపట్టే పీఎస్‌యూలు సైతం దరఖాస్తు ప్రక్రియను ప్రారంభిస్తున్నాయి!! ఈ నేపథ్యంలో.. గేట్-2023లో రాణించేందుకు మార్గాలు, పీఎస్‌యూల నియామక ప్రక్రియ గురించి తెలుసుకుందాం...

గత కొన్నేళ్లుగా గేట్ స్కోర్ ఉన్నత విద్య కోసమే కాకుండా.. ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ, లేదా ఎగ్జిక్యూటివ్ ట్రైనీ వంటి ఉద్యోగాలకు కూడా మార్గంగా మారుతోంది. దీంతో అభ్యర్థులు గేట్‌లో మెరుగైన స్కోర్ సాధించడానికి విస్తృత అధ్యయనం చేయాలి అంటున్నారు నిపుణులు.

గేట్-2023 ఇలా

- గేట్–2023 పరీక్షను మూడు గంటల వ్యవధిలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.
- రెండు విభాగాల్లో మొత్తం 65 ప్రశ్నలు అడుగుతారు. వంద మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పార్ట్–1లో జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగానికి 15 మార్కులు కేటాయిస్తారు. ఒక మార్కు ప్రశ్నలు అయిదు, రెండు మార్కుల ప్రశ్నలు అయిదు ఉంటాయి.
- ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్‌కు 13 మార్కులు కేటాయించారు.
- అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌తో పార్ట్–బిని నిర్వహిస్తారు. ఈ విభాగంలో 72 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. • ఇలా మొత్తం 100 మార్కులకు గేట్ పరీక్ష జరుగుతుంది.

ప్రశ్నలు.. మూడు రకాలు

- గేట్ పరీక్షలో మూడు రకాల ప్రశ్నలు అడుగుతారు. అవి.. మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్(ఎంసీక్యూ), మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్, న్యూమరికల్ ఆన్సర్ టైప్(ఎన్ఏటీ) ప్రశ్నలు.
- ఎంసీక్యూ విధానంలో.. నాలుగు లేదా అయిదు ఆప్షన్లలో ఏదో ఒక ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించాల్సి ఉంటుంది.
- మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్‌లో.. ఒకటి కంటే ఎక్కువ ఆప్షన్లు సమాధానంగా ఉండే ప్రశ్నలు అడుగుతారు. ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. దానికి సంబంధించిన టాపిక్‌పై పూర్తి స్థాయి అవగాహన కలిగుండాలి.
- న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు కొంత కాలిక్యులేషన్స్‌తో కూడినవిగా ఉంటాయి.

పీఎస్‌యూలకూ గేట్ స్కోరే

గత కొన్నేళ్లుగా నవరత్న, మహారత్న, మినీరత్న వంటి హోదా పొందిన ప్రభుత్వరంగ సంస్థలు గేట్ స్కోర్ ఆధారంగానే ఎగ్జిక్యూటివ్ ట్రైనీ, గ్రాడ్యుయేట్ ఇంజనీర్ వంటి పోస్టులను భర్తీ చేస్తున్నాయి. ఈ కంపెనీలు ముందుగా ఉద్యోగ ప్రకటనలు విడుదల చేస్తున్నాయి. నిర్దిష్ట అకడమిక్ అర్హతలతో పాటు, గేట్ స్కోర్ ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నాయి. ఆ తర్వాత ఆయా సంస్థలు మలి దశ ప్రక్రియ పేరుతో తమ స్వీయ ఎంపిక విధానాన్ని అనుసరిస్తున్నాయి.

వెయిటేజీల వివరాలు

చాలా వరకు పీఎస్‌యూలు గేట్ స్కోర్‌కు 75 శాతం వెయిటేజీ; తర్వాత మలి దశలో నిర్వహించే గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్‌లకు గరిష్టంగా పది శాతం; పర్సనల్ ఇంటర్వ్యూకు పదిహేను శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నాయి. మరికొన్ని పీఎస్‌యూలు గేట్ స్కోర్‌కు 60 నుంచి 65 శాతం వెయిటేజీ ఇస్తూ.. మిగతా మొత్తాన్ని జీడీ/పీఐలకు కేటాయిస్తున్నాయి. ఇలా మొత్తం వంద మార్కులకు అభ్యర్థులు సాధించిన స్కోర్ ఆధారంగా తుది ఎంపిక చేపడుతున్నాయి.

మలి దశలో ఇలా

గేట్ స్కోర్ ఆధారంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మలిదశలో.. గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

గ్రూప్ డిస్కషన్

గ్రూప్ డిస్కషన్‌లో నిర్దిష్ట సంఖ్యలో అభ్యర్థులను వేర్వేరు బృందాలు(టీమ్స్)గా ఏర్పాటుచేస్తారు. ఒక్కో టీమ్‌లో అయిదు నుంచి పది మంది అభ్యర్థులు ఉంటున్నారు. ప్రతి బృందానికి ఏదైనా ఒక అంశం ఇచ్చి.. మాట్లాడాలని సూచిస్తున్నారు. ఈ గ్రూప్ డిస్కషన్ ఇరవై నిమిషాల నుంచి 30 నిమిషాల వ్యవధిలో ఉంటుంది. అంటే.. ప్రతి అభ్యర్థికి సగటున అయిదు నుంచి ఆరు నిమిషాల సమయం లభిస్తుంది. ఈ సమయంలోనే అభ్యర్థులు సదరు టాపిక్‌పై తమ అభిప్రాయాలను, ప్రస్తుత పరిస్థితులను వివరిస్తూ మాట్లాడాల్సి ఉంటుంది.

గ్రూప్ టాస్క్

పలు పీఎస్‌యూలు గ్రూప్ డిస్కషన్‌కు బదులు గ్రూప్ టాస్క్‌ను నిర్వహిస్తున్నాయి. గ్రూప్ టాస్క్ అంటే.. నిర్దిష్టంగా ఒక వాస్తవ సమస్యను అభ్యర్థుల ముందు ఉంచి.. ఆ సమస్యకు పరిష్కారం కనుక్కోవాలని పేర్కొంటున్నాయి. ఇందులో అభ్యర్థులు చదువుకున్న కోర్ సబ్జెక్ట్‌కు సంబంధించిన అంశాలే ఉంటున్నాయి. వీటిని కూడా అభ్యర్థులు బృందాలుగా ఏర్పడి పరిష్కరించాల్సి ఉంటుంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్‌లో విజయం సాధించిన అభ్యర్థులకు చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అభ్యర్థుల వ్యక్తిగత నేపథ్యం, టెక్నికల్ నాలెడ్జ్‌లను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. బీటెక్‌లో చేసిన ప్రాజెక్ట్ వర్క్, మినీ ప్రాజెక్ట్స్, ఇంటర్న్‌షిప్స్, వాటిద్వారా సదరు అభ్యర్థులకు లభించిన నైపుణ్యాలు, అదే విధంగా సమస్యకు చూపిన పరిష్కారం వంటి విషయాలు తెలుసుకునే యత్నం చేస్తారు. దీంతోపాటు సదరు ఉద్యోగానికి సరిపడే దృక్పథం అభ్యర్థిలో ఉందా అనే విషయాన్ని కూడా పరిశీలిస్తారు.

పీఎస్‌యూలకు దరఖాస్తు

- పీఎస్‌యూలు.. గేట్ ఫలితాలు విడుదలైన తర్వాత దరఖాస్తు ప్రక్రియను ప్రారంభిస్తున్నాయి. కాని సంబంధిత నియామక ప్రక్రియ షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటిస్తున్నాయి.
- కొన్ని పీఎస్‌యూలు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నోటిఫికేషన్లను విడుదల చేసి.. షెడ్యూల్, ఎంపిక ప్రక్రియ వివరాలను వెల్లడిస్తున్నాయి.
- 2023 సంవత్సరానికి సంబంధించి ఓఎన్‌జీసీ, గెయిల్, ఐఓసీఎల్, కోల్ ఇండియా వంటి సంస్థలు ఇప్పటికే నోటిఫికేషన్లు విడుదల చేశాయి.

ఐఐటీల్లోనూ.. మలి దశ

ఐఐటీల్లో ఎంటెక్,ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీ వంటి ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గేట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నప్పటికీ.. మలి దశలో ఆయా ఐఐటీలు.. పర్సనల్ టాస్క్, గ్రూప్ డిస్కషన్స్ పేరిట రెండు పరీక్షలను నిర్వహిస్తున్నాయి. కొన్ని ఐఐటీలు ఎస్సే ద్వారా ప్రతిభను అంచనావేస్తున్నాయి. వీటిలో విజయం సాధించిన వారికే సీట్లు ఖరారు చేస్తున్నాయి.

సన్నద్ధత పొందండిలా

గేట్ అభ్యర్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో వ్యూహాత్మక ప్రిపరేషన్ సాగించాలి. ఇందుకోసం తాము ఎంచుకున్న సబ్జెక్ట్‌లో బేసిక్స్ నుంచి అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్ వరకు పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతి సబ్జెక్ట్‌ను చదివేటప్పుడు అందులోని ప్రశ్నార్థమైన టాపిక్స్‌ను గుర్తించాలి. వాటికి సంబంధించిన ప్రాథమిక భావనలపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలి. ఒక టాపిక్ నుంచి ఎన్ని రకాలుగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉందో పరిశీలించాలి. అందుకు అనుగుణంగా మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.



అనుసంధానం

గేట్ అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో అనుసంధాన విధానాన్ని అలవర్చుకోవాలి. గేట్ సిలబస్‌ను అకడమిక్ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ.. ప్రిపరేషన్ సాగించాలి. వీక్లీ టెస్టులు, మాక్ టెస్టులు, మోడల్ టెస్టులకు హాజరు కావాలి. ఈ అప్రోచ్ విజయ సాధనలో ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది.

వెయిటేజీకి అనుగుణంగా

అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లోని టాపిక్స్, వాటికి గత అయిదారేళ్లుగా గేట్‌లో లభిస్తున్న వెయిటేజ్, అకడమిక్‌గా ఉన్న వెయిటేజీ ప్రాధాన్యాన్ని అనుసరిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారానికి ప్రిపరేషన్ పూర్తి చేసుకునేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఆ తర్వాత ఉన్న వ్యవధిలో ఆన్‌లైన్ మోడల్ టెస్టులు, మాక్ టెస్టులకు హాజరయ్యేలా ప్లాన్ చేసుకోవాలి. ఇలా ఇప్పటి నుంచే నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే.. పరీక్షలో మంచి స్కోర్ సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది.

గేట్-2023 ముఖ్య సమాచారం

- మొత్తం 29 పేపర్లలో గేట్ పరీక్ష.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: సెప్టెంబర్ 30, ఆలస్య రుసుముతో అక్టోబర్ 7.
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: జనవరి 3, 2023
- గేట్–2023 పరీక్ష తేదీలు: 2023 ఫిబ్రవరి 4, 5, 11, 12 తేదీల్లో (ప్రతి రోజు రెండు స్లాట్లలో).
- ఫలితాల వెల్లడి: మార్చి 16, 2023
- వెబ్‌సైట్: https://gate.iitk.ac.in

గుడిమల్లంలో హోమం చేసిన విదేశీయులు



హోమం చేస్తున్న విదేశీ భక్తుడు డేవిడ్‌సన్

ఏర్పేడు: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విదేశీయులు పరశురామ తంత్రం హోమం నిర్వహించారు. యూఎస్‌ఏకు చెందిన డేవిడ్‌సన్, అలెక్స్ అభిషేక పూజలు, హోమం చేసి స్వామిని దర్శించుకున్నారు. వేదాల ఆవిర్భావం గురించి పరిశీలన చేసే క్రమంలో ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. అమెరికాలో పోలీస్ ఫోర్స్ ట్రైనీగా విధులు నిర్వహిస్తున్న డేవిడ్ సన్ మాట్లాడుతూ తను పుట్టిన తేదీ ప్రకారం వేద పండితుల సూచనల మేరకు ఉత్తరాభాద్ర నక్షత్రం, మీనరాశి, శివ గోత్రాన్ని స్వీకరిస్తున్నట్లు చెప్పారు. వీరి వెంట గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, గుడిమల్లం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నరసింహ యాదవ్, ఈవో రామచంద్రారెడ్డి ఉన్నారు.

దసపల్లా భూములు కాజేసేందుకు టీడీపీ ప్రయత్నం

- టీడీపీ అధికారంలో ఉండగా తమ వారికి కట్టబెట్టే యత్నం బెడిసికొట్టింది
- భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి
- సీఎం జగన్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు లేఖ

సాక్షి, అమరావతి : విశాఖపట్నంలోని దసపల్లా భూములను కాజేసేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రయత్నించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. అయితే, నాడు దసపల్లా భూములను టీడీపీ నాయకులకు కట్టబెట్టేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు మరోసారి ఆ భూములను కొందరు బిల్డర్లకు అప్పగించడానికి రంగం సిద్ధమైందని, దీని వెనుక కోట్లాది రూపాయల కుంభకోణం దాగి ఉందని ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఆ భూముల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి దసపల్లా భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోము వీర్రాజు మంగళవారం సీఎం వైఎస్ జగన్‌కు లేఖ రాసినట్లు బీజేపీ మీడియా విభాగం ఒక ప్రకటనలో తెలిపింది.

ఫేక్ బాబుకు ప్రజలు షాక్ ఇవ్వడం ఖాయం

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



పెనుమూరు(కార్వేటినగరం): అధికారం కోసం ఎన్నికల్లో ఫేక్ హామీలిచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ప్రజలు మరోసారి షాక్ ఇవ్వడం ఖాయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. పెనుమూరులో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 ఫేక్ హామీలతో ప్రజలను నిలువునా మోసం చేయడాన్ని అందరూ గుర్తించారన్నారు. అయినా 2024లో ఎలాగైనా అధికారాన్ని దక్కించుకునేందుకు తన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌కు స్క్రిప్టులు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వంపై బురదచల్లేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బాబు ఊసరవెల్లి మాటలకు, పవన్‌కళ్యాణ్ సినిమా డైలాగ్‌లకు ప్రజలు ఓట్లు వేయబోరని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందిన ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీకి ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పవన్‌కళ్యాణ్ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఎన్ని సీట్లు వస్తాయి.. టీడీపీ ఎన్ని సీట్లు సాధిస్తుందని చిలక జోష్యం చెప్పడం మానుకుని, ముందు తన పార్టీ ఎన్ని సీట్లు సాధిస్తుందో చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 నియోజకవర్గాల్లో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

8 నుంచి సీఏఎస్‌లకు కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి : వైద్య, ఆరోగ్య శాఖలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 8 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇటీవల వైద్య శాఖలోని డీఎంఈ, డీహెచ్, వైద్య విధాన పరిషత్‌లలో 823 సీఏఎస్ పోస్టుల భర్తీకి వైద్య శాఖ ఉమ్మడి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నియామక ప్రక్రియలో భాగంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇవ్వడం కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

రాహుల్ ప్రధాని అయితే ఏపీకి ప్రత్యేక హోదా

- ఆ ఫైలు మీదే మొదటి సంతకం
- 18 నుంచి 21 వరకు ఏపీలో భారత్ జోడో యాత్ర
- యాత్రను విజయవంతం చేయండి
- కేంద్ర మాజీ మంత్రులు జైరాం రమేష్, దిగ్విజయ్‌సింగ్



పాదయాత్ర పాటల సీడీని విడుదల చేస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దిగ్విజయ్ సింగ్

కర్నూలు (సెంట్రల్): రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితే ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తారని కేంద్ర మాజీ మంత్రులు జైరాం రమేష్, దిగ్విజయ్ సింగ్ చెప్పారు. ఆ ఫైల్‌పైనే మొదటి సంతకం చేస్తారని ప్రకటించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో భారత్ జోడో యాత్ర సన్నాహక సమావేశాన్ని మంగళవారం కర్నూలులో నిర్వహించారు. అనంతరం జైరాం రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. భారత్ జోడో యాత్ర ఈ నెల 18న కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో కొనసాగి కర్ణాటకలోకి ప్రవేశిస్తుందని చెప్పారు. బీజేపీ దేశాన్ని కులం, మతం పేరుతో విభజించాలని చూస్తున్న నేపథ్యంలో రాహుల్‌గాంధీ పాదయాత్రకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ జోడో యాత్రతో నరేంద్రమోడీ పాగో.. కావాలన్న రీతిలో రాహుల్ పాదయాత్రకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

టీఆర్ఎస్‌కు వీఆర్ఎస్సే..

తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మారినా కాంగ్రెస్‌కు ఏమీ కాదని జైరాం రమేష్ చెప్పారు. అది టీఆర్ఎస్‌కే నష్టమన్నారు. బీఆర్ఎస్‌తో టీఆర్ఎస్ వీఆర్ఎస్ తీసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. దిగ్విజయ్‌సింగ్ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా సాధించడంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, ఇతర రాజకీయ పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీతోనే ఏపీకి న్యాయం జరుగుతుందని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే పోలవరం పూర్తిచేస్తామన్నారు. పీసీసీ అధ్యక్షుడు సాకె శైలజానాథ్, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, కేరళ మాజీ సీఎం ఊమెన్ చాందీ, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, హర్ష కుమార్, డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకర్‌బాబు పాల్గొన్నారు. భారత్ జోడో యాత్ర పాట సీడీని ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ద్విగ్విజయ్‌సింగ్ ఆవిష్కరించారు.

పసివాడి చికిత్సకు రూ.16 కోట్లు!

- అనంతపురం జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులకు అరుదైన వ్యాధి
- స్పైనల్ మస్క్యులర్ అట్రోఫి సోకి ఓ బాలుడు మృతి
- తాజాగా రెండో చిన్నారికీ వ్యాధి సోకినట్టు ధ్రువీకరించిన వైద్యులు
- ఇంజక్షన్లకయ్యే ఖర్చు భరించేందుకు ముందుకొచ్చిన పలు సంస్థలు
- తల్లడిల్లుతున్న పేద కుటుంబం

సాక్షి ప్రతినిధి, అనంతపురం/నార్పల: అరుదైన వ్యాధి.. ఓ పేద కుటుంబాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫి అనే జబ్బు వల్ల పెద్ద కుమారుడు దూరమవడం.. చిన్న కుమారుడూ తీవ్ర అనారోగ్యానికి గురవడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. చికిత్సకు అవసరమైన ఇంజక్షన్లకే రూ.16 కోట్లు అవసరం కావడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడగా.. పలు స్వచ్ఛంద సంస్థలు వారికి బాసటగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నాయి. అనంతపురం జిల్లా నార్పలకు చెందిన జేసీబీ డ్రైవర్ రాజు, అరుణ దంపతులకు ఇద్దరు కుమారులు. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫి సోకి పెద్ద కుమారుడు భరత్(6) కొంతకాలం కిందట మృతి చెందగా.. ఇప్పుడు రెండో కుమారుడు ధనుష్(2)కు కూడా ఆ వ్యాధి సోకింది.

ఎంజైముల లోపంతో...

దీనిని జన్యుపరంగా సోకే వ్యాధిగా గుర్తించారు. పెద్ద కుమారుడు భరత్‌కు అనారోగ్య సమస్య కొనసాగుతుండగానే.. రెండో కుమారుడు ధనుష్ 2020 సెప్టెంబర్‌లో జన్మించాడు. 5 నెలల వయసులోనే వ్యాధి లక్షణాలు గుర్తించిన తల్లిదండ్రులు డాక్టర్లను కలిశారు. ఇందులో టైప్ 1, టైప్ 2, టైప్ 3, టైప్ 4 అని నాలుగు రకాల అట్రోఫిలు ఉంటాయి. ఎంజైము లోపంతో వచ్చే వ్యాధిగా వైద్యులు చెబుతున్నారు. మెదడు, వెన్నుపూస సరిగ్గానే ఉన్నా.. కండరాలు పనిచేయకపోవడంతో రోజురోజుకూ అవి బలహీనపడుతూ చివరకు శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ప్రస్తుతం ధనుష్‌కు టైప్ 2 సోకగా.. బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నారు. ఈ జబ్బుకు ఇటీవలే అమెరికాలో మందు కనిపెట్టారని.. ఇది సత్ఫలితాలనిస్తోందని ఆ ఆస్పత్రి వైద్యులతో పాటు వెన్నుపూస వైద్య నిపుణుడు డాక్టర్ జె.నరేష్‌బాబు చెప్పారు. జోల్‌గెన్‌స్మా అనే ఇంజక్షన్‌ను సరైన సమయంలో ఇస్తే ప్రాణాలను కాపాడవచ్చని.. దీని ధరను అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ 1.79 మిలియన్ యూరోలు(రూ.16 కోట్లు)గా నిర్ణయించిందని తెలిపారు. కుమారుడిని దక్కించుకోవాలంటే రూ.16 కోట్లు కావాలని తెలియడంతో రాజు దిక్కుతోచనిస్థితిలో పడ్డాడు.



ఎస్ఎంఏ అనే జబ్బుతో బాధపడుతున్న చిన్నారి ధనుష్

చికిత్సకు ముందుకొచ్చిన సంస్థలు

తీవ్ర అనారోగ్యంతో ఉన్న ధనుష్‌కు అండగా ఉండేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ ఆఫ్ ఇండియా సంస్థ ఇంజక్షన్లకయ్యే రూ.16 కోట్లు వెచ్చిస్తానని ప్రకటించింది. ఇలాంటి జబ్బుతోనే మరణించిన చిన్నారుల తల్లిదండ్రులంతా కలిసి నెలకొల్పిన క్యూర్ ఎస్ఎంఏ ఇండియా ఫౌండేషన్, ఇంపాక్ట్ గురు అనే సంస్థలు వైద్యానికి, ఇతర ఖర్చులకు ఆర్థిక సాయం భరించేందుకు ముందుకొచ్చాయని ధనుష్ తల్లిదండ్రులు రాజు, అరుణ చెప్పారు. ఆ సంస్థల మేలు ఎప్పటికీ మరవలేమంటూ వారు కన్నీటిపర్యంతమయ్యారు.



చిన్నారి ధనుష్‌తో తల్లిదండ్రులు

ఒమన్‌లో చిక్కుకున్న మహిళకు విముక్తి

క్షేమంగా స్వస్థలానికి చేర్చిన ఏపీఎన్ఆర్‌టీఎస్



కడప కార్పొరేషన్: జీవనోపాధి కోసం ఒమన్ దేశానికి వెళ్లి అవస్థలు పడుతున్న ఓ మహిళకు ఏపీఎన్ఆర్‌టీఎస్ అండగా నిలిచింది. ఆమెను క్షేమంగా స్వస్థలానికి చేర్చింది. తిరుపతి జిల్లా బోడెవాండ్లపల్లి జెట్టికి చెందిన కాకి సులోచన ఇంటి పనులు చేసేందుకు ఫిబ్రవరిలో ఒమన్‌కు వెళ్లింది. అక్కడి వాతావరణ పరిస్థితుల వల్ల ఆమెకు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. మరోవైపు యజమాని కూడా జీతం సరిగా ఇవ్వకుండా వేధించేవాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు.. ఆమెను ఒమన్ పంపిన ఏజెంట్లను సంప్రదించగా, తిరిగి తీసుకొచ్చేందుకు రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న వారు... ఏపీఎన్ఆర్‌టీఎస్‌ను సంప్రదించారు. ఆ సంస్థ చైర్మన్ మేడపాటి వెంకట్, సిబ్బంది వెంటనే ఆమె పరిస్థితిని భారత రాయబార కార్యాలయానికి తెలియజేశారు. సులోచనను ఒమన్ దేశానికి పంపిన ఏజెంట్లను కూడా స్థానిక పోలీసుల సహకారంతో విచారించడంతో ఆమె స్వదేశానికి రావడానికి మార్గం సుగమమైంది. ఆమె మంగళవారం స్వస్థలానికి చేరుకుంది. సులోచన మాట్లాడుతూ తనకు కష్టాల్లో అండగా నిలిచి.. స్వదేశానికి తీసుకువచ్చినందుకు సీఎం వైఎస్ జగన్, ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, రాయబార కార్యాలయ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్బీకేల సేవలు ప్రశంసనీయం

కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ కార్యదర్శి పాండే



పంగూరు ఆర్బీకే వద్ద రైతులు, సిబ్బందితో పాండే

సాక్షి, అమరావతి: రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ కార్యదర్శి సుధాన్షు పాండే అన్నారు. తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా ఆయన పంగూరు ఆర్బీకేను సందర్శించారు. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం సేకరణకు ఈ–క్రాప్‌ను అనుసంధానం చేసి పారదర్శకంగా కొనుగోలు చేయడంపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఏపీ పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ వివిధ ప్రాంతాల్లో రైతులకు అందిస్తున్న వ్యవసాయ విజ్ఞానం, యాంత్రీకరణ, వేగవంతమైన ప్రభుత్వ సేవలను పాండేకు వివరించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల కార్పొరేషన్ ఎండీ వీరపాండియన్ పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.

Cell Point

23 Years
#1 Mobile Retail Seller
MOST TRUSTED BRAND

విజయదశమి శుభాకాంక్షలతో...

DUSSEHRA • CASH BACK OFFERS

23వ వార్షికోత్సవ సంబరాలు

₹ Upto 6,900 BAJAJ FINSERV
INSTANT CASHBACK

Upto ₹ 10,000
DIRECT DISCOUNT

Debit Card EMI
0% Down Payment

Smart TV
కేవలం రూ.8,999* కే

Available
32" (80cm)
43" (108cm)
55" (139cm)

Direct Discount Upto ₹10,000

mi | ONEPLUS | itel

CASH BACK upto ₹7,500

Upto 10% CASHBACK

Pay ₹1 Get SMART PHONE

Exchange on any handset damage

micromax
ఇప్పుడు మా వద్ద
ఆన్‌లైన్ కంటే తక్కువ ధరకే

IN2C
3 GB, 32 GB
~~₹7,499~~
₹6,499

IN2B
4 GB, 64 GB
~~₹8,499~~
₹7,499

Stocks ఉన్నత వరకు

EASY EMI
3 Months 0% Interest
Monthly ₹2,500

vivo

Model	Free	EMI	Cash Back
Y22	Airpods ₹199*	₹1450 MONTHLY EMI	Upto ₹1,000
Y75	Smartwatch ₹499*	₹1500 MONTHLY EMI	Upto ₹1,500
V25 5G	Smart Calling Watch ₹999*	₹1866 MONTHLY EMI	Upto ₹2,500
V25Pro 5G	Smart Calling Watch ₹999*	₹1999 MONTHLY EMI	Upto ₹3,500

6 months extended warrenty - 1 time Screen Replacement - Upto ₹6900 Cash Back on Bajaj

oppo

Model	Free	EMI	Offer
A16 E 4 GB 64 GB	Neckband ₹99*	₹1383 MONTHLY EMI	~~₹10990~~ ₹9999
A57	Airpods ₹199*	₹1749 MONTHLY EMI	CASH BACK Upto 10%
A77s	Smartwatch ₹499*	₹1374 MONTHLY EMI	CASH BACK Upto 10%
F21s Pro	Smart Calling Watch ₹999*	₹1733 MONTHLY EMI	CASH BACK Upto ₹3,000

No Cost EMI - Zero Down Payment - Upto ₹6900 Cash Back on Bajaj

mi
Note 11 Pro +
DIRECT DISCOUNT ₹1000
₹1,916 MONTHLY EMI
CASH BACK Upto ₹1,250
Free Airpods

ONEPLUS 5G
10 T | 10 R | 10 PRO
DISCOUNT Upto ₹5,000
CASH BACK Upto ₹6,000

SAMSUNG
Amp your awesome with No Shake Cam
Awespme festive offers starting at ₹24499*

A13 ₹1400 MONTHLY EMI — Airpods ₹199*
DIRECT DISCOUNT ₹1,000

A23 ₹1459 MONTHLY EMI — Smartwatch ₹499*
DIRECT DISCOUNT ₹2,000

A53 ₹1693 MONTHLY EMI — Smart Calling Watch ₹999*
DIRECT DISCOUNT ₹4,000

SMART WATCH
START FROM ₹1499
iPhone
noise
boAt

realme
C21 Y
DIRECT DISCOUNT upto ₹1,000

CASH BACK upto ₹5000
EXCHANGE BONUS upto ₹3000

iphone 14 5G
MRP ~~₹79,990~~ ₹71,900*

iphone 13 5G
MRP ~~₹69,990~~ ₹63,900*

24 MONTHS EMI TENURE
0% Processing Fee
Monthly EMI ₹2,913

Upto 60% Discount on Accessories

Buy any Smart Phone Get...
₹99* | ₹199*
₹499* | ₹999*

UP TO 7.5% CASH BACK* SBI card

Cell Point

IDFC FIRST Bank | HDB | BAJAJ FINSERV | HDFC BANK We understand your world | zest | HOME CREDIT | Pine Labs | TVS CREDIT

శ్రీకాకుళం 08942 228383 • 7 రోడ్ల జంక్షన్ • SBI ఎదురుగా, జి.టి రోడ్ విజయనగరం 90322 15143 • పూల్‌బాగ్ రోడ్, మూడులాంతర్ల జంక్షన్ • హోటల్ వైట్ల రెసిడెన్సీ, ఆర్.టి.సి కాంప్లెక్స్ • స్వామి కాంప్లెక్స్, వాసు ఆప్టికల్స్ ఎదురుగా • గణేష్ బేకరీ ఎదురుగా, మూడులాంతర్ల జంక్షన్. • ఎస్.కోట రాజాం • షాప్ నెం.7, తిరుమల కాంప్లెక్స్, సంపత్ భవన్ ఎదురుగా.
పార్వతీపురం • సూర్యకళ కాంప్లెక్స్, మెయిన్ రోడ్ • షాప్ నెం.13-462, వల్లభరావ్ కాంప్లెక్స్, సూపర్ మార్కెట్ దగ్గర, కరూర్ వైశ్యాబ్యాంక్ ప్రక్కన, మెయిన్ రోడ్.
బొబ్బిలి • షాప్ నెం.16, మున్సిపల్ కాంప్లెక్స్, పాత బస్‌స్టాండ్, డా॥ రెడ్డి సత్యారావు హాస్పిటల్ ఎదురుగా.

* Conditional Apply

Designmouse 9885974411

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali. (Responsible for selection of News under the PRB Act) Phone No.: +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/29482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

మా బ్రాంచీలు: • విశాఖపట్నం • శ్రీకాకుళం • పార్వతీపురం • బొబ్బిలి • రాజాం • విజయనగరం • కాకినాడ • రాజమండ్రి • అమలాపురం • తుని • తణుకు • తాడేపల్లిగూడెం • జంగారెడ్డిగూడెం • భీమవరం • ఏలూరు • విజయవాడ • గుంటూరు • గుడివాడ • హనుమాన్‌జంక్షన్ • ఒంగోలు • తిరుపతి